05-12Pg1exHMNWJQE 1 GNT_05-12Pg1exHMNWJQE.qxd 05/Dec/25 12:21 AM Page 1

ఆదివారం
ప్రతి వారం వేల ప్రత్యేక విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్ 45 years
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-12-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 304 పేజీలు: 12 వెల: 6.50



గురువారం సాయంత్రం ఢిల్లీలోని పాలం విమానాశ్రయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఘనస్వాగతం పలికిన ప్రధాని మోడీ

# ఢిల్లీలో పుతిన్

- రష్యా అధ్యక్షునికి పాలం విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ
- సాదర ఆలింగనంతో తన గౌరవాన్ని ప్రకటించిన ప్రధాని
- ప్రత్యేక వాహనంలో కలిసి ప్రయాణించిన ఇద్దరు అధినేతలు
- రాత్రి పుతిన్‌కు అపూర్వరీతిలో విందు ఇచ్చిన మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** ఏడుదశాబ్దాలుగా రెండుదేశాలమధ్య ఆర్థిక, వాణిజ్య, రక్షణ సంబంధాలు ధృఢంగా ఉన్న క్రమంలో రష్యా అధ్యక్షుడు భారత్‌లో పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. గురువారం సాయంత్రం 6.35 గంటలకు పుతిన్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యారు. ప్రధాని నరేంద్రమోడీ ఎదురేగి ఎయిర్‌పోర్టులో పుతిన్‌ను ఆలింగనం చేసుకుని ప్రత్యేక వాహనం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం ఇరువురు అగ్రనేతలు ఒకే కారులో అక్కడినుంచి బయలుదేరారు. ప్రధాని సొంతకారులోనే పుతిన్ రావడం ఆశ్చర్యంకలిగించింది. గత ఏడాది జులైలో ప్రధానిమోడీ రష్యా పర్యటన సందర్భంగా పుతిన్ చూపిన గౌరవాభిమానాలకు ధీటుగా భారత్‌లో మోడీ పుతిన్‌కు సాదర స్వాగతం పలికారు. రాత్రి ప్రధానిమోడీ రష్యా అధ్యక్షుడికి ప్రైవేటు విందును ఏర్పాటుచేసారు. శుక్రవారం రాష్ట్రపతి >>2

ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో
## నేడు పుతిన్, మోడీ చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 4:** 2 రోజుల పర్యటన కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీలోని పాలం ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు ప్రధాని నరేంద్ర మోడీ ఘన స్వాగతం పలికారు. ఇద్దరు నేతలు శుక్రవారం భారత్ రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర భేటీలో పాల్గొంటారు. ఈ సమావేశానికి హైదరాబాద్ హౌస్ వేదిక కానున్నది. దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఈ భవనంలో ప్రపంచ నేతలు, రాయబారులు సమావేశవుతుంటారు. ఈ భవనం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన హైదరాబాద్ చివరినవాబ్ మీర్‌ఉస్మాన్ అలీఖాన్‌కు చెందింది. ఈ భవనాన్ని నిజాం రాజు ఎంతో ఇష్టంగా కట్టించుకున్నారు. చరిత్రలోకి >>2

# 6 కంపెనీలకు ఎస్ఐపిబి ఆమోదం

**విశాఖ పరిధిలో రూ. 1.69 లక్షల కోట్లు, అమరావతిలో రూ. 87 వేల కోట్లు, తిరుపతి పరిధిలో రూ. 73వేల కోట్ల పెట్టుబడులకు ప్రక్రియ మొదలు**

**సిఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు**


గురువారం సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఎస్ఐపిబి సమావేశం దృశ్యం

**విజయవాడ,డిసెంబరు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే దిశలో రాయితీలు ప్రోత్సాహకలు అధికంగా ఇవ్వాలని సిఎం చంద్రబాబు తెలిపారు. జాతీయ,అంతర్జాతీయంగా అత్యంత భారీగా పెట్టుబడుకు అనుకూల రాష్ట్రం ఎపి అన్నారు. పెట్టుబడులపై పోర్టల్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సిఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికిపైగా ఆమోద ప్రక్రియలోకివచ్చాయని, 45 రోజుల్లోగా వీటికి శంకుస్థాపన జరిగేలా చూడాలని సిఎం చంద్రబాబు అధికారులనుఆదేశించారు. సిఎం అధ్యక్షతన గురువారం సచివాలయంలో >>2

## అమరావతికి త్వరలోనే అధికారిక గుర్తింపు

**చట్ట సవరణకు చకచకా అడుగులు**

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఇక అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు అఫీషియల్ రాజధాని కానున్నది. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాజధాని ఉండాలని అమరావతికి శంఖుస్థాపన చేశారు. ప్రపంచ స్థాయి రాజధానిగా చేయాలని.. అమరావతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కానీ అధికారికంగా ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని అని ఎపి పునర్వవస్థీకరణ చట్టంలోలేదు. ఈ నేపథ్యంలో అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకరణచట్టంలో సవరణచేయడానికి ఇప్పటికే కేంద్రం న్యాయ శాఖ అమోదం >>2

**అఖండ-2 వాయిదా** 2లో


గురువారం నెల్లూరులో కురిసిన భారీ వర్షానికి చెరువుల్లా మారిన రోడ్లు, నీటమునిగిన వాహనాలు

# నెల్లూరు జిల్లాలో కుండపోత

**జలదిగ్బంధంలో నగరం**


**దిత్వా ప్రభావంతో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు**

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** గురువారం ఉదయం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి ఉరుములు మెరుపులతో భారీ నుంచి అతి భారీ వర్షం పడింది. దీంతో ఎటుచూసినా నగరం మొత్తం జలమయం అయిపోయింది. ఇప్పటికే 2 రోజులు నుండి కురుస్తున్న వర్షాలకే లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవ్వగా గురువారం ఉదయం పడిన వర్షానికి వాగులు మొత్తం పొంగిపోయాయి. ప్రాణనష్టంలేకుండా ఉండేందుకు ప్రజలకు >>2



05-12pg2exHMNWJQER 2_05-12pg2exHMNWJQER.qxd 05/Dec/25 12:24 AM Page 1





గురువారం రాత్రి ప్రధాని మోడీ తన అధికార నివాసంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన దృశ్యం

# నేడు పుతిన్, మోడీ చర్చలు

>> వెళ్లే.. బ్రిటీష్ పాలకులు తమ రాజధానిని కోల్‌కతా నుంచి ఢిల్లీకి తరలించారు.ఆ సమయంలో పలువురు రాజులు తమకు కొత్త రాజధానిలో భవనాలు ఉండాలని భావించారు. ఇందు కోసం అలీఖాన్ ప్రస్తుత రాష్ట్రపతి భవన్ పక్క ఉన్న ప్రిన్సెస్ పార్క్ ప్రాంతంలో స్థలం కావాలని బ్రిటీష్ పాలకులను కోరారు. అయితే, ఈ అభ్యర్థనను అంగీకరించిన బ్రిటీష్ ప్రభుత్వం.. కింగ్స్ వే (రాజ్‌పథ్) చివరలో కింగ్ జార్జ్ వి విగ్రహం చుట్టూ హైదరాబాద్, బరోడా, పాటియాలా, జైపూర్, బికనీర్ పాలకులకు భూమిని కేటాయించింది.

నిజాం రాజు, బరోడా రాజు తమ ప్యాలెస్‌ల నిర్మాణ బాధ్యతలను అప్పటి ప్రఖ్యాత ఆర్కిటెక్ట్‌గా పేరుపొందిన ఎడ్విన్ లుటియెన్స్‌కు అప్పగించారు. దాంతో ఆయన 8.2 ఎకరాల స్థలంలో హైదరాబాద్ హౌస్‌ను సీతాకోకచిలుక ఆకృతిలో నిర్మించారు. రెక్కలు పక్క రోడ్లతో కలిసిపోయేలా తీర్చిదిద్దారు. ఈ భవనం దేశ రాజధాని నగరంలో అత్యంత గొప్ప కట్టడాల్లో ఒకటిగా నిలిచింది. 1920లోనే సుమారు 2లక్షల పౌండ్ల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం విలువ రూ.170 కోట్లు. ఈ భవనంలో తన వైభవానికి తగ్గకుండా నిజాం నవాబు కట్టించారు.

ఈ భవనంలో 36 గదులు, ఆరు బ్రైట్ బాత్‌రూంలు, ప్రాంగణాలు, తోరణాలు, అద్భుతమైన మెట్ల మార్గాలు, ఫౌంటెన్స్‌తో లుటియెన్స్ నిర్మించారు.ఈ భవనంలో వైస్రాయ్ హౌస్ నుంచి కేవలం మధ్యలో ఒక గోపురం డిజైన్‌ను తీసుకున్నారు. ఈ ప్యాలెస్‌లో మహిళల కోసం ప్రత్యేక గదులతో కూడిన ఒక అంతఃపురం సైతం ఉండేది. 1947లో భారతకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్ సంస్థానం 1948లో భారత్‌లో విలీనమైంది. ఆ తర్వాత హైదరాబాద్ నిజాం నవాబు ఎంతో ఇష్టంగా కట్టించుకున్న ఈ భవనం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

1974లో విదేశాంగ శాఖ స్వాధీనం చేసుకొని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దింది. అశోక్ రోడ్‌లో ఉన్న ఈ భవనం ఆ తర్వాత ప్రధానమంత్రి అతిథి గృహంగా మారింది.. ఈ భవనం అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ డబ్ల్యూ బుష్, యూకే ప్రధాని గోర్డాన్ బ్రౌన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ప్రపంచ నేతలకు ఆతిథ్యం ఇచ్చింది. తాజాగా ఈ హైదరాబాద్ హౌస్ మరోసారి విశేషంగా మారింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య శుక్రవారం చర్చలు జరుగనున్నాయి.

# ఢిల్లీలో పుతిన్

>> ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలుసుకున్న తర్వాత సదస్సు ప్రారంభం అవుతుంది. భారత్ నిర్వహించే అత్యున్నతస్థాయి సదస్సులు ద్వైపాక్షిక భేటీలకు వేదికగా ఉన్న హైదరాబాద్ హౌస్‌లోనే పుతిన్, మోడీల భేటీజరుగుతున్నది. ఉదయాన్నే రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులర్పించిన అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక భేటీ జరుగుతుంది. 27 గంటలపాటు కొనసాగే పుతిన్ పర్యటనకు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లుచేసిన సంగతి తెలిసిందే. సదస్సునుంచే రష్యా అధ్యక్షుడు పుతిన్ తమ దేశ ఛానల్ రష్యా ప్రభుత్వ టివి ఆర్‌టీవీ భారత ప్రసారాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. సదస్సు, ఇతర ముఖ్య కార్యక్రమాల తర్వాత పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో పుతిన్ గౌరవార్థం ఏర్పాటుచేసిన విందుకు పుతిన్ హాజరవుతారు. పుతిన్ సుదీర్ఘకాలం తర్వాత రావడంతో ఆయన వెంట అతిపెద్ద బిజినెస్ టైకూన్ల గ్రూప్‌ను కూడా తీసుకొచ్చారు. రష్యాతో జరుగుతున్న వాణిజ్యంలో గత కొంతకాలంగా ఉన్న లోటు భర్తీ అయ్యేందుకు ప్రస్తుత పుతిన్ పర్యటన దోహదంచేస్తుందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. రక్షణ, ఇంధన, వాణిజ్యరంగాల్లోనే ఉన్న కీలక సమస్యలు, సవాళ్లపై ఈ భేటీలో చర్చిస్తారు. అలాగే లెక్కకు మించిన సంఖ్యలో ఎంఒయులు కూడా జరుగుతాయని అంచనా. షిప్పింగ్ రంగంలోనే ఒప్పందాలు అత్యధికంగా ఉంటాయని తెలుస్తోంది. పుతిన్‌వెంట వచ్చిన రక్షణమంత్రి ఆండ్రీ బెలూసోవ్ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌యుద్ధం కారణంగా రష్యాతో జరిగిన ఎస్-400 డీల్‌లో సరఫరా జాప్యం కావడంపై చర్చలు జరుపుతారు. ఐదు వందల కోట్ల డాలర్ల డీల్‌ను 2018లోనే సంతకంచేసారు. ఆపరేషన్ సింధూర్‌లో ఈ ఆయుధాలే కీలకపాత్రపోషించాయి. భారత్‌కు తమ దేశం ఎస్‌యు-57 ఐదోతరం యుద్ధవిమానాలు సరఫరాకు ఒప్పందం జరుగుతుందని క్రెమ్లిన్‌ప్రతినిధి డిమిత్రీ పెస్కోవ్ వెల్లడించారు. పాశ్చాత్యదేశాల యుద్ధవిమానాలకు ధీటుగా వీటిని రూపొందించారు. రాఫెల్, ఎఫ్-21, ఎఫ్/1-18, యూరోఫైటర్ టైఫూన్ వంటి వాటికంటే శక్తివంతంగా రూపొందించారు. అలాగే అమెరికా ఆంక్షల కారణంగా రష్యా ముడిచమురు కొనుగోళ్లు తగ్గడంపైనా భేటీలో చర్చకు వస్తుందని అంచనా. అమెరికా తన ఆంక్షలతో రష్యా ముడిచమురు కొనుగోలుచేసినందుకు 50శాతం అదనపు సుంకాలు విధించిన క్రమంలో ఇపుడు పుతిన్ పర్యటన అత్యంత విజయవంతంగా ఈచర్చల ప్రస్తావనకు వస్తుందని విదేశాంగనిపుణులు చెపుతున్నారు. ఢిల్లీపోలీసులు పుతిన్ పర్యటన సందర్భంగా ఐదువేల మందితోబందోబస్తు ఏర్పాటుచేసారు. సెంట్రల్,న్యూఢిల్లీ జిల్లాల్లో మొహరించారు. ఐదు అంచెల భద్రతా వ్యవస్థను స్వాట్ టీమ్స్, యాంటి టెర్రర్ స్క్వాడ్‌త, స్నిఫర్స్, క్విక్ రియాక్షన్ టీమ్‌లు, యాంటీడ్రోన్ మెకానిజమ్, హైడెఫినిషన్ సిసిటివి గ్రిడ్‌లు, టెక్నికల్ సర్విలెన్స్ వ్యవస్థలతో మొత్తం పుతిన్ పర్యటనలో ఎలాంటి చిన్న సంఘటన కూడా జరగకుండా ఏర్పాట్లుచేసారు.

## ముందే పోలవరం సిద్ధం: మంత్రి నిమ్మల

**ఏలూరు/పోలవరం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ఆంధ్రుల జీవనాడి, రాష్ట్ర ప్రజలకు వరం అయిన పోలవరం ప్రాజెక్టును ముందుగా నిర్ణయించిన గడువు 2027 డిసెంబరు కన్నా ముందుగానే, అదే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలు నాటికే పూర్తిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులను, పురోగతిని ఆయన గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు పవిత్ర గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేసే విధంగా అధికారులు, ఇంజనీరింగు నిపుణులు, నిర్మాణ ఏజెన్సీలు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశానికి ముందు ప్రాజెక్టు పరిధిలోని గ్యాప్ 1 లో ప్రధాన డ్యామ్ రాక్ ఫిల్లింగ్ పనులు, గ్యాప్ 2 లో డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు, కుడి కాలువ అనుసంధానం పనుల్లో భాగంగా జంట సొరంగాల్లో జరుగుతున్న క్లిష్టమైన లైనింగ్ పనులను మంత్రి స్వయంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన సమాధానాలకు, గడువు ఆధారంగా జరుగుతున్న పనులకు పూర్తి సంతృప్తి చెందారు. వారిని మనస్ఫూర్తిగా అభినందించి 2027 డిసెంబరు కంటే ముందుగా పుష్కరాలకు పూర్తి చేస్తే ఒక చరిత్ర సృష్టించిన వాళ్ళమవుతామని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ డయాఫ్రంవాల్ నేటికి 950 మీటర్లు నిర్మాణం జరిగి 75 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. 20142019 హయాంలో తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేసిన 72 శాతం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 17 నెలల కాలంలో పూర్తి చేసిన 12 శాతం పనులు కలుపుకొని నేటికి పోలవరం ప్రాజెక్ట్ పనులు 88 శాతం పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.



గురువారం నెల్లూరులో కురిసిన భారీ వర్షానికి నీటమునిగిన కాలనీలు

# నెల్లూరు జిల్లాలో కుండపోత

>> ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న అధికారులు ఇప్పటికే కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఉన్నారు. గత రెండు రోజులు నుండి ఎడతెరపి లేకుండా నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేటు, రామలింగాపురం, మాగుంట లేఔట్ నందు నిలిచిన వర్షపు నీరును ఎప్పటికీ అప్పుడు యుద్ధప్రాతిపదికన మోటార్ల సహాయంతో వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించి వాహన చోదకులకు, ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వెంటనే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో నెల్లూరు, జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు నగరం, గ్రామీణంలో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం పడుతోంది. దీంతో నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలోని వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో చెరువులు నిండి జాతీయ రహదారిపైకి వరద ప్రవాహం చేరింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. నెల్లూరులోని పేరారెడ్డిపల్లి, బీసీ కాలనీల్లోని ఇళ్లలోకి వరద చేరింది. దీంతో వాళ్లని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇలాగే మరో రెండు రోజులు వర్షం పడితే జిల్లాకు తీవ్ర నష్టం చేకూరే అవకాశం ఉంది. ఇప్పటికే అధికారులు అప్రమత్తం అవ్వడంతో నెల్లూరులో కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు జిల్లా అధికార బృందంతో పర్యటిస్తూ ఎక్కడ నీళ్లు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు తీసుకుంటున్నారు.

# అధికారిక గుర్తింపు

>> తెలిపింది. ఈ సవరణ బిల్లు కేంద్ర మంత్రివర్గ సమా వేశంలో ఆమోదం పొంది.. ఈ నెల లోనే పార్లమెంటు శీతకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాల సమాచారం. పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాత అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అధికారికంగా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. కాగా దాదాపు ఐదేళ్లుగా స్తంభించిపోయిన అమరావతి రాజధాని చట్టబద్ధత ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకురావడానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి అధికారికంగా చట్టబద్ధత కల్పించేందుకు ఎపి పునర్విభజన చట్టం2014లోని సెక్షన్ 5(2)ను సవరించాలి. ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. న్యాయ శాఖ ఆమోదం పొంది.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి బిల్లు సిద్ధంగా ఉంది. కాగా, 2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వం రాజధానుల బిల్లు తీసుకొచ్చింది. అయితే దీన్ని ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసి.. అమరావతిని ఆంధ్రప్రదేశ్ అధికారిక, ఏకైక రాజధానిగా గుర్తించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ విషయమై సిఎం చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీతో పలుమార్లు చర్చించారు. దీంతో అమరావతి చట్టబద్ధత ప్రక్రియలో వేగం పుంజుకుంది. కాగా, ఎపిలో ప్రభుత్వం మారితే రాజధాని అమరావతి ఉంటుందా లేదా అమరావతి రైతులను ఇన్ని రోజులు వెంటాడింది. రాష్ట్ర ప్రజల్లో కూడా ఇదే సందేహం ఉంది. ఎట్టకేలకు రాజధాని చట్టబద్ధతకు అడుగులు పడుతున్న వేళ అమరావతి రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు రెండో దశ భూసేకరణ తప్పదని ఇటీవల సిఎం చంద్రబాబు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ వంటి వాటికి భూములు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో రెండో దశ భూసేకరణకు సంబంధించి చర్చించారు. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది.

# అత్యంత విలక్షణంగా రాజధాని భవన నిర్మాణాలు

## రాజధానిలో గవర్నర్ నివాసం లోక్ భవన్ నిర్మాణానికి అథారిటీ ఆమోదం

**విజయవాడ డిసెంబరు 4, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిని ఓ క్రియేటివ్ సిటీగా తీర్చిదిద్దనున్నట్టు సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించే ప్రతీ భవనం విలక్షణంగా ఉండాలని ఆయన సూచించారు. నిర్మించే ప్రతీ భవనం ప్రస్ఫుటంగా కన్పించే విధంగా, పచ్చదనంతో అలరారేలా నిర్మించాలని పేర్కొన్నారు. రాజధాని నగరంలో భవనాల డిజైన్ల కోసమే గతంలో విస్తృతంగా అధ్యయనం నిర్వహించామని సిఎం స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 55వ సీఆర్డీఏ అథారిటీ సమావేశమైంది. సీఆర్డీఏ, ఎడిసి ప్రతిపాదించిన కొన్ని అంశాలకు ఆమోదాన్ని తెలియచేసింది. అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గవర్నర్ నివాస సముదాయం లోక్‌భవన్ నిర్మాణం కోసం చేసిన ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. రూ.169 కోట్ల వ్యయంతో లోక్ భవన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. రూ. 165 కోట్ల వ్యయంతో ఎపి జ్యూడిషియల్ అకాడెమీ నిర్మాణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అలాగే 2024-25 వార్షిక గణాంకాల నివేదికలకు ఆమోదంతెలిపింది. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు నాబార్డునుంచి రూ.7,380 కోట్ల రుణాన్ని తీసుకునేందుకు సిఎం అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ అంగీకారాన్ని తెలిపింది. ఇ3 సీడ్ యాక్సెస్ రహదారిని ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారితో అనుసంధానించేందుకు రూ.532 కోట్లతో టెండర్లను పిలిచేందుకు కూడా అథారిటి ఆమోదాన్ని తెలియచేసింది.

**తెలుగు ప్రజల ప్రాజెక్టుగా ఎన్టీఆర్ విగ్రహం..**

రెండో విడత భూసమీకరణకు సంబంధించిన నోటిఫికేషన్, ఎల్పీఎస్ ప్రణాళికలకు ముఖ్యమంత్రి ఆమోదాన్ని తెలిపారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో చేపట్టిన నిర్మాణాల్లో 85 పనులు జరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రభుత్వ భవనాలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారులు, జడ్జిలు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస భవనాలతో పాటు రహదారులు, విద్యుత్, నీటి సరఫరా, ఎల్పీఎస్ లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన లాంటి వేర్వేరు పనులు వేగంగా జరుగుతున్నట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం నిర్మాణాల్లో వేగంతో పాటు నాణ్యతపై ఎక్కడా రాజీ వద్దని తేల్చిచెప్పారు.

# అఖండ 2 విడుదల వాయిదా: ప్రకటించిన నిర్మాణ సంస్థ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 4:** నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు సమాచారం. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్ షోలను చిత్ర బృందం రద్దు చేయడంతో బాలయ్య అభిమానులు భారీ షాక్‌కు గురయ్యారు. ఈ చిత్రం విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. కాగా, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఈ సినిమా ప్రీమియర్లతోపాటు టికెట్ ధరల పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అఖండ 2 సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జిఎస్‌టీతో కలిపి), మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 (జిఎస్‌టీతో కలిపి) ధర పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. డిసెంబరు 4న రాత్రి 8 గంటల షోకు కూడా అనుమతి ఇచ్చింది. ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.600గా (జిఎస్‌టీతో కలిపి) నిర్ణయించారు. అయితే, పెంచిన ధరలు కేవలం మూడు రోజులే అమల్లో ఉంటాయి. కాగా, పెంచిన ధరల ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం మూవీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు వెళ్లనుంది. చిత్ర పరిశ్రమలో సినీ కార్మికుల సంక్షేమం కోసం ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. ఫిల్మ్ డెవలమెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డిసి) ఇందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిచింది. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఖాతాను లేబర్ కమిషనర్

# 6 కంపెనీలకు ఎస్ఐపిబి ఆమోదం

>> 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం జరిగింది.ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాల కింద 6 కంపెనీలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపిబి) ఆమోదం తెలిపింది. రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు 13వ ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. దీంతో 56,278 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు కూడా ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. అలాగే విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలపై సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లా డుతూ... 'ఎపి ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని చూసే ప్రముఖసంస్థలు పెద్దఎత్తున ఎపికివస్తున్నాయి. కంపెనీలు స్థాపించడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఆయా కంపెనీలకు అవసరమైన నీరు, విద్యుత్, భూమి వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాం. వాటి విషయంలో పారదర్శకత పాటిస్తుండడం వల్లనే ప్రాజెక్టులు ఎపికి వస్తున్నాయి. గత పాలకులు సింగపూర్ లాంటి దేశాన్నే ఇబ్బందులు పెట్టారు. ఆ దేశ కంపెనీలను ఇబ్బంది పెట్టారు. అలాంటి పరిస్థితులుంటే రాష్ట్రానికి పెట్టుబడులు రావు. అంతర్జాతీయ స్థాయిలో చెడ్డ పేరువస్తుంది. మనం ఆ బ్యాడ్ ఇమేజ్ ని చెరిపేసి ఎపికి బ్రాండ్‌ఇమేజ్ తీసుకువచ్చాం. అందుకే ఇటీవల మనం నిర్వహించిన పెట్టుబడులసదస్సుకు మంచి స్పందన వచ్చింది" అని సిఎం అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వ యంత్రాంగం కూడా నైపుణ్యాలు పెంచుకోవాలి..**

"ఆమోదం పొందిన యూనిట్లు, పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా ఏర్పాటు చేయాల్సిందే. దీనిపై అధికారులు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలి. వివిధ రంగాల్లో ఏపీని అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. అలాగే రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా పూర్తిగా టెక్నాలజీపై గ్రిప్ పెంచుకోవాలి. లేకుంటే మనం వెనుకబడిపోతాం. ఇదే కాకుండా... భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని యువతను సిద్ధం చేయాలి. ఈ మేరకు వివిధ రంగాల్లో వారిని నైపుణ్యాలు అందించేలా చూడాలి. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ, గ్రీన్ ఎనర్జీ యూనివర్సిటీ వంటివి ఏర్పాటు చేయాలి. క్వాంటం వ్యాలీకి అడ్వైజరీ బాడీని నియమించండి. మెంటరింగ్, మోనిటరింగ్, వెంచర్ క్యాపిటల్ కోసం ఇది పనిచేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది స్టార్టప్‌లకు ఓ మెంటార్ గా వ్యవహరిస్తుంది. క్వాంటం వ్యాలీలో నిర్మించే 6 క్వాంటం టవర్లలో రెండు టవర్లను క్వాంటం అల్గారిథం డెవలప్మెంట్ కోసం... మరో రెండు టవర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ కోసం కేటాయించండి. పర్యాటక కేంద్రాలకు ప్రచారం కల్పించండి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆతిథ్య రంగంలోనూ, పర్యాటక రంగంలోనూ రావాలి. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల కోసం 50 ఎకరాలు కేటాయించండి. దీనికి అవసరమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ప్రాజెక్టు స్థాయిని బట్టే ప్రోత్సాహకాలు అందాలి. లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులుగా వర్గీకరించాలి. మనం ఇచ్చే ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతాకు జమ చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలి."అని సిఎం సూచించారు.

**సావరిన్ ఫండ్ ఏర్పాటు చేద్దాం..**

"ప్రభుత్వ రంగ సంస్థలే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. యూఏఇ, దుబాయ్, సహా మరికొన్ని దేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు లక్షల కోట్ల రూపాయలతో సావరిన్ ఫండ్ ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ కంపెనీలతోనే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఎపి కూడా ఆ స్థాయికి రావాలి. రూ.500 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం సావరిన్ ఫండ్ ఏర్పాటు చేయాలి. లైవ్ స్టాక్ పరిశ్రమ రూ. 8 లక్షల కోట్లకు చేరాలన్నదే మన లక్ష్యం. ఆ దిశగా మార్గదర్శకాలు రూపొందించండి. హార్టికల్చర్ ఉత్పత్తులను ఎగుమతులు చేసేలా రైల్, రోడ్, ఎయిర్, వాటర్ కనెక్టివిటీ కూడా పెరగాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పరిశీలన తర్వాతే అనుమతులు: మంత్రి నారా లోకేష్..**

ఎస్ఐపిబి సమావేశంసందర్భంగా మంత్రి నారా లోకేష్‌మాట్లాడుతూ... "పెట్టుబడులుపెట్టే ప్రతి కంపెనీని పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతివ్వాలని మంత్రి చెప్పారు. ఇదే సమయంలో పరిశ్రమ ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని మంత్రి లోకేష్ సూచించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని.. ప్రభుత్వ సమయం, కంపెనీల సమయం వృధా కాకుండా పెట్టుబడులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని లోకేష్ సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు టిజి భరత్, పి.నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగానిసత్యప్రసాద్ హాజరయ్యారు. మంత్రులు బిసి జనార్దన్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, అచ్చెన్నా యుడు వర్చువల్‌గా హాజరయ్యారు. సిఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

05-12-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, కృష్ణ పక్షం
కృ.పాడ్యమి రా.12.58
రోహిణి ఉ.11.47, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : సా.4.29-5.53
దు.ఉ.8.27-9.22,
2) మ.12.21-1.06
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** పరిస్థితులు అనుకూలించవు. దుర భ్యాసాల వైపు మనస్సు మళ్ళకుండా జాగ్రత్తలు వహించండి.క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం:** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే పరోక్ష లాభంగా పరిణమిస్తుంది. ప్రయాణాలు లాభిస్తాయి.దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల పరంగా ఉపయుక్తం లేని బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

**కర్కాటకం :** నిర్మాణాత్మకమైన నిర్ణయాలను అమలు చేయుటకు తగిన వ్యక్తులు కలుస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**సింహం:** బరువైన కొన్ని బాధ్యతలను దించుకుంటారు. వెనువెంటనే కాకపోయినా మీ నిజాయితీకి గుర్తింపు వస్తాయి.

**కన్య:** వ్యాపారపరముగా చెప్పుకోదగిన లాభాలు రాకపోయినా నష్టాలు ఉండవు. ఉద్యోగములో స్థానము పదిలము.

**తుల :** ఆర్థిక సర్దుబాటులలో మీ వ్యూహాలు ఫలిస్తాయి. ప్రజా సంబంధాలు మెరుగ్గా ఉంటాయి. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** మీ శక్తి సామర్థ్యములు ప్రతిభ, ఆకస్మికముగా చాలామందికి గుర్తుకు వస్తాయి. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** మంచి అవకాశమును గురించి గతములో చేసిన ప్రయత్నములు ఇప్పుడు అక్కరకు వస్తాయి. వాహన సౌలభ్యం కలదు.

**మకరం:** కోర్టు వ్యవహారములు రాజకీయ వ్యవహారములకు అనుకూలము. దూర ప్రాంతములలో వారికి సాయం చేస్తారు.

**కుంభం:** గృహ నిర్మాణ సంబంధమైన విషయములు స్వల్పమార్పులకు చోటు చేసుకుంటాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి.

**మీనం :** కుటుంబములోని వారి ఆరోగ్య విషయమై ప్రత్యేక శ్రద్ధకుర్చులు సూచించు చున్నది. వస్తువులు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## గ్రామ స్వరాజ్య స్థాపనకు కూటమి ప్రభుత్వం అడుగులు

### సంస్కరణలతో 10 వేల మందికి పదోన్నతులు: డిసిఎం పవన్

**చిత్తూరు, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం రాష్ట్రంలోని ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ అన్నారు. చిత్తూరులో గురువారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పాల్గొని చిత్తూరులో నిర్మించిన డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయంను ప్రారంభించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసులను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనలో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి డివిజన్ స్థాయిలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్రమోడి ఆధ్వర్యంలో రాష్ట్రానికి సహాయ సహకారాలు అందుతున్నాయని, సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్డీఎ కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖకు చెందిన డిడిఓ, డిఎల్‌పిఓ, ఏపిడి, డ్వామా ఇతర అధికారులు సేవలు అందించనున్నారన్నారు. జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ విభాగాలను ఏకీకృతం చేయడం జరిగిందన్నారు. అలాగే జిల్లా పంచాయతీ అధికారిని డిప్యుటీ డైరెక్టర్‌గా మార్చడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ సంస్థలను పటిష్టం చేయడానికి ఒక ప్రత్యేక ఐటి వింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ విఆర్ కృష్ణతేజ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై పాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా జిఓఎంఎస్‌నెం.57, 58లను తీసుకురావడం జరిగిందన్నారు. మండల స్థాయిలో అభివృద్ధి శాఖకు ఎంపిడిఓలు, రెవెన్యూ శాఖకు తహసిల్దారు, పోలీసు శాఖకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు వుంటారన్నారు. వీరికి సంబంధించి రెవెన్యూ, పోలీసు శాఖలకు మాత్రమే డివిజనల్ కార్యాలయాలు వుంటాయని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో ఇకపై పంచాయతీరాజ్ శాఖకు సైతం ఒక డివిజనల్ స్థాయి అధికారి వుంటారన్నారు.

# అన్ని వర్గాలను మోసగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం : జగన్

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** అభివృద్ధి పేరిట ఏపీ చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాలను దారుణంగా మోసగిస్తుందని వైసిపి అధినేత వైఎస్.జగన్ అన్నారు.రాష్ట్రంలో చంద్రబాబు చేసానని చెబుతున్న అభివృద్ధి ఎక్కడా కన్పించదన్నారు.రాష్ట్రంలో అవాస్తవాలు,వాస్తవాలు ఏలా ఉన్నాయో ప్రజలకు వివరించాల్సి అత్యవశ్యకత ఉందన్నారు. నాణేనికి రెండో వైపు ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది " అని . గురువారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో' సేవ్ ఆంధ్రా' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో జగన్ మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం గురించి చాలా విషయాలు తెలియాల్సి ఉందన్నారు.

నాణేనికి రెండో వైపు ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం మొత్తం దేశం వైపు చూడాలని కోరారు. వైసిపి హయాంలో పండుగలా వ్యవసాయం ఉందని చెప్పారు. 62 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయం దండుగగా మారిందన్నారు. మొంథా తుపానును చంద్రబాబు, లోకేష్, పవన్‌లే ఆపినట్లు బిల్డప్ ఇచ్చారని విమర్శించారు. తుపాను తర్వాత కూడా రైతులకు న్యాయం చేయలేదు అని చెప్పారు. నష్టపోయిన రైతులకు పైసా సాయం అందించలేదని, పైగా పంట నష్టాన్ని దారుణంగా తగ్గించారని ఆరోపించారు.

# చిలకలూరిపేట వద్ద రోడ్డు ప్రమాదం

## అక్కడికక్కడే నలుగురు మృతి

**చిలకలూరిపేట (పల్నాడు జిల్లా), డిసెంబరు 4. ప్రభాతవార్త:** గుంటూరు నుంచి ఒంగోలు వెళుతున్న కారు చిలకలూరిపేట బైపాస్ వద్ద ట్రాలీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలయి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మరణించిన వారిని భౌతికకాయాలను స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించి నివాళులర్పించారు .రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో మరణించిన వారి వివరాలు తెలుసుకుంటున్నారు .సంఘటన జరిగిన వెంకటనే సంఘటన స్థలానికి రూరల్ సీఐ సుబ్బరాయుడు రూరల్ ఎస్సై అనిల్ కుమార్ నాదెండ్ల ఎస్సై పుల్లారావు వెళ్లి ట్రాలీ నుంచి కారును బయటకు తీశారు. ఇద్దరు అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్నారు. వారిద్దరు చనిపోయిన వారిలో ఉన్నారు.

05-12Pg3exHMNWJQETKP 3_05-12Pg3exHMNWJQETKP.qxd 05/Dec/25 12:14 AM Page 1



## కోర్టు అనుమతితో గ్లోబల్ ఆస్పత్రి సీజ్: డిఎస్పీ మహేంద్ర

**మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ దందా కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మదనపల్లె కేంద్రంగా గ్లోబల్ ఆస్పత్రిలో నిర్వహించిన కిడ్నీ రాకెట్ కేసులో ఇప్పటికే అన్నమయ్య జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు, డయాలసిస్ టెక్నీషియన్స్ మెహరాజ్, బాలరంగడు లను, వైజాగ్ కు చెందిన పిల్లి పద్మ, సత్య, సూరిబాబు, కడప కు చెందిన ఓటి అసిస్టంట్లు కొండయ్య, సుమన్ లను పోలీసులు అరెస్ట్ చేశారు.

కిడ్నీ రాకెట్ దందాకు కేంద్రం గా నిలిచిన గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేసేందుకు పోలీసులు కోర్టు అనుమతి కోరారు. కోర్టు నుంచి అనుమతి రావడంతో గురువారం డిఎస్పీ మహేంద్ర, సీఐ లు మహ్మద్ రఫీ, రాజారెడ్డి, ఎస్ఐ రహీమ్, టీబి మెడికల్ అఫీసర్ డాక్టర్ శ్రీధర్ లు వెళ్లి గ్లోబల్ ఆస్పత్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గ్లోబల్ ఆస్పత్రిలో చట్ట విరుద్ధంగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ జరగడంతో వైజాగ్ కు చెందిన యమున అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. ఈ కేసులో ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేశామని, సర్జరీ చేసిన బెంగుళూరు కు చెందిన డాక్టర్ అనంద్ పార్థసారథి పరారీలో ఉండడంతో గాలింపు చేపట్టామన్నారు.

# పెద్ద ఎత్తున ముందుకు వస్తున్న ఇన్వెస్టర్లు

**ఎస్ఐపిబి సమావేశంలో రూ.20,444 కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**13 సమావేశాల్లో రూ.8.20 లక్షల కోట్ల పెట్టుబడులు**

**ప్రత్యక్షంగా 7,62,148 మందికి ఉద్యోగాలు**



మంత్రులు కందుల దుర్గేష్, టిజి భరత్

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాత వార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సీబీఎన్ బ్రాండ్ తో పెద్ద ఎత్తున ఇన్వెస్టర్లు ముందుకు రాగా 18 నెలల్లోనే 20 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులు సాధించగలిగామని మంత్రులు కందుల దుర్గేష్, భరత్ వెల్ల డించారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్ విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన పెట్టుబడులను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇవాళ జరిగిన 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో రూ.20,444 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించిందన్నారు. మొత్తం 26 సంస్థలకు రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపామన్నారు. తద్వారా 56,278 మందికి ఉద్యోగాలు దక్కుతాయని స్పష్టం చేశారు. ఇవే కాకుండా ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాల కింద మరో ఆరు కంపెనీలకు కూడా ఆమోదం తెలిపామని వెల్లడించారు. ఇటీవల విశాఖ సీఐఐ సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు కూడా ఇవాళ ఆమోదం తెలిపామన్నారు. అదే విధంగా విశాఖ పెట్టుబడుల సదస్సు లో కుదుర్చుకున్న ఎంఓయూల పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రివ్యూ చేశారని దీని కోసం ఓ పోర్టల్ ను కూడా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎంఓయూలు సాకారమై ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేసేందుకు నేరుగా ముఖ్యమంత్రి, సీఎస్, మంత్రివర్గ ఉపసంఘం, ఆయా శాఖలకు చెందిన మంత్రులు కూడా నిరంతరం పర్యవేక్షి స్తారని పేర్కొన్నారు. దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లో పాల్గోనేందుకు వెళ్ళేలోగా వీలైనన్ని ఎంఓయూలు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని సీఎం నిర్దేశించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. మొత్తం కుదుర్చుకున్న ఎంఓయూల్లో 50 శాతం మేర పెట్టుబడులకు ప్రొసెస్ ప్రారంభమైపోయిందని అన్నారు. ఇప్పటి వరకూ పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో రూ.7.69 లక్షల కోట్ల మేర పెట్టుబడులు, ఆయా కంపెనీలకు సంబంధించిన ప్రొసెస్ కూడా ప్రారంభమైందని తెలిపారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో రూ.1.69 లక్షల కోట్లు, అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో సుమారు రూ.87 వేల కోట్లు, తిరుపతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో సుమారు.73 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

ఇప్పటి వరకూ 13 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామన్నారు. తద్వారా 7,62,148 మందికి ఉద్యోగాలు ప్రత్యక్షంగా లభించనున్నాయన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పిస్తామనే హామీని సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఘంటాపథంగా తెలిపారు. ఇప్పటి వరకూ వచ్చిన కంపెనీల్లో ప్రపంచ ఐటీ దిగ్గజం గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిట్టల్, రేమాండ్స్, రిలయన్స్ లాంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు సంబంధించి విద్యుత్ ఉత్పత్తి, టూరిజం, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్, ఆటోమొబైల్, ఏరో స్పేస్, డిఫెన్స్ తదితర రంగాల్లో పెట్టుబడులు తాము ఆకర్షిస్తున్నామన్నారు.

## పరకామణి చోరీ, కల్తీనెయ్యి కేసులపై మాజీ సిఎం వ్యాఖ్యల దుమారం!

- న్యాయస్థానాల్లో విచారణలో ఉండగా వివాదం

**తిరుపతి,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీ కాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను పరకామణి భవనం నుండి చోరీ చేసిన రవికుమార్ కేసు విషయంలో, గత వైసిపి ప్రభుత్వ హయాంలో లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా జరిగిన కేసులు న్యాయస్థానాల్లో విచారణలో ఉండగా మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. బాధ్యత గల ఓ రాజకీయపార్టీ అధినేతగా ఉంటూ ఆయన విమర్శలు గుప్పించడం వివాదాస్పదమతోంది. మాజీ సిఎం జగన్ ఏడాదిన్నర తరువాత నోరుమెదపడం వెనుక ఆంతర్యమేమిటనేది కొందరు మేధావులు,నిపుణులు ప్రశ్నిస్తున్నారు. సంచలనంగా మారిన ఆ రెండు కేసుల్లో ప్రస్తుతం దర్యాప్తు,విచారణ వివరాలు మొత్తం అటు సుప్రీంకోర్టులో ఇటు హైకోర్టులో ఉండగా ఆయన గురువారం విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ ఛైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఇఓ ఏవి ధర్మారెడ్డితోబాటు కొందరు మాజీ అధికారులను కీలకంగా ప్రశ్నించింది. 2023వ సంవత్సరం ఏప్రిల్‌లో తిరుమల పరకామణి భవనంలో గుమస్తా సివి రవికుమార్ 920 అమెరికన్ డాలర్లు చోరీ చేశాడని,దానివిలువ 72వేల రూపాయలు విలువమాత్రమేనని అప్పటి టిటిడి పెద్దలు వెల్లడించారు. దొంగతనం జరిగిన రోజే విధుల్లో ఉన్న అప్పటి ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ సిసికెమెరాలద్వారా గుర్తించి అతనిని పట్టుకున్నాడు. పై అధికారుల ఆదేశాలతో తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తదనంతరం తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు తిరుపతిలోని రెండవ అదనపు న్యాయస్థానంకు చేరింది. ఆ తరువాత అదే సంవత్సరం సెప్టెంబర్ 9వతేదీ మెగా లోక్‌అదాలత్‌లో కేసు రాజీచేసుకునే స్థాయికి ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్‌పై ఒత్తిడి చేశారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం సమగ్ర విచారణకు సిఐడి డిజిని ఆదేశించింది. సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్ తమ సిబ్బందితో తిరుమల,తిరుపతికి చేరుకుని చోరీ జరిగిన ఘటనకు సంబంధించి ఆధారాలు, సాక్ష్యాలను, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గతనెల 6వతేదీ నుండి డిసెంబర్ 1వతేదీ వరకు నిందితుడు సివిరవికుమార్ తో బాటు ఆయన భార్యను మరో 35మందిని క్షేత్రస్థాయిలో విచారణ చేసి అనేక వివరాలు రాబట్టారు. అతని ఆస్తులు , కేసురాజీ వెనుక ఉన్న పెద్దల వివరాలు రాబట్టి సీల్డుకవర్‌లో హైకోర్టుకు సమర్పించారు. ఈ కేసుపై నేడు(శుక్రవారం)న్యాయమూర్తి విచారణ చేసి తదుపరి సిఐడికి ఆదేశాలివ్వనున్న సమయంలో గురువారం మాజీ సిఎం జగన్ వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. పరకామణి వివాదం ఆశ్చర్యం కలిగించే కేసు అని, ఈ కేసులో దొరికింది 9డాలర్లుమాత్రమేనని , ప్రాయశ్చిత్తంగా 14కోట్ల రూపాయలు ఆస్తులను టిటిడికి ఇచ్చారని ఆయన చెప్పడం ఎక్కడకు దారితీస్తుందనేది ఇప్పుడు ఆసక్తికర పరిణామం. ఇక కల్తీనెయ్యి వ్యవహారంలో సిబిఐ సిట్ అధికారులు లోతుగా దర్యాప్తుచేపట్టి కీలకమైన పాత్రధారులను డెయిరీ నిపుణులను, టిటిడి మాజీ మార్కెటింగ్‌జిఎం సుబ్రమణ్యంను, మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఎ చిన్నఅప్పన్నను,రసాయనాలు సరఫరా చేసిన కాంట్రాక్టర్ అజయ్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి జైల్లో పెట్టింది.

## పాఠశాల రికార్డుల సవరణకు మార్చి 31 వరకు అవకాశం

**విజయవాడ,డిసెంబరు 4,పభాతవార్త ప్రతినిధి:** పాఠశాలల్లోని రికార్డులను సవరించే అధికారాన్ని మండల,డిప్యూటీ విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, గ్రేడ్ 2లకు కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ అవకాశం కల్పించింది. అపార్ ఐడీల కోసం విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రికార్డుల్లో మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇంటి పేరు,విద్యార్థులు,తల్లిదండ్రుల పేర్లు,ఇతర వివరాలు ఆధార్‌తో సరిపోలకపోవడంతో అపార్ ఐడీ కేటాయింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు పాఠశాల రికార్డులను సవరించేందుకు ఎంఈఓ,డిప్యూటీ ఈఓ,హెచ్ఎంలకు పాఠశాల విద్యాశాఖ అధికారం కల్పించింది. ప్రభుత్వ ఎయిడెడ్,ప్రైవేటు ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎంఈఓ,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, ఎయిడెడ్, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు డిప్యూటీ విద్యాధికారికి ఈ అధికారాలు కల్పించింది.

## సుప్రీం కోర్టు ఉత్తర్వులు బేఖాతర్, 42 ఇళ్లు కూల్చివేత!

**న్యాయం చేయాలంటూ సిఎం చంద్రబాబు నివాసం వద్ద బాధితుల ఆందోళన**

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని భవానీపురం జోజినగర్ కరెంట్ ఆఫీసు రోడ్డులోని 42 ఇళ్లను అధికారులు కూల్చివేసిన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ ఘటనపై బాధితులు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్ద బాధిత ప్రజలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులు,వెనుక ఉన్న ప్రజాప్రతినిధులపై చర్యలను తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు. తక్షణం తమకు పునారావాసం కల్పించడంతో పాటుగా అదే స్థలాల్లో ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు స్టే విధించినప్పటికీ..ఆ ఉత్తర్వులు వచ్చేలోగానే ఆఘమేఘాల మీద అధికార యంత్రాంగం ఇళ్లను కూల్చివేసింది.౹. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడలోని భవానీపురం జోజినగర్ కరెంట్ ఆఫీసు రోడ్డులోని 42 ఇళ్లను అధికారులు కూల్చివేశారు. శ్రీ లక్ష్మీ ౹ రామ కోఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్ సొసైటీ స్థలదారులకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో బుధవారం ఉదయం సుమారు 200 మంది పోలీసుల బలగాల నడుమ భవనాలను నేలమట్టం చేశారు. 2001లో అబ్దుల్ మజీద్ అనే వ్యక్తి 2.17 ఎకరాల స్థలాన్ని విక్రయించారు. పలువురు ఆ స్థలాన్ని కొనుగోలు చేసి అందులో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంటిపన్ను, నీటి పన్ను, కరెంట్ బిల్లులు సైతం చెల్లిస్తూ వచ్చారు. మరికొందరు ఆ స్థలం ద్వారా బ్యాంకులో రుణాన్ని సైతం పొందారు. 2017లో శ్రీ లక్ష్మీ ౹ రామ కో - ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ పేరిట 42 ఇళ్ల యజమానులకు విజయవాడ కోర్టు నుంచి నోటీసులు అందాయి. స్థలం ఖాళీ చేయాలని నోటీసులో పేర్కొనడంతో బాధితులందరూ కోర్టును ఆశ్రయించారు. వాదనల అనంతరం శ్రీ లక్ష్మీ ౹ రామ కోఆపరేటివ్ బిల్డింగ్స్ సొసైటీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిన్న ఉదయం సుప్రీంకోర్టు స్టే విధించినా బలవంతంగా ఇళ్లను కూల్చివేశారు. దీంతో బాధితులకు పోలీసులకు మధ్య తోపులాట, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ ఘటనలో ఇద్దరు అస్వస్థతకు గురికాగా, వారి పరిస్థితి విషమించడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ ఇద్దరి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల కూల్చివేతతో ప్లాట్ల యజమానుల్లో కూడా భయం ఏర్పడింది.

## ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ర్యాంకింగులో రాష్ట్రానికి తొలి స్థానం!

వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** హెచ్ఐవీ నియంత్రణ, బాధితులకు వైద్య సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, దేశంలోనే తొలిసారి ప్రథమ ర్యాంకు సాధించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరుతో పోలిస్తే రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ న్యాకో నిర్దేశించిన ఇండికేటర్లలో అద్భుతమైన పనితీరు కనబరిచి, మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందని ప్రకటించారు. 33 ఇండికేటర్ల (పనితీరు సూచికలు)కు కేటాయించిన 138కి 105 మార్కులను ఏపీ సాధించిందని చెప్పారు. న్యాక్ (నేషనల్ కంట్రోల్ ఆర్గనైజేషన్) విడుదల చేసిన అర్ధ సంవత్సర వార్షిక నివేదికలో పేర్కొన్న ర్యాంకింగ్ జాబితాలో ఆంధ్రప్రదేశ్ పేరు ముందుందని వెల్లడించారు. ఇదే ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు పనితీరు ప్రతిపాదికన న్యాక్ విడుదల చేసిన త్రైమాసిక నివేదికలో ఏపీ రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. దీనిని అధిగమిస్తూ తొలి స్థానంలో నిలిచేలా పనితీరు కనబరిచిన ఎయిడ్స్ నియంత్రణ సంస అధికారులు, ఉద్యోగులను మంత్రి సత్యకుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో అభినందించారు.

## మూలపేట పోర్టు నిర్మాణ పనులకు గడువు పెంపు

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా మూలపేట దగ్గర నిర్మాణంలో ఉన్న పోర్టును పూర్తి చేసేందుకు 2026 నవంబరు వరకు గడువు పొడిగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన కాలానికి ఎలాంటి అదనపు ఖచ్చును క్లెయిమ్ చేసేందుకు గుత్తేదారు సంస్థకు అవకాశం లేదని పేర్కొంది. రూ.2,949.70 కోట్ల అంచనాలతో పోర్టు నిర్మాణ పనులు చేపేట్టందాఉకు ప్రభుత్వంతో విశ్వ సముద్ర పోర్ట్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నిర్మాణాన్ని ప్రారంబించినప్పటి నుండి 30 నెలల్లో పనులు పూర్తి చేయాలి.

## తెలుగు చదువుకుంటేనే ఉద్యోగాలు ఇస్తామనాలి : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయవాడ,డిసెంబరు 4,పభాతవార్త ప్రతినిధి:** తెలుగు చదువుకుంటేనే ఏపీ,తెలంగాణాలో ఉద్యోగం ఇవ్వాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మచిలీపట్నం లోని కృష్ణా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న కృష్ణా తరంగ్ 2025’ ఉత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. ‘ఇటీవల రామోజీరావు జయంతి సందర్భంగా తెలుగు భాషలోనే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయాలని ఈ రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులను కోరాను. దీనికి వారు చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో ఉంటే…అదే రామోజీరావుకు ఘన నివాళి. భారతీయ భాషలను కాపాడాలని ప్రధాని మోడీ ఆలోచన చేస్తున్నారు. ఆంగ్లేయులు వారి భాషను అధికార భాషగా చేసుకొని పాలన చేశారు. మనం తెలుగు వాళ్ళం కాబట్టి తెలుగును పరిపాలన భాషగా చేయాలి. మెడికల్,ఇంజనీరింగ్ భోధన మాతృభాషలో జరిగేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మన వాళ్ళు ఇంగ్లీష్ మాట్లాడటం రాకపోయినా పేపర్ మీద రాసుకుని మాట్లాడతారు. ఆంగ్లంలో మాట్లాడితేనే గొప్ప అని భావిస్తున్నారు. ముందాఉ మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలి. తర్వాత సోదర భాషలు నేర్చుకోవాలి’అని వెంకయ్యనాయుడు అన్నారు.

## 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ

మంత్రి నారాయణ

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభా తవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక రాజధాని నిర్మాణం ఆలస్యమైందని ఏపీ నగర, వట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. కాంట్రాక్టర్లుకు బకాయిలు చెల్లించి పనులు ప్రారంభించేనాటికి వర్షాలు ముంచెత్తాయి. అంతర్జాతీయ రాజధాని నిర్మాణంలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు సీఎం నిర్ణయించారని వివరించారు.పల్నాడు జిల్లాలో రైతులు ఇచ్చిన భూమిలో 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తాం. గతంలో భూ సమీకరణ సమయంలో విధానాలే ఇక్కడా అమలు చేస్తాం. ట్రంకురోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నాలుగు, ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ కూడా ఏడాదిలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసు కుంటున్నాం ?అమరావతి మండలం యండ్రాయిలో రెండో విడత భూసమీకరణలో తీసుకుంటున్న 7 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రెండో భూసమీకరణ చేపడుతున్న ప్రాంత రైతులతో పల్నాడు జిల్లా యండ్రాయిలో మంత్రి నారాయణ సమావేశం అయ్యారు. యండ్రాయి, వైకుంఠపురం, పెద్దమత్తూరు, కర్లపూడి రైతులతో పాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమావేశంలో పాల్గొన్నారు. భూసమీకరణపై రైతుల అభిప్రాయాలను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు. భూసమీకరణపై రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఏడాదిలోపు స్పోర్ట్స్ సిటీ నిర్మాణం.

## నకిలీ మద్యం వ్యవహారంపై 6న కోర్టులో చార్జీషీట్ దాఖలు

**విజయవాడ,డిసెంబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం వ్యవహారంపై సిట్, ఎక్సైజ్ అధికారులు ఈ వారంలో ప్రాథమిక ఛార్జిషీట్ దాఖలుకు సన్నద్ధమవుతుంది, ఈ వారంలోనే చార్జీషీట్‌ను కోర్టులో దాఖలు చేసేందుకు అవసరమైన ముందస్తు రంగాన్ని సిద్ధం చేసుకుంటుంది. చట్ట ప్రకారం పదేళ్లలోపు శిక్ష పడే కేసులకు 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్‌ను కోర్టులో ఫైల్ చేయాల్సి ఉంది. దీంతో డిసెంబరు 6వ తేదీలోగా అభియోగపత్రం దాఖలు చేయాలన్న ఆలోచనలో ఎక్సైజ్ అధికారులు ఉన్నారు. ములకలచెరువు కేసులో ఉన్న పలువురు నిందితులను కస్టడీకి తీసుకుని విచారించాల్సి ఉంది. ఇంకా కొందరు అరెస్టు కావాల్సి ఉంది. తొలుత ప్రాథమిక ఛార్జిషీట్ వేసి, ఆ తర్వాత అనుబంధ పత్రాలు దాఖలు చేయాలని తలపోస్తున్నారు. అక్టోబరు 6న భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఇప్పటివరకు సాగిన దర్యాప్తు ఆధారంగా ఎక్సైజ్ కోర్టులో అభియోగపత్రం వేయనున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 25 మందిని నిందితులుగా చేర్చారు. మూతలు సరఫరా చేసిన మనోజ్‌కుమార్, ధారబోయిన ప్రసాద్, సీసాలు సమకూర్చిన సెంథిల్ తదితరులు అరెస్టు కావాల్సి ఉంది.ములకలచెరువులో నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులు తమ ఫోన్లలో చెరిపేసిన ఆధారాలను ఫోరెన్సిక్ నిపుణులు తిరిగి రాబట్టారు. నిందితుల మధ్య సాగిన యూపీఐ చెల్లింపులు, వాటి తాలూకూ స్క్రీన్‌షాట్లు, పలు ఫోటోలు బయటపడ్డాయి.

# తిరుమల సమాచారం

## విద్యతోబాటు సనాతనధర్మం నైతికవిలువలపై బోధన చేయాలి :టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానాల ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యతోబాటు హిందూ సనాతనధర్మం, నైతికవిలువలు, భక్తిభావం, వ్యక్తిత్వవికాసం, నైపుణ్యాభివృద్ధి అంశాలపై బోధన చేయాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ కోరారు. దీనివల్ల ఆదర్శవంతమైన పౌరులుగా తయారవుతారన్నారు. విద్యాబోధనతోబాటు విద్యార్థులను తరచుగా క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్తే వారిలో మరింత విజ్ఞానం పెరుగుతుందన్నారు. శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్‌ట్రస్ట్, విద్యాదానం ట్రస్ట్, ప్రాణదానట్రస్ట్‌లపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒవీరబ్రహ్మం, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, సిఎంఒ డాక్టర్ కుసుమకుమారి, పద్మావతిచిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, డిఇఒ వెంకటసునీల్,సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవితో కలసి గురువారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో ఇఒ సింఘాల్ సమీక్షించారు.

టిటిడి విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సృజనాత్మక ఆలోచనల్లో లోపాలను సరిచేసేలా ప్రయోగశాలల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధికి నిపుణులతో శిక్షణ,అవసరమౌన మౌళిక సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. టిటిడి ఆస్పత్రుల్లో రోగులకు ఆస్పత్రుల వారీగా మందుల కొరత ఉన్న విషయాలను ,అవసరమైన మందులు సరఫరాచేసుకుని అందుబాటులో వుంచాలన్నారు. తిరుమలలోని వేంకటాద్రి వసతిసముదాయం(పిఎసి-5)లోఅవసరమైన వైద్యసేవలందించేందుకు సిబ్బందిని నియమించాలన్నారు.

## హిందూ ధర్మప్రచారాన్ని మరింత విస్తృతంగా జనాల్లోకి తీసుకెళ్లాలి

**- శ్రీవారిసేవా గ్రూప్‌ట్రైనర్లశిక్షణలో టిటిడి ఇఒ సింఘాల్**



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మప్రచారాన్ని మరింత విస్తృతంగా శ్రీవారిసేవకులు జనాల్లోకి తీసుకెళ్ళాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ సూచించారు. 2000వసంవత్సరంలో 200మంది సేవకులతో ప్రారంభమైన శ్రీవారి సేవ ప్రస్తుతం 17లక్షలుమందికి చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా శ్రీవారి సేవను మరింత బలోపేతం చేయడంలో భాగంగా గ్రూప్ సూపర్‌వైజర్లకు ట్రైన్ ది ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. తిరుమలలోని శ్రీవారిసేవాసదన్ 2లో గ్రూప్ సూపర్‌వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ,ఐఐఎం అహమ్మదాబాద్, ఏపి ప్రణాళిక విభాగం నిపుణులతో కలసి ఇఒ ఎకె సింఘాల్ పాల్గొని కీలకమైన విషయాలు తెలిపారు.ఈ శిక్షణలో తరగతి శిక్షణ ,క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అధ్యయనం చేసిన అంశాలను గ్రూప్ సూపర్‌వైజర్లు తమ ప్రాంతాల్లోని శ్రీవారిసేవకులకు నేర్పించి వారిని ఉత్తమ సేవకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఇఒ తెలిపారు.

## పేదప్రజలు ఆర్థికంగా ఎదగాలని సిఎం కృషి :మంత్రి బాలవీరాంజనేయస్వామి




**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పేదప్రజలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో సిఎం చంద్రబాబు నాయుడు పి4 ప్రాజెక్ట్ అమలు చేస్తున్నారని రాష్ట్రమంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఇప్పటికే పరిశ్రమలు తీసుకువచ్చేందుకు విశాఖపట్నం లో చేపట్టిన కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్ళేందుకు చంద్రబాబునాయుడు కృషికి తోడు దేవునిశక్తినివ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. స్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనంచేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత!


**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో అంకితభావంతో, సేవానిరతితో కోట్లాదిమంది భక్తులకు ఇతోధిక సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యతచూపింది. ఇందులో భాగంగా టిటిడిలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు పెద్ద మొత్తంలో బీమా సదుపాయం కల్పించేందుకు కసరత్తుచేపట్టింది. ఈ బీమా కోసం ప్రధాన బ్యాంక్ భారతీయ స్టేట్ బ్యాంక్ ముందుకు వచ్చింది. టిటిడిలో దాదాపు 6,300మంది వరకు వివిధ హోదాల్లో శాశ్వత ఉద్యోగులు తిరుమల శ్రీవారి ఆలయం, వసతి కల్పన విభాగం, పరకామణి, అన్నప్రసాదం, ఉద్యానవనవిభాగం,ఆర్థికవిభాగం, దర్శన టిక్కెట్లు ,ఆర్జితం కార్యాలయం వంటి అనేక కీలక విభాగాలతోబాటు తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం, తిరుచానూరు, తిరుపతి, శ్రీనివాసమంగాపురం, అప్పలాయగుంటతోబాటు స్థానిక ఆలయాల్లోనూ, దేశంలోని అనేక ప్రాంతాల్లో టిటిడి కల్యాణమండపాలు, సమాచార కేంద్రాలు, శ్రీవారి ఆలయాల్లో వివిధ చోట్ల క్రిందిస్థాయి ఆఫీస్ సబార్డినేట్ నుండి డిప్యూటీ ఇఒ స్థాయి వరకు అధికారులు పనిచేస్తున్నారు. వీరందరికీ ఎస్‌బిఐతో టిటిడి బోర్డు, ఉన్నతాధికారులు కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఉద్యోగులకు కోటిరూపాయలు ఉచిత ప్రమాద బీమా, 50లక్షలు రూపాయల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ టాఫ్ అప్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఇహెచ్ఎస్ పథకం క్రింద ఐదులక్షలు రూపాయల వరకు ఉచిత వైద్యసదుపాయాలు కల్పించాలనేది ఉద్యోగుల సంఘాల నేతల డిమాండ్. ఇప్పుడు టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆధ్వర్యంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం వారిలో మరింతగా అంకితభావ సేవలందించేందుకు దోహదపడుతుందని టిటిడి వర్గాల అభిప్రాయం.

## భగవంతుని ఆశీస్సులందుకున్నాం :శ్రీవారి సేవలో హైకోర్టు జడ్జి



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఉదయం కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు : ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కిషాకౌల్, మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, రాష్ట్రవిద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్త, సినీసంగీత దర్శకుడు తమన్, నటుడు యశ్విన్, యాంకర్ ఓంకార్ తదితరులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకునిస్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులువేదాశీర్వచనం చేశారు.

వార్త

మనకుగల శక్తిని బట్టి మనలను మనం అంచనా వేసుకుంటాం. మనం చేసిన పనులను బట్టి ఇతరులు మనలను అంచనా వేస్తారు.

-జేన్ పోర్టర్

# ఉచిత 'తంత్రం'పై ఆలోచించాలి..

అధికారంలో లేనప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచితతంత్రాన్ని మొదలెట్టడం చూస్తూనే ఉన్నాం. ఎవరికి వారే ఆపద్ధర్మ మంత్రం పాటిస్తుంటారు. ఆపద్ధర్మానికి అయినా ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్ధిని సమకూర్చడం అంత మర్యాద కాదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని, అలాంటి తంత్రాలు వారిలో సోమరితనాన్ని పెంచుతుందని విమర్శలు చాలానే వచ్చాయి. అయినా ఎవరూ లక్ష్య పెట్టిన దాఖలాలు లేవు. రాజకీయాల్లో వాగ్దానాలు చేయడం పరిపాటి. అది ఆయా పార్టీల ఆలోచనా విధానాన్ని ప్రజలకు తెలియ చేసే ఉద్దేశ్యమే కనుక దానిని ఎవరూ తప్పు పట్టరు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. తాజాగా బీహార్‌లో ఏం జరిగిందో ఓటర్లకందరికీ ఎరుకే. తక్షణ ప్రయోజనం వచ్చే వ్యూహాన్ని వెలుగులోకి తెచ్చారు. అధికార పార్టీ లబ్ధి పొందిన విషయం విదితమే. అప్పటికప్పుడు ఖర్చయ్యే తాత్కాలిక లబ్ధి పేదవారికి ఎంతకాలం అక్కరకు వస్తాయో తెలియనిది కాదు. అంచనా వేసుకోవచ్చు. ముందు గుప్పించిన ధర్మ పన్నాలను పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. మళ్ళీ అప్పులకు దేబిరించడంమామూలే. ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికది చాలునన్నట్లు వ్యవహరించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికనుఎవరూ పట్టించుకున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యానించారని కాదు కానీ ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మర్యాద కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలుతున్నాయి. జీతాలు కూడా చెల్లించలేనప్పుడు మళ్ళీ జనం నుంచే వసూలు చేయాలి. అంటే ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం, లేదా అప్పుడు వాటి చర్చల్లోకి దిగడం ఏ మాత్రం పద్ధతిగా లేదు. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించింది. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్, ఉచితంగా రాజ్యాంగ పరంగా ఇలాంటి వాటిపైనా ఆంక్షలు ఉండాలి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకానొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమా నాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 2022జూలైలో యూపీలో బుందేల్ అండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడావ్యతిరేకించాయి. మోడీకిసంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లాక్షీ మోహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ.3వేల వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథకాన్నే ప్రకటించారు. గెలిచి బయటపడ్డారు. నిన్న మొన్నటి బీహారు ఎన్నికల్లో కూడా ఇదే జరిగింది. ఎన్నికల ముందే పంచి పెట్టేశారు. పైగాప్రభుత్వపరంగా ముందే తాయిలాలు విసిరేశారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతే చేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయానుకూలంగా వాటిని అనుమతించగలరని అర్థం చేసుకోవచ్చు. దాని మహత్యం అలాంటిది. నగదు బదిలీల వల్ల ప్రజల విని యోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. రెండు రోజులక్రితం రాజకీయాల్లో ఉచితాల సంస్కృతిని మాజీ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తప్పు పట్టారు. అవి భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. తక్షణం వాటిని నివారించాలని ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వానికి ధైర్యం ఉండదు. ఇలాంటి పరిస్థితులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకుని నిర్దిష్ట ప్రయోజనాలు మేరకే వాటిని కొనసాగిస్తే దేశానికి మేలు జరుగుతుంది.

మహామేధస్సు అనేదేదీ లేదు. మహా మేధస్సు అంటే శ్రమ, నైపుణ్యాల సమాహారమే.



లియో టాల్‌స్టాయ్

మిడిమిడి జ్ఞానం ఉన్నవారు ప్రతి విషయాన్ని వివరిస్తారు. వాళ్లదేన్నీ చూసీ ఆశ్చర్యపోరు.



బైరన్

## ప్రజావాక్కు



### గిడ్డంగులు ఏర్పాటు చేయాలి

దేశంలో రైతుపండించిన ధాన్యానికిఉత్పత్తులకు మార్కెట్‌లోకి వెళ్లేవరకు సంశయంగా ఉంటున్నది. అకాల వర్షాలు మన దేశ రైతుకు ఒకశాపంగా మారుతున్నవి. పండించిన ధాన్యాన్ని సురక్షితంగా భద్రంగా నిలువ చేయుటకు సరియైన గిడ్డంగులు ఏర్పాటు చేయడంలేదు. ఫలితంగా రైతు బ్రతుకు గాలిలో దీపంగా మారుతున్నది. లక్షలు పెట్టి పండించిన పంటలఫలితం అందకపోవడంవలన రైతు బ్రతుకు చిధ్రంగా మారుతున్నది. దేశానికి అన్నం పెడుతున్న రైతుకు సరైన వసతులు కల్పించకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడుతున్నది. అన్నిరాజకీయ పార్టీ నాయకులు అధికారులురైతుల గురించిఎన్నెన్నో కట్టుకథలు చెబుతుంటారు. కానీ ఆచరణలో శూన్యం. క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వవలసిందే అత్యంత ఆధునిక స్టేడియాలు ఇతరత్రా వసతులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

- దండంరాజ రాంచందర్ రావు, హైదరాబాద్

### ఓవర్ బ్రిడ్జి తిప్పలు

గత నెలలో గుంటూరు మార్కెట్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్‌ను కలిపే ఓవర్‌బ్రిడ్జిని శిధిలావస్థకి చేరిందని కూల్చేశారు. అధికారులు ఏవో కొన్నిప్రత్యామ్నాయ మార్గాలు చూపినా విద్యా, వైద్యం వంటి అత్యవసర పనులపై వెళ్ళే వారికి చాలా సమయంపడుతుంది. ఇది గుంటూరులో ముఖ్య కూడలి. మరో వైపు కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సంవత్సరం పడుతుందో రెండు సంవత్సరాలు పడతాయోతెలియదు. ఈమధ్య ఆధునికటెక్నాలజీ సాయంతో వారం, తేలికపాటి ఇళ్లని నిర్మిస్తున్నట్లు తెలిసింది. అదే టెక్నాలజీతో ద్విచక్రవాహనాలు, ఆటోల వంటి తేలికపాటి వాహనాలు వెళ్ళే విధంగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఉచిత న్యాయ సేవలు అందించాలి

వికలాంగులకు ఉచిత న్యాయ సేవలు అందించవలసిన అవసరం ఉంది. వికలాంగులకు సంబంధించిన భూమి సమస్యలు. అప్పుకాగితాల సమస్యలు. ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న వికలాంగుల పెండింగ్‌దరఖాస్తులు. వికలాంగులకు సంబంధించిన కుటుంబసమస్యల పరిష్కారం కోసంఉచిత న్యాయసహాయం అవసరం. తెలంగాణా రాష్ట్రంలో40లక్షలకు పైగావికలాంగులున్నారు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### సంచార్ సాథీ తోడు గానా? నీడ గానా?

కేంద్రప్రభుత్వం సంచార్ సాథీయాప్‌ని అన్నిఫోన్లలో తప్పని సరిగా ఇన్‌స్టాల్ అయి ఉండేలా తయారీదారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ యాప్‌తో ఫోన్ ద్వారా జరిగే సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించడంతోబాటు, సకాలంలో అడ్డుకొనే అవకాశం ఉంటుందని చెప్తోంది. కొన్న ఫోన్ అసలా, నకిలీయా తెలుసుకోవడం, పోతే బ్లాక్‌చెయ్యడం సులువని, అందుకొనే ఫోన్ కాల్స్ మోసపూరితం అని గుర్తించి హెచ్చరించే వీలుంటుందని చెప్తోంది. ఆ యాప్ ద్వారాఏడు లక్షలఫోన్ల ఉనికి తెలిసిందని, లక్షలాది తప్పుడు కనెక్షన్లను రద్దు చేయడం జరిగిందని, కనుక ఆ యాప్‌ని రానున్న కాలంలో అన్ని ఫోన్లలో తప్పనిసరి చేస్తే మేలు జరుగుతుందని చెప్తోంది. ఈ ప్రకటన వినగానే ప్రతిపక్షాలు, కొన్నిసాంకేతిక పరిజ్ఞానం ఉన్నసంస్థలు ఆందోళన వెలిబుచ్చాయి. ఇలా ఒక యాప్‌ని ఫోన్‌లో తప్పనిసరి చేయడంలో ప్రభుత్వానికి వేరే ఉద్దేశాలున్నాయని అంటున్నాయి.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### స్టడీ అవర్స్ పెట్టాలి

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ విద్యాశాఖలో పని చేస్తున్న మంచి ఉపాధ్యాయులను అభినందించడం వారి సంస్కారాన్ని తెలియజేస్తున్నది. వారిని ప్రోత్సహిస్తూ ఉన్నారు. పదవ తరగతి విద్యార్థుల పరీక్షలనుదృష్టిలో పెట్టుకొని సెలవు దినాలలో ముఖ్యంగా ఆదివారాలలో స్టడీ అవర్స్ పేరుతో రోజుకు రెండు సబ్జెక్టులు చొప్పున విద్యార్థిని విద్యార్థులను చక్కటి పర్యవేక్షణలో చదివించాలని చూడటం చాలా మంచి నిర్ణయమే కానీ పదవ తరగతి వంద రోజుల ప్రణాళికలో ఉదయం ఎనిమిది నుండి సాయంత్రం ఐదు వరకువిద్యార్థులకు స్టడీ అవర్స్‌తో రోజుకు నాలుగు సబ్జెక్టులు నిర్వహించమంటూ విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం చేసే ఉన్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### అతివలకు ఆర్థిక చేయూత

సమాజంలో మహిళల స్థానం మరింత బలపడాలంటే ఆర్థిక రంగంలోవారికి దృఢమైన చేయూత అవసరం. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలు మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే కాదు, వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలుఉపాధి, స్వయంఉపాధి అవకాశాలు పొందుతున్న తీరు పరిశీలిస్తే ఆర్థిక ఆత్మనిర్భరతకు ఇది ముఖ్యమైన అడుగు.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నైపుణ్య యువతే దేశానికి భవిత!

*ఏటా దాదాపు 1.1 కోట్ల దేశీయ యువత కొత్తగా ఉద్యోగాల వెతుకులాట మొదలుపెడుతుండగా, వారిలోసగం మంది తగిన నైపుణ్యాలు లేనేలేవు. మరోవైపు తమ సంస్థలలో పని చేయటానికి మెరుగైన మానవ వనరులు దొరకటం లేదంటూ ప్రముఖ సంస్థలు వాపోతున్నాయి. ఈ అగాధాన్ని పూడ్చడమే ఇప్పుడు దేశం ముందున్న అతిపెద్ద సవాలు! మన కార్మిక శక్తిలో 92 శాతానికిపైగా అసంఘటిత రంగంలో ఉండగా, 8 శాతం మంది మాత్రమే సంఘటిత రంగంలో సేవలందిస్తున్నారు. ఈ రెండు వ్యవస్థల అవసరాలు పూర్తిగా భిన్నమైనవే అయినా, యువతకు నైపుణ్యాలను అందించి, వారిని నిలకడగల ఉపాధిబాట పట్టించటం అవసరం. మనదేశంలో బెంగాల్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఏపీలలో యువ జనాభా తగ్గుతుండగా, రాజస్థాన్, బీహార్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో యువ జనాభా ఎక్కువగాఉంది. అయితే ఉత్తరాది యువత సాంకేతిక విద్యలేక సంప్రదాయ వృత్తుల్లో ఉండిపోతుండగా, దక్షిణాది వారు టెక్ నైపుణ్యాలను అందిపుచ్చుకుని విదేశీ అవకాశాలను పొందే దిశగా అడుగులువేస్తున్నారు. ఈ లోపాన్ని సరిదిద్దితే కాస్త ఆలస్యంగానైనా ఈ తేడాను సరిచేయవచ్చు.*

కోడూరు సాల్మన్ రాజు

ఏ దేశానికైనా నైపుణ్యాలతో కూడిన యువత ప్రధాన బలం. ప్రపంచంలో అత్యధిక యువజనాభా గల దేశం మనదే. ప్రపంచ యువ జనాభా 180 కోట్లుగా ఉంటే 28 శాతం వాటా మనదే. మరి మన యువతలో ఉండాల్సినంత ఉత్తేజం. ఉత్సాహం ఉన్నాయా? అంటే డౌటే. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పమున్న యువత ఈ దేశానికి అవసరం. నా నమ్మకం, ఆశ అంతా నా యువతపైనే అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు ముమ్మాటికీ అక్షర సత్యాలు. ప్రశ్న ఆయుధం కావాలి. ఏ ఉద్యమం విజయవంతం కావాలన్నా, ఏ ప్రాజెక్టు పట్టాలెక్కాలన్నా యువత క్రియాశీల భాగస్వామ్యం అవసరం. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా యువతలో పెరుగుతోన్న అసంతృప్తి అంశం మీద సర్వే చేసిన ఒక అంతర్జాతీయమీడియా సంస్థ తన నివేదికను వెల్లడించింది. రాబోయే రోజుల్లో వచ్చే తిరుగుబాట్లలో చురుగ్గా పాల్గొంటారా..? అనే ప్రశ్నను 35 దేశాల్లోని 18-34 ఏళ్ల మధ్య వయసున్న 5.8 లక్షలమందిని అడగగా వారిలో సగానికి పైగా అవుననటం ప్రపంచ యువత అసంతృప్తికి నిదర్శనం. అందరికీ మెరుగైన విద్య, ఉపాధి, సమాజంలో సమాన అవకాశాలు లేకపోవటమే ఈ దుస్థితికి కారణమని ఆ నివేదిక వాపోయింది. మన చుట్టూ జరుగుతోన్న వాస్తవ పరిస్థితులను గుర్తించడంలో ఏమాత్రం ఏమరుపాటు వహించినా ఒక తరంఅభివృద్ధి ప్రమాదంలో పడుతుంది. యువశక్తి దేశాభ్యుదయానికి జీవనాడి. ఆ తరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనఅందరిపై ఉంది. ఇక మనదేశంలో 15-29 ఏళ్ల మధ్య వయస్కులను యువతగా పరిగణిస్తున్నాం. స్థూల దేశీ యోత్పత్తిలో వీరి వాటా 34శాతంగా ఉంది. యువ జనాభాపరంగా భారత్‌ను మరే దేశమూ అందుకోలేదనే మాటలు.. ఒకవైపు సంతోషాన్ని, మరోవైపు బాధనీ కలగజేస్తున్నాయి. పనిచేయగల వయసులో ఉన్న యువత ఉండటం సంతోషానికి కారణమైతే మనదేశంలోని యువతకు తగిన నైపుణ్యాలు లేవనే వాస్తవం బాధ పెడుతోంది. దేశంలో డిగ్రీ చదివిన వారిలో 35.2శాతం, పీజీ పట్టా పుచ్చుకున్నవారిలో 36.2శాతం, సంప్రదాయ వృత్తి విద్యా కోర్సులను అభ్యసించినవారిలో 33 శాతం మంది నిరుద్యోగులుగా మిగిలిపోవటం లేదా తమ చదువుకు తగని చిన్నాచితకా కొలువులతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. ఇక పురుషులతో పోల్చితే యువతుల్లో చాలా ఎక్కువగా ఉంది. దేశ జనాభాలో 48శాతం వాటా మహిళలదే అయినా కార్మిక శక్తిలో వారి భాగస్వామ్యం 20 శాతమే! మహిళలకు అనువైన ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వాల వైఫల్యం, పురుషాధిక్య భావజాలం, మెరుగైనరవాణా సదుపాయాలు లేకపోవటం, పిల్లల బాధ్యత తల్లిదేననే ధోరణి దేశంలో మహిళాశక్తికి సమానావకాశాలను దూరంచేస్తున్నాయి. ఏటా దాదాపు 1.1 కోట్ల దేశీయ యువత కొత్తగా ఉద్యోగాల వెతుకులాట మొదలుపెడుతుండగా, వారిలోసగం మంది తగిన నైపుణ్యాలు లేనేలేవు. మరోవైపు తమ సంస్థలలో పనిచేయటానికి మెరుగైన మానవ వనరులు దొరకటం లేదంటూ ప్రముఖ సంస్థలు వాపోతున్నాయి. ఈ అగాధాన్ని పూడ్చడమే ఇప్పుడు దేశం ముందున్న అతిపెద్ద



సవాలు! మన కార్మిక శక్తిలో 92శాతానికిపైగా అసంఘటిత రంగంలో ఉండగా, 8 శాతం మంది మాత్రమే సంఘటిత రంగంలో సేవలందిస్తున్నారు. ఈ రెండు వ్యవస్థల అవసరాలు పూర్తిగా భిన్నమైనవే అయినా, యువతకు నైపుణ్యాలను అందించి, వారిని నిలకడగల ఉపాధి బాట పట్టించటం అవసరం. మనదేశంలో బెంగాల్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఏపీలలో యువ జనాభా తగ్గుతుండగా, రాజస్థాన్, బీహార్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో యువ జనాభా ఎక్కువగాఉంది. అయితే ఉత్తరాది యువత సాంకేతిక విద్యలేక సంప్రదాయ వృత్తుల్లో ఉండిపోతుండగా, దక్షిణాది వారు టెక్ నైపుణ్యాలను అందిపుచ్చుకుని విదేశీ అవకాశాలను పొందే దిశగా అడుగులువేస్తున్నారు. ఈ లోపాన్ని సరిదిద్దితే కాస్త ఆలస్యంగానైనా ఈ తేడాను సరిచేయవచ్చు. దేశంలో 2022 నాటికి 40కోట్ల యువతకునైపుణ్య శిక్షణనిచ్చి, భిన్న రంగాల్లో వారిని తిరుగులేని మానవ వనరులుగా మలచే లక్ష్యంతో 2015లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'నైపుణ్య భారత్' ప్రోగ్రాం ఆశించిన ప్రయోజనాలను సాధించలేకపోయింది. 2016లో ప్రారంభమైన 'స్టార్టప్ ఇండియా' అత్యధిక సంఖ్యలో అంకుర సంస్థలున్న మూడో దేశంగా భారత్‌ను మార్చినా స్టార్టప్లకు కావలసిన సదుపాయాలను, అనువైన వాతావరణాన్ని కల్పించలేకపోయింది. 94 శాతానికి పైగా స్టార్టప్ల నిధుల కొరతతో ఆరంభమైన ఏడాదిలోపే మూతబడుతున్నాయి. మరోవైపు ప్రతిభావంతులైన సాఫ్ట్వేర్లు విదేశీ ఉద్యోగాలకు పోవటం వల్ల ఏటా దేశానికి భారీగా నష్టం కలుగుతోంది. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని, నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి నడుం బిగించారు. రాష్ట్రంలోని యువత సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుని ప్రపంచంతో పోటీ పడాలని, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. గాంధీ స్ఫూర్తితో ఈ వర్సిటీ ఏర్పాటు చేశామని లక్షల మంది యువతకు నైపుణ్యాలను అందించి వారికి కొలువులు కల్పించటమే దీని లక్ష్యమని ప్రకటించారు. ఈ వర్సిటీలో 17 కోర్సులుంటా యని, ఈ ఏడాది అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఆస్కి)లో ఆరు కోర్సులలో 2 వేల మందికి నైపుణ్య శిక్షణనిచ్చేందుకు ఏర్పాటు జరుగుతున్నాయి. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లలకు బోధన రుసుం రీయింబర్స్ చేయటం, ట్రైనింగ్ పూర్తయిన వారికి కొలువులిచ్చేందుకు కొన్ని కంపెనీలున్నాయన్నారు. దేశంలో డిగ్రీ చదివిన వారిలో 35.2శాతం, పీజీ పట్టా పుచ్చుకున్న వారిలో 36.2శాతం, సంప్రదాయ కోర్సులను అభ్యసించినవారిలో 33 శాతం మంది నిరుద్యోగులుగా మిగిలిపోవటం లేదా తమ చదువుకు తగని కొలువులతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. ఇక పురుషులతో పోల్చితే యువతుల్లో చాలా ఎక్కువగా ఉంది. దేశ జనాభాలో 48శాతం వాటా మహిళలదే అయినా కార్మిక శక్తిలో వారి భాగస్వామ్యం 20 శాతమే! తెలంగాణ యానిమేషన్ అసోసియేషన్ ముందుకు రావటం విశేషం. ముచ్చర్ల సమీపంలో వర్సిటీ మెయిన్ క్యాంపస్ ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని 6 ప్రాంతాల్లో దీనికి అను బంధంగా క్యాంపస్‌ల ఏర్పాటుకు సర్కారు రెడీ అవుతోంది. ఇంత పెద్ద దేశంలో కేవలం ఢిల్లీ, హర్యానా, తెలంగాణ తప్ప మరో రాష్ట్రంలో స్కిల్ వర్సిటీలు లేకపోవటందురదృష్టకరం. ఏది ఏమైనా తెలంగాణ ప్రభుత్వ చొరవను ప్రశంసించాలి. ప్రభుత్వం చేపట్టిన ఈ స్కిల్ యూనివర్సిటీ రాబోయే రోజులలో నైపుణ్యాల శిక్షణలో దేశానికే దిశానిర్దేశం చేయాలని అందరం ఆకాంక్షిద్దాం. ●

# సంస్కృతి, సంప్రదాయాలే భారతీయ హృదయం

డా. చిటికెన కిరణ్ కుమార్

భారతదేశం అనేది ఒక గాన సమూహంలా ఉంటుంది ప్రతి రాష్ట్రం, ప్రతి సంస్కృతి తన స్వరం జోడిస్తుంది. తమిళనాడులో భరతనాట్యం, పంజాబ్‌లో భాంగ్రా, ఒడిశాలో ఒడిసి, ఆంధ్రలో కూచిపూడి ఇవన్నీ భారత హృదయంలో మిళితమైన నాట్య నాదాలు. మన సంస్కృతులు భిన్నమైనా, ఆత్మ మాత్రం ఒక్కటే. మనసుకు ఆనందం పంచే భారతీయత. భారతదేశం పేరు వినగానే మనసులో ఒక చిలిపి వెలుగు జ్వలిస్తుంది. ఈ నేలపై అడుగు పెట్టిన ప్రతి వాడికి ఏదో ఒక కోణంలో మనసు ముడుచుకునే శాంతి తాకిడి కలుగుతుంది. ఎందుకంటే ఇక్కడి మట్టిలో సాంస్కృతిక సుగంధం నిండి ఉంది. ప్రతి గాలి తాకిడిలోనూ, ప్రతి జాతరలోనూ, ప్రతి పండుగలోనూ మనిషి మనసు అద్దంలా ప్రతిబింబించే జీవన రంగులు దాగిఉన్నాయి. భారతదేశం ఒక దేశం మాత్రమే కాదు, అది జీవన విధానాల కలయిక. ఉత్తరంలో హిమాలయాల మేడల నుంచి దక్షిణంలో సముద్రపు అలల వరకు ప్రతిప్రాంతం తనదైన సంస్కృతి, భాష, ఆచారాలను మోస్తూ సాగుతుంది. ఇక్కడి ప్రతి భాష ఒక సంగీతం లాంటిది, ప్రతి ఆచారం ఒక కవిత్వం లాంటిది. ఇక్కడ మనిషి ప్రకృతితో మమేకమై జీవిస్తాడు. పండగలలో పూలు, పళ్ళు, ఆకులు ఉపయోగించడం కూడా ప్రకృతిని గౌరవించే మనసుకే సంకేతం. సూర్యుడిని ప్రార్థించడం, గంగానది వద్ద దీపాలు వెలిగించడం, చిగురుటాకులా పచ్చని జీవన విలువలు ఇవన్నీ మన మట్టిలోనే పుట్టినవే. ప్రతి రాష్ట్రం ఒక రంగురంగుల చిత్రపటం లాంటిది. తమిళనాడులోని భరతనాట్యం, కేరళలో కతకళి, పంజాబ్‌లో భాంగ్రా, అస్సాంలో బిహు ఇవన్నీ మన భారతాత్మకు రూపాలు. తెలుగు నేలలో ఉగాది పచ్చడి తినే ఆనందం ఎంత, అదే ఆనందం ఉత్తరంలో హోలీ రంగులు చల్లే ఉత్సాహంలో కనిపిస్తుంది. ప్రతి సంప్రదాయమూ, ప్రతి ఆచారమూ మనిషి ఒకటే, రూపాలు మారినా భావం ఒక్కటే అని చెబుతుంది. ఈదేశం సాంస్కృతికంగా విభిన్నమైనా, మనసులుగా ఏకమైనది. పండగలు వేరు అయినా ఆనందం మాత్రం ఒకటే. దుస్తులు వేరు అయినా మనసు మాత్రం మనదే. ఈ అందమే భారతదేశాన్ని ప్రపంచంలో ప్రత్యేకంగా నిలబెడుతోంది. కాలం మారినా భారత సంస్కృతి మారలేదు. మారినది రూపం మాత్రమే. ఆధునికత రాగంలోనూ సంప్రదాయం తాళాన్ని కోల్పోలేదు. ఈ రెండు కలిసిపోయి నేటి భారత జీవన గీతాన్ని పాడుతున్నాయి. యువత కొత్త మార్గాలు వెతుకుతున్నా, తమ మూలాలను మరవడం లేదు. ఇదే ఈ దేశ బలం మార్పును ఆహ్వానిస్తూ, మూలాలను మర్చిపోని సంస్కారం. ఈ నేల మనకు చెప్పే పాఠం ఒక్కటే విభిన్నత్వంలో ఏకత్వమే నిజమైన భారతీయత. మనం భిన్నంగా కనిపించినా, మన హృదయ స్పందన ఒకటే. ఈ బంధమే మనల్ని ఒకటిగా ఉంచుతుంది. ఈ స్నేహమేమన సంస్కృతికి స్ఫూర్తి. భారతదేశం అనేది కేవలం భూభాగం కాదు, అది అనుభూతుల అల్లిక. ప్రతి రాష్ట్రం ఒక రాగం, ప్రతి పద్ధతి ఒక తాళం. ఈ దేశం మొత్తం ఒక సంగీత సమ్మేళనం లాంటిది. విభిన్న భాషలు, వర్ణాలు, దుస్తులు, వంటకాలు ఉన్నప్పటికీ వాటన్నింటి వెనుక ఒకే తాత్పర్యం ఉంది. మానవత్వం, సఖ్యత, పరస్పర గౌరవం. తూర్పున సూర్యుడు మొదట ఉదయిస్తే, పశ్చిమం సాయంత్రపు రంగులతో చిగురుస్తుంది. ఈ భిన్నతలు మన దేశానికే అందం. తెలంగాణలోని బతుకమ్మ పూలవేడుకలలో కనిపించేమహిళా సౌందర్యం, కేరళలోని ఓనం పండుగలో కనిపించే కుటుంబ సఖ్యత, గుజరాత్‌లో గర్బా నృత్యాలలో కనిపించే ఉత్సాహం ఇవన్నీ ఒకదానితో ఒకటి మమేకమై భారతీయతను నింపుతున్నాయి. ఒక రాష్ట్రపు ఆచారం మరొక రాష్ట్రంలో కొత్త రూపంలో పుట్టి సజీవమవుతుంది. భారతదేశం అనేది కేవలం భూభాగం కాదు, అది మనసుల తంతి. ఈ నేలపై పుట్టిన ప్రతి ఆచారం మనిషి హృదయంలోని మంచితనానికి ప్రతిరూపం. ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి సాంప్రదాయం చేరినప్పుడు అది రూపం మార్చుకున్నా, భావం మాత్రం అదే ఉంటుంది. పరస్పర గౌరవం, పరస్పర ప్రేమ. అదే ఈ నేలగొప్పతనం. ప్రతి రాష్ట్రం ఒక పాఠశాల, ప్రతి పద్ధతి ఒక గురువు. పసిడి మట్టిలో పండే పంటలోనూ, పండగ వెలుగుల్లోనూ మనిషి శ్రమకు గౌరవం కనిపిస్తుంది. మన దేశ సంస్కృతి నేను అనే భావాన్ని కాకుండా మనం అనే జీవన పంథాను నేర్పింది. ఈ మనస్తత్వమే భారతీయతకు మూలాధారం. కాలం మారినప్పటికీ మన ఆచారాలు నిలకడగా నిలిచాయి. అవి బంధాలను కాపాడే తాడు లాంటివి. ప్రతి పండుగ వెనుక ఉన్నది ఒక కరుణ భావం. ప్రతి నృత్యం వెనుక ఉన్నది ఒక భక్తి నిబద్ధత. ఇవన్నీ కలిసి మన దేశాన్ని జీవించించే హృదయమై ఉన్నాయి. భారత సాంస్కృతిక సంపదలో కొత్త తరం అడుగులు వేస్తోంది. సాంకేతికత వచ్చి దానిని దూరం చేయలేదు, మరింత దగ్గర చేసింది. పాత పద్ధతులలో కొత్త ప్రాణం నింపిన యువత, ఈ సంస్కృతిని కాలాతీతంగా మార్చింది. మన సంస్కృతి ఇప్పుడు కేవలం జ్ఞాపకం కాదు. అది ప్రతీ రోజు మన ఊపిరిలోనూ, మన కర్మల్లోనూ జీవిస్తోంది. మనసు కలవడానికి మతం అవసరం లేదు, మమకారం చాలు. ఒకరి పండుగలో మరొకరు పాలు పంచుకోవడం, ఒకరి భాషను మరొకరు గౌరవించడం, ఒకరి ఆనందంలో మరొకరు పాల్గొనడం ఇవే మన భారతం అసలైన రూపం. భారతీయత అనేది మాటల్లో చెప్పే గర్వం కాదు, మనలో నాటుకుపోయిన జీవన విలువ. ●

# నాణ్యమైన నేలలే ఆర్థిక వ్యవస్థకు మూలాధారం

డి జయరాం

ప్రపంచ ఆహార భద్రతపై ప్రతి సంవత్సరం అంతర్జాతీయ నివేదికలు హెచ్చరిస్తున్నా, మన వ్యవసాయ నేల ఆరోగ్యంపై మనం తీసుకుంటున్న చర్యలు సరిపోవడం లేదు. 2050 నాటికి ఆహార ఉత్పత్తిని 60 శాతం పెంచాల్సిన అనివార్యత మన ముందు ఉంది. అయితే, నేటికీ మనం తినే ఆహారంలో 95 శాతానికి మూలమైన భూమిని కేవలం ఒక వనరుగా చూడటంలో విఫలమవుతున్నాం. సుస్థిర భూసార నిర్వహణ ద్వారా మనం ఇంతకంటే ఎక్కువ ఆహారాన్ని ఉత్పత్తి చేయగలం అన్నది కేవలం ఒక గణాంకం కాదు, మనందరిపై ఉన్న సామాజిక బాధ్యత. నేల అంటే కేవలం మట్టి కాదు, ఒక జీవ వ్యవస్థ. వ్యవసాయ నేలను కేవలం పంటలు పండించే పైపొర మట్టిగా మనం భావించడం ఆపాలి. ఇది మొక్కలకు ఆధారాన్ని ఇచ్చే ఒక గట్టి పునాది మాత్రమే కాదు. వానపాములు, కోట్లాది సూక్ష్మజీవులు నివసించే ఒక సజీవ పర్యావరణ వ్యవస్థ. ఈ జీవరాశులే చనిపోయిన సేంద్రియ పదార్థాలను కుళ్లబెట్టి, నేలకు సారవంతాన్ని పెంచుతాయి. మనమందరం తెలుసుకోవాల్సిన విషయం ఏంటంటే, ఒక ఆరోగ్యకరమైన నేల లేకపోతే మంచి పంట దిగుబడి అసాధ్యం. మొక్కలకు అవసరమైన 15 రకాల పోషకాలను అందించే ఈ తల్లి లాంటి భూమిని మనం నిస్సత్తువగా మారనివ్వడం నిజంగా మన దురదృష్టం. ఆరోగ్యకరమైన నేలలు లేకపోతే, సుస్థిర ఆహార వ్యవస్థల నిర్మాణం కేవలం కలగానే మిగిలిపోతుంది. ప్రపంచ బ్యాంకు నివేదికలు ఏం చెబుతున్నా, మన దేశంలో సాగుకు అనువైన భూమి 51.8 శాతం అనేది ఎక్కువగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న జనాభా కారణంగా తలసరి సాగు భూమి విస్తీర్ణం తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తుంది. అత్యంత సారవంతమైన ఒండ్రు నేలలు మన వ్యవసాయానికి పట్టుకొమ్మలు. కానీ, నేడు మన దేశ నేలల్లో నత్రజని, భాస్వరం, జింక్ వంటి ముఖ్యమైన పోషకాల లోపం తాండవిస్తోంది. దీనికి ప్రధాన కారణం ఏంటంటే, రైతులు అసమతుల్య ఎరువుల వాడకం, కేవలం దిగుబడిపై దృష్టి సారించడం. ఈ అశ్రద్ధ నేల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుంది. 1990లలో పొటాషియం లోపం, 2000లో సల్ఫర్ లోపం వంటి సమస్యలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయంటే, నేల ఆరోగ్యంపై విధాన నిర్ణేతలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థమవుతోంది. నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ చెప్పినట్లుగా, హెక్టారుకు 15.35 టన్నుల పోషకాలు కోల్పోతున్నామంటే, మనం ప్రతి సంవత్సరం మన భవిష్యత్తును కోల్పోతున్నట్లే. అడవుల నరికివేత, అస్తవ్యస్తమైన సేద్యపు



పద్ధతుల కారణంగా సారవంతమైన పైపొర గాలికి, నీటికి కొట్టుకుపోతోంది. అతిగా పశువులను మేపడం, వాతావరణ మార్పుల వలన సారవంతమైన నేల ఉత్పాదకత కోల్పోయి ఎడారీకరణ జరుగుతోంది. దీనిని కేవలం ప్రకృతి వైపరీత్యంగా భావించడం సరికాదు, ఇది మన మానవ తప్పిదం. నేలకు బలం ఇచ్చే సేంద్రియ కార్బన్ ప్రమాదకర స్థాయిలో తగ్గడం మన నేలల గుండె బలాన్ని కోల్పోవడమే. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులను ఇష్టం వచ్చినట్లుగా వాడటం వలన నేలలు కలుషితమై పోషకాల సమతుల్యత దెబ్బతింటోంది. అతిగా నీటిపారుదల చేయడం వలన నేలలు ఉప్పగా, క్షారంగా మారి పంటలు పండించడానికి కష్టంగా మారుతున్నాయి. నీటి పారుదల సరిగా లేనిచోట నీరు నిలిచిపోయి, మొక్కల వేర్లు చనిపోవడం చూస్తుంటే, మన నీటి యాజమాన్యం ఎంత నాసిరకంగా ఉందో అర్థమవుతోంది. చిన్న కమతాల రైతులు సాంకేతికతను అందుకోలేకపోవడం, నేల పరీక్షలు చేయించుకోకపోవడం, పంట అవశేషాలను తగులబెట్టడం వంటి పద్ధతులపై అవగాహన లేకపోవడం సామాజిక వైఫల్యం. కేవలం రెండు లేదా మూడు సెంటీమీటర్ల మట్టిని ఉత్పత్తిచేయడానికి వేల సంవత్సరాలు పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ వాస్తవం మనందరినీ ఆత్మపరిశీలన చేసుకునేలా చేయాలి. ఈ సవాళ్లను అధిగమించడానికి, మనం కేవలం సాంకేతికతపై ఆధారపడకుండా, మనసు పెట్టి సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి. నేల కోత సమస్యను తగ్గించడానికి అడవులను పెంచడం, గట్ల నిర్మాణం వంటి పద్ధతులను మనం జాతీయ ఉద్యమంలా చేపట్టాలి. సేంద్రియ కార్బన్ కొరతను తీర్చడానికి పంట అవశేషాలను తగులబెట్టకుండా నేలలోనే కలిపేయాలి. పశువుల ఎరువు, జీవామృతంవంటి సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వం ఇచ్చే నేల ఆరోగ్య కార్డులను తప్పనిసరి చేసి, దాని ఆధారంగానే రైతులు ఎరువులు వాడేలా కఠిన నిబంధనలు పెట్టాలి. అప్పుడే పోషకాల అసమతుల్యత తగ్గుతుంది. నీటి యాజమాన్య సమస్యల పరిష్కారానికి బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి నీటిని ఆదా చేసే పద్ధతులను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలి. చిన్న రైతులను సంఘాలుగా ఏకం చేసి, వారికి నిరంతరంగా శిక్షణ ఇవ్వడం ద్వారానే మార్పు సాధ్యమవుతుంది. మన వ్యవసాయ రంగ సుదీర్ఘ విజయం, దేశ ఆహార భద్రత పూర్తిగా నేల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, రైతులు, ముఖ్యంగా ప్రతి పౌరుడు సమష్టిగా ఈ సాంకేతిక, విధానపరమైన పరిష్కారాలను అమలు చేసినప్పుడే మన వ్యవసాయ నేల దీర్ఘకాలికంగా సారవంతంగా ఉంటుంది. నాణ్యమైన నేలనే ఆరోగ్యకరమైన పంటలకు, పౌష్టికాహారానికి, సుస్థిర ఆర్థిక వ్యవస్థకు మూలాధారం. నేల సంరక్షణ అనేది కేవలం రైతు బాధ్యత మాత్రమే కాదు. ఇది మనందరి భవిష్యత్తు కోసం మనం చేపట్టాల్సిన జాతీయ కర్తవ్యం!. ●

## 20 సూత్రాల ఆర్థిక పథకం చైర్మన్ లంకా దినకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్ శ్రీనివాసులు



గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 4 ( ప్రభాతవార్త ) : ప్రభుత్వ 20 సూత్రాల ఆర్థిక పథకాల సమీక్షా సమావేశానికి గుంటూరుకు వచ్చిన చైర్మన్ లంకా దినకర్ ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించారు. గురువారం ఆయన పథకాల అమలు తీరును సమీక్షించేందుకు గుంటూరు నగరానికి చేరుకున్నారు. ఐబి లో ఉన్న చైర్మన్ లంక జనాకర్ ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలిసి చర్చించారు.

## నూతనంగా నిర్మించే రోడ్ల కంటే ముందే డ్రైన్లు ఏర్పాటు చేయాలి : కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 4 ( ప్రభాతవార్త ) : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించే రోడ్ల కంటే ముందే డ్రైన్లను ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పల్లి శ్రీనివాసులు ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలో డ్రై నులను నిర్మించకుండా నూతనంగా రోడ్లు నిర్మాణం చేపట్టవద్దని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. నగర పర్యటనలో భాగంగా గురువారం స్తంభాల గరువు, బ్రాడీపేట, అరండల్ పేట తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి వాళ్ల




అభివృద్ధి పనులు పారిశుధ్య పనులను పరిశీలించి ఆయా విభాగాల అధికారులు సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు. నగరంలో డ్రైన్లు ఏర్పాటు చేయకుండా రోడ్లు నిర్మాణం వల్ల వర్షాలు పడినప్పుడు రోడ్లపై నీరు నిల్వ ఉండి పాడైపోతున్నాయని తెలిపారు. డ్రైనులు నిర్మాణం చేపట్టాక మాత్రమే రోడ్లు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో డ్రైన్లపై ఆక్రమణలను తొలగించడంలో పట్టణ ప్రణాళిక అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. తమ పర్యటనలో భాగంగా ఎక్కడైనా ఆక్రమణ గుర్తిస్తే సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉండాల పేట ఒకటో లైన్ లో డ్రైనేజీ వాటర్ ఫ్లోర్ ప్రజారోగ్య విభాగ అధికారులు తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. స్తంభాలగరువులోని మహాప్రస్థానాన్ని కార్పొరేషన్ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో ఈ ఈ వేణుగోపాల్, ఏసీపీ రహమాన్, ఇంజనీరింగ్ భాగం అధికారులు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## బీపీఎస్ తో అనధికారిక నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం

### పట్టణ ప్రణాళిక రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 4 ( ప్రభాతవార్త ) : నిర్దేశిత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అనుమతి పొందిన, అనుమతి లేకుండా అనధికారికంగా నిర్మించిన కట్టడాలను ప్రమతికరించుకునేందుకు ప్రభుత్వం బిపిఎస్ విధానంతో అవకాశం కల్పించిందని పట్టణ ప్రణాళిక రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ( ఆర్ డి ) పి. మధు కుమార్ తెలిపారు. గుంటూరు నగరంలోని కాకా




రోడ్డులో ఉన్న ఏఎస్ కన్వెన్షన్ హాల్లో గురువారం బిల్డింగ్ ప్లీనలైజేషన్ స్కీం ( బి పి ఎస్ ) అమలు విధానంపై పట్టణ ప్రణాళిక అధికారులు, ఎల్టిపీలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మధు కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ లోపు నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బిపిఎస్ విధానం అమలు చేస్తూ జీవో నెంబర్ 225 జారీ చేసింది అని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి ఈ బిపిఎస్ విధానంలో అమలు



చేసుకుని అనధికారికంగా నిర్మాణం చేపట్టిన భవనాలను క్రమబద్ధీకరించుకునేలా లైసెన్స్ ఇంజనీర్లు, ప్లానింగ్ కార్యదర్శులు చొరవ చూపాలని సూచించారు. బిపిఎస్ కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుంచి 120 రోజులు మాత్రమే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా అనుమతి లేని లేఅవుట్లలో నిర్మాణం చేసిన భవనాలను కూడా ఎల్ ఆర్ ఎస్ కింద నిబంధనలకు లోబడి రెగ్యులర్ చేసుకునే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. మున్సిపాలిటీలలో కార్పొరేషన్లలో లైసెన్స్ ఇంజనీర్ల ద్వారా సంబంధిత డాక్యుమెంట్లన్నీ సమర్పించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా పదివేల రూపాయలు పీనల్ చార్జీలు చెల్లించాలని, ఆ తర్వాత డాక్యుమెంట్లు సబ్మిట్ చేయాలని వెల్లడించారు.

## రెండో విడత ల్యాండ్ పూలింగ్ కు రైతుల సన్నద్ధం

అమరావతి, డిసెంబర్4 ప్రభాతవార్త: రాజధాని రెండో విడత ల్యాండ్ పూలింగ్ కు రైతులను ప్రభుత్వం సన్నద్ధం చేస్తుంది ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు.అమరావతి మండలం ఎండ్రాయి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్ నిర్వహించారు.
ఎండ్రాయి గ్రామంలో రైతు ధర్మారావు తో కలిసి ఆయన నివాసంలో బ మంత్రి నారాయణ,పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బ్రేక్ ఫాస్ట్ చేశారు.అమరావతి మండలం లో ల్యాండ్ పూలింగ్ లో ఉన్న 4 రెవెన్యూ గ్రామాల రైతులతో మంత్రి, ఎమ్మెల్యే సమావేశ



నిర్వహించారు.ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ కు ముందే మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో ఆర్డీవో కు 4 ఎకరాల భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ ను రైతు నంబూరి బలరాం అందించారు. ల్యాండ్ పూలింగ్ లో ఏ సమస్య ఉన్నా తన వద్దకు రావాలని మంత్రి భరోసా ఇచ్చారు.ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం కోసం రైతులు ల్యాండ్ పూలింగ్ కు సహకరించాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ లు కోరారు.రాజధానిలో రైతుల భూముల ధరలు పెరగాలంటే స్మార్ట్ ఇండస్ట్రీలు,ఎయిర్ పోర్ట్ రావాలి అన్నారు.దీని ద్వారా ఉద్యోగాలు వచ్చి ఎకనమిక్ గ్రోత్ పెరుగుతుంది అన్నారు.స్పోర్ట్స్ సిటీ నిర్మాణ పనులు ఏడాదిలోగా ప్రారంభించాలని సీఎం చెప్పారు అని వివరించారు.రైతులకు ఇచ్చే ప్లాట్ లలో ముందుగా రోడ్లు వేస్తాం అన్నారు.ఒలింపిక్ క్రీడలు నిర్వహించే స్థాయిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తాం...ల్యాండ్ అక్విజిషన్ అయితే రైతులు నష్టపోతారని ఎమ్మెల్యే లు చెప్పారు.అందుకే గతంలో మాదిరిగా ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటున్నాం అని ఎమ్మెల్యే అన్నారు.ఇప్పటికే ఆయా గ్రామాల్లో గ్రామ సభల ద్వారా ప్రజాభిప్రాయలు తీసుకున్నారు అని ఆయన అన్నారు.రైతులకు క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు ఇచ్చే ప్రతిపాదన పై కేంద్రం సీరియస్ గా పరిశీలిస్తుంది అని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో పాటు వర్షాల వల్ల రాజధాని నిర్మాణ పనులు కొంచెం ఆలస్యం అయ్యాయి అని ఆయన అన్నారు. ల్యాండ్ పూలింగ్ కు సహకరిస్తున్న రైతులందరికీ ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

# గుంటూరు వార్త



## ఇసుక లారీల సమస్యపై సిపిఎం పోరాటం



అమరావతి డిసెంబర్ 4 ప్రభాతవార్త: పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతిలో కాలుష్యం రోజు రోజుకు పెరిగిపోతుందని ఇసుక లారీల వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని సిపిఎం మండల కార్యదర్శి సూరిబాబు ధ్వజమెత్తారు. ప్రధాన రోడ్లపై భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఆ లారీలను ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా తరలించే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని వినతులు అందించామన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యేకి వినతి అందించామని అన్నారు. 30 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారని సూరిబాబు అన్నారు. ఇసుక లారీల సమస్యపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# కల్తీ కారం అడ్డాగా గుంటూరు

## అధికారుల కనుసన్నల్లోనే వ్యవహారమంతా...

### నెలవారీ మామూళ్లతో ప్రేక్షక పాత్ర ... ఇప్పటికైనా మేలుకోకపోతే ప్రజల ఆరోగ్యం హారి చోద్యం చూస్తున్న నిఘా విభాగాలు

**గుంటూరు మిర్చి యార్డు, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** కల్తీ కేటుగాళ్లు గుంటూరు కారం పేరుకు మచ్చ తెస్తున్నారు. కారం లేనిదే ప్రతి ఇంట్లో కూర లేదు... ఈ అవసరాన్ని ఆసరా చేసుకుని గుంటూరు మిర్చి యార్డ్ పరిసరాల్లో విచ్చలవిడిగా కల్తీకారానికి తెర లేపుతున్నారు. యార్డుకు తరలివస్తున్న నాణ్యమైన మిర్చి ఎగుమతులకు పోగా.. మిగిలిపోయిన తాలు, తొడిమెలు మూల పదార్థంగా రంగులు పులిమి వినియోగదారులు ఆకర్షించే విధంగా కల్తీకారాన్ని మిర మెట్లు గొలిపే ప్యాకింగ్ తో మార్కెట్లోకి వదులుతున్నారు. నాసిరకం కారణం నాణ్యత అని నమ్మించి



వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికార కనుసన్నల్లోనే జరుగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీని పసిగట్టి నియంత్రించాల్సిన నిఘా విభాగం మామూళ్ల మత్తులో జోగుతుంది. మిర్చి యార్డ్ పరిధిలో 100కు పైగా కారం మిల్లులలో యథేచ్ఛగా కల్తీకారం తయారవుతున్న అటువైపుగా అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక నెలవారి మామూళ్ల బాగోతం నడుస్తుందన్నది బహిరంగ రహస్యమే. గుంటూరు అడ్డాగా కల్తీ కారం పై జరుగుతున్న అక్రమ వ్యాపారంపై వార్త అందిస్తున్న ప్రత్యేక కథనం.....
డ్యామేజీ మిరపకాయలు, తొలక, మిరపకాయ తొడిమలు తో కాలం



తయారు చేస్తూ ఒక్కొక్క కారం మిల్లుల నుంచి ప్రతిరోజు రెండు నుంచి మూడు లారీల కల్తీకారం రవాణా చేస్తున్నారు. కానీ ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ ఆఫీసర్లు, విజిలెన్స్ విభాగం అధికారులు ఈ యొక్క కల్తీకారాన్ని అణిచివేయలేకపోతున్నారు, మరియు కన్నెత్తి చూడకపోవడం ప్రశ్నార్థకారంగా మారింది ఇది కాదా అధికారుల నిర్లక్ష్యం అంటూ ప్రజలు వాపోతున్నారు. ఒక మిల్లు యజమాని ప్రశ్నించగా ఒక వ్యక్తిని నాకు బిజెపి నాయకులు నా ఫ్రెండ్స్ సర్కిల్ అని ఒకసారి మీడియా బాగా తెలుసు అని ఒకసారి పక్క దావ పట్టిస్తున్నాడు ఇదిగో అతని కారం మిల్లులో జరిగిన కల్తీకారంలోడు. కారం మిల్లు లైసెన్స్ లేకుండా కొందరు అక్రముగా కల్తీకారం నియంత్రణ కేంద్రాలుగా ఏర్పరచుకున్నారు, మరికొందరు కారం మిల్లులను లీజుగా (అద్దె ) గా తీసుకొని కల్తీ కారం చేస్తున్నారు. సెనగ నూనె పామ్ ఆయిల్ వంటి వాటిని కలర్ షైనింగ్ కోసం అలాగే కెమికల్స్ రంగు పొడి రంప పొట్టు మ్రపొట్టు మిక్సింగ్ చేసి ఈ కల్తీ కాలానికి అడ్డాగా కొంతమంది ఏజెంట్లు అదే పనిగా అధికారులకు లంచం ఇస్తూ చేస్తున్నట్టు సమాచారం ఇది మిల్లు యజమానులే స్వయంగా చెప్పారు గట్టిగా అడగక గుంటూరు యార్డ్ పరిసర ప్రాంతాల్లో 150 నుంచి 200 పైగా ఉన్న ప్రతి కారం మిల్లు ఇదే తంతు జరిగింది అని బదిలిస్తున్నారు. కారం మిల్లు గేట్లకి తాళాలు వేసి కల్తీకారాన్ని ప్యాకింగ్ మరియు లోడింగ్ చేస్తున్నారు. కొంతమంది ఏజెంట్లు చిన్నపిల్లలు తినే తినుబండార కంపెనీలకి ఈ కల్తీకారం సప్లై చేస్తున్నట్లు ఊహాగానాలు వెళ్లి వస్తున్నాయి, కొంతమంది గవర్నమెంట్ ఆఫీసర్లు కి కూడా ఈ కారం మిల్లులు పైన కన్ను పడి వారు కూడా మిల్లులు లీజుకు తీసుకోవడం మిల్లు లైసెన్సులు అప్లై చేసుకుని మిల్లు కట్టించుకొని ఈ తప్పుదారికి వస్తున్నారు ఇందులో కొంతమంది వైద్యరంగ సంబంధించిన వారు కూడా ఉన్నారని సమాచారం దీనిని అధికారి యంత్రాంగం మరియు ఎన్ డి ఏ గవర్నమెంట్ గుర్తించాలని



ప్రజలు మార్పు రావాలని కోరుకుంటున్నారు. తీసివేసిన తొడియాలలో కారం మిల్లు వారు లేబర్ చేత తన గూడాలకు తెప్పించి నైట్ వర్క్ రాత్రి సమయంలో తొడియాలతో కారం తయారు చేసి వాటిలో రంగు ఇతర కెమికల్స్ కలిపి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు . ఈ కారం తిన్నవారికి క్యాన్సర్, పేగు పూత మరికొన్ని రోగాలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని కొంతమంది వైద్య నిపుణులు చెబుతున్నారు. విజిలెన్స్ అధికారులు ఫుడ్ సేఫ్టీ అధికార విభాగం పెడచెవిన పెడుతున్నట్టు ప్రజలు వాపోతున్నారు.

## పేకాట స్థావరాలపై దాడి

గుంటూరు క్రైమ్, డిసెంబరు 4,ప్రభాతవార్త: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారి స్థావర్నాపై పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు.9 సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం 54 వేల140 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ



వివరాలు వెల్లడించారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలకలూరు రోడ్, రత్నగిరి కాలనీలో ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. బుధవారం టాస్క్ ఫోర్స్ సిబ్బంది శ్రీ ది। కి తెలియపరిచి టాస్క్ఫోర్స్ ది। ఆదేశాల మేరకు నల్లపాడు శ్రీ సిబ్బంది, నల్లపాడు శ్రీ। సుభానీ పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా టాస్క్ ఫోర్స్ బృందం నిరంతరం దాడులు నిర్వహిస్తూ ఉంటుందని ఎస్పీ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.

## ఎస్పీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



గుంటూరు క్రైమ్, డిసెంబరు 4,ప్రభాతవార్త: అమరవీరుల వేడుకల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు ఈ పోటీల్లో పోలీస్ సిబ్బంది వారి పిల్లలు పాల్గొన్నారు. గెలుపొం దిన 18 మందికి ఎస్పీ బహుమతులు అందజేశారు.

## వివిఐటియులో శంబాల...చిత్ర బృందం సందడి



గుంటూరు విద్య డిసెంబర్ 4 ప్రభాతవార్త: యువ నటుడు ఆది సాయికుమార్, అర్చన అయ్యర్, స్వశిక ప్రధాన పాత్రలలో యుగంధర్ ముని దర్శకత్వం లో రూపొం దించబడిన థ్రిల్లర్ " శంబాల ". ఈ చిత్రం డిసెంబర్ 25వ తారీఖున విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమం లో భాగంగా వివిధ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో వివిఐటియు రిజిస్ట్రార్ డా++ వై మల్లికార్జున రెడ్డి, హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యర్, దర్శకుడు యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ ఈ చిత్రం ఆద్యాంతం వినూత్నంగా ఉంటుందని అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. మంచి కథ కోసం చాలా సంవత్సరాలు ఎదురు చూశానని ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

## దేశం కోసం... హిందూ ధర్మం కోసం జొన్నాదుల బాలాజీ కఠోర దీక్ష



గుంటూరు విద్య, డిసెంబర్ 4 ప్రభాతవార్త: సనాతన ధర్మ పరిరక్షణ కోసం... ధర్మ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలనే మహోత్తర ఆశయంతో మంగళగిరి కి చెందిన జొన్నాదుల బాలాజీ కఠోర దీక్షకు నడుం కట్టారు. పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో హిందూ ధర్మం కోసం, దేశం కోసం ఉపవాస దీక్షను చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి వాస్తవ్యులైన జొన్నాధుల బాలాజీ నాల్గొసారి చేపట్టిన ఉపవాస దీక్ష గురువారం గుంటూరు ఆర్. అగ్రహారంలోని శ్రీ లక్ష్మి ర్మ నరసింహస్వామి ఆలయం లో గురువులు శ్రీమాన్ పరాశరం కేశవాచార్యులు ఆధ్వర్యంలో స్వీకరించారు. ఈ దీక్ష 41రోజుల పాటు కొనసాగనుంది.

**హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయం :** ఎటువంటి ఘన పదార్థాలు స్వీకరించకుండా, కేవలం కొబ్బరి నీరు, నిమ్మ రసం మాత్రమే సేవిస్తూ 41రోజులు ఉపవాసం చేస్తున్నానని బాలాజీ తెలిపారు. 2024 లో తొలిసారిగా దసరా నవరాత్రుల సందర్భంగా 9 రోజులు, కార్తీక మాసంలో 21 రోజలు, వైశాఖ మాసంలో 27 రోజుల దీక్షను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం 41 రోజుల దీక్షకు శ్రీకారం చుట్టటానికి గల కారణం సనాతన ధర్మాన్ని కాపాడటం కోసమేనని బాలాజీ వ్యాఖ్యనించారు. ధర్మం కోసం దేనికైనా సిద్ధం అనే నినాదంతో ప్రతి ఒక్కరిలో మంచి పెరగాలని, ధర్మ మార్గంలో అందరూ నడవాలని ఆకాంక్షి స్తూ దీక్ష చేస్తున్నానన్నారు.

**పవన్ కళ్యాణే స్ఫూర్తి:** దిగజారిపోతున్న ధర్మాన్ని నిలబెట్టే దిశగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకొని, ఆయన ఆశీస్సులతో ఉపవాస దీక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు జొన్నాదుల బాలాజీ చెబుతున్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రధాని మోడీని ఆదర్శంగా తీసుకుంటున్నానన్నారు. దేశంలో జరుగుతున్న దుష్ఫలితాలు తిప్పి కొడుతూ, పొరుగు దేశాలతో శత్రుత్వం లేకుండా ఉండేందుకు ఈ దీక్ష ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ ఉపవాస దీక్షకు ప్రజల నుండి మద్దతు మరియు ఆశీస్సులు కోరుతున్నట్లు బాలాజీ తెలిపారు.

**దేశం కోసం:** ఉపవాసం చేస్తే, భగవంతునికి దగ్గరగా ఉండగలము అనేది ప్రతి మతంలోనూ ఆచారంగా కొనసాగుతుంది. కానీ అదే ఉపవాసం దేశం కోసం చేస్తే, దేశంలోని ప్రజలందరూ బాగుంటారు అనే సత్సంకల్పంతో ఈ ఉపవాస దీక్షను ప్రారంభించినట్లు బాలాజీ చెబుతున్నారు.

## ఆర్.వి.ఆర్.జె.సి.లో కొలరిడో 2K 25 పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు విద్య , డిసెంబర్ 4 ప్రభాతవార్త : తమ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక మరియు క్రీడా మహోత్సవం కొలరిడో2రీ25" ను ఈ నెల డిసెంబర్ 26 మరియు 27 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే ఈ మహోత్సవ ప్రధాన లక్ష్యమని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఈ సందర్భంగా "కొలరిడో-2రీ25'' పోస్టర్ ను, ఆన్‌లైన్



నమోదు ప్రక్రియకు సంబంధించిన వెబ్‌సైట్‌ను కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, కళాశాల సిబ్బంది, కల్చరల్ కమిటీ సభ్యులు మరియు విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు 5 లక్షల రూపాయల వరకు నగదు బహుమతులు, మెమెంటోలు మరియు సర్టిఫికెట్లు అందజేయబడనున్నట్లు కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు, సాంస్కృతిక కళలకు, క్రీడలకు ఈ మహోత్సవం ఒక అద్భుత వేదికగా నిలుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు కళాశాల ప్రత్యేక వెబ్‌సైట్ https://rvrjcce.ac.in/colorido2K25/ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ రంగరాయ చౌదరి, కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## చంద్రబాబు పంచసూత్రాలు సాగుకు పంచ ప్రాణాలు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: వ్యవసాయ రంగంపై జగన్ విమర్శలు అర్ధసత్యాలు.. అసత్యాలమయం. నోరు విప్పిన ప్రతిసారి అబద్ధాలు, తాను అపూర్వ సహోదరులమని జగన్ నిరూపిస్తున్నారు. మీడియా సమావేశాల్లో కాకుండా అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే.. ఐదేళ్ళలో తాను రైతులకు చేసిన మోసం, ద్రోహం జగన్ కు బోధపడుతుంది. 201924 మధ్యకాలంలో రాష్ట్రంలో సాగు సతికిలపడేలా చేసి. రైతుమెడకు ఉరి వేయడమే వైసీపీ ప్రభుత్వం సాధించిన రైతు సంక్షేమం. రైతాంగాన్ని.. వ్యవసాయాన్ని తానే ఆదుకున్నానన్న జగన్ వ్యాఖ్యలు.... దుక్కిదున్నకుండా... విత్తనం వేయకుండానే పంటలు పండుతాయి అన్నంత విడ్డూరంగా ఉన్నాయి. రైతులు గురించి మాట్లాడిన ప్రతిసారి తన హాయాంలో రాష్ట్రం జాతీయస్థాయిలో



రైతు ఆత్మహత్యల్లో ఎందుకు అగ్రస్థానంలో నిలిచిందన్న దానిపై ఎందుకు మాట్లాడటం లేదో జగనే చెప్పాలి. జగన్ వంచనతో నీరుగారిపోయి.. కష్ట కాలంలో ఉన్న రైతులకు కూటమిప్రభుత్వం అండగా నిలిచింది. అన్నదాతాసుఖీభవ సాయంతో సాగుకు చేయూతనిచ్చింది. 201924 మధ్య 10.22 శాతంగా ఉన్న వ్యవసాయ వృద్ధిరేటును .. చంద్రబాబు తన రైతు సంక్షేమ విధానాలతో 15.40 శాతానికి చేర్చారు. చంద్రబాబు పంచసూత్రాలు.... సాగుకు పంచ ప్రాణాలు. తక్కువ శ్రమ, పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనాలు పొందటమే సరికొత్త సేద్యమనే నిజాన్ని రైతులు గ్రహించాలి, ఆ దిశగా వారి ఆలోచనలు కూడా మారాలి. రైతుల్ని రాజులను చేయాలన్న చంద్రబాబు ఆలోచన నిజం కావాలంటే ప్రతిరైతు పంచసూత్రాలపై అవగాహన పెంచుకొని ఆచరణలో పెట్టాలి. అన్ని రంగాలకు ధీటుగా వ్యవసాయం నిలవాలి అన్న గొప్ప ఆకాంక్షతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదు నూతన విధానాలను రైతులకు పరిచయం చేశారు. వ్యవసాయాధారిత రాష్ట్రం ఆస్తిత్వాన్ని కోల్పోకూడదన్న లక్ష్యంతోనే ప్రభుత్వం సాగుపద్ధతుల మార్పుదిశగా రైతాంగాన్ని సమాయత్తం చేస్తోంది. పండించిన పంటను వినూత్న విధానాలతో మార్కెటింగ్ చేసుకోవడంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. దళారులు, వ్యాపారుల ప్రమేయం లేని వినియోగదారుల అనుసంధానంతోనే రైతుకు నిజమైన మనుగడ. ప్రభుత్వ ఆలోచనలు, ఆర్థిక ఆసరా, సాంకేతికతతో అద్భుతాలు చేయగలమని ఆంధ్రప్రదేశ్ రైతులు నిరూపించాలి. 2047 నాటికి రాష్ట్ర జీడీపీలో వ్యవసాయరంగమే ప్రధాన వాటాదారు కావాలి. ” అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పర్యటన



చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట శారద జిల్లా పరిషత్ హై స్కూల్ లో జరగనున్న మెగా పేరెంట్స్ మేళాలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొంటున్నారు. ఈ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆర్డిఓ మధులత డీఈఓ చంద్రకళ మున్సిపల్ చైర్మన్ షేక్ రసా, జనసేన నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు

## పతి మహిళకు 16 రకాల ఉచిత టెస్టులు: సఖి సురక్ష ప్రారంభం



చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని డ్వాక్రా గ్రూపుల్లోని 35 ఏళ్ల నిండిన మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అండగా నిలిచింది.ఇందులో భాగంగా, ప్రతి మహిళకు 16 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రఫానీ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఖసఖి సురక్షఖి పేరుతో గురువారం చిలకలూరిపేటలో ప్రారంభించారు. పరీక్షలు చేయించుకున్న మహిళలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు మరియు వైద్య రిపోర్టులు వాట్సప్ ద్వారా అందజేస్తామని సిబ్బంది పేర్కొన్నారు.

## మానుకొండవారిపాలెంలో పేకాట దందా: 8 మంది అరెస్ట్

చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట రూరల్ పరిధిలోని మానుకొండవారిపాలెం



గ్రామంలో పేకాట ఆడుతున్న వారి మీదపోలీసులు దాడి చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ తన సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.9,250 నగదు, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం



చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ పసుమర్రుకు చెందిన 8వ తరగతి విద్యార్థి షేక్ మహమ్మద్ ముస్తాక్ పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన కౌషల్ సైన్స్ క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించి స్టేట్ లెవెల్ లో జరిగే కౌశల్ సైన్స్ క్విజ్ పరీక్షకు అర్హతను సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వై హనుమంతరావు గారు తెలియజేశారు. ఈ విద్యార్థికి 3500 రూపాయల క్యాష్ ప్రైజ్,ఒక మెమొంటో మరియు సర్టిఫికేట్ జిల్లా విద్యాశాఖ అధికారి గారి చేతుల మీదుగా అందించబడుతుంది. అలాగే ఈ విద్యార్థి డిసెంబర్ 27వ తారీకున రాష్ట్రస్థాయిలో తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలలో పాల్గొనబోతున్నాడు.

## పేట పట్టణంలో నేడు మెగా పేరెంట్స్ డే

చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: పేట పట్టణంలోని మెగా పేరెంట్స్ డే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతంవిజయవంతం చేద్దాం మండేనని చరణ్ తేచిలకలూరిపేట:జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ శుక్రవారం చిలకలూరిపేట పట్టణంలో పర్యటించనున్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్ మెగా 3.0 కార్యక్రమంలో భాగంగా, స్థానిక శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఖమెగా పేరెంట్స్ డేఖ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు.ఈ సందర్భంగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికేందుకు జనసేన, కూటమి శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి నాయకులతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం మండేనని చరణ్ తేఈ కార్యక్రమం గురించి జనసేన పార్టీ నియోజకవర్గ యువ నాయకులు, మండలనేని చరణ్ తేజ మాట్లాడుతూ“ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ రావడం మాకు చాలా సంతోషకరం. విద్యారంగంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో చెప్పే ఈ ఖమెగా పేరెంట్స్ డేఖ కార్యక్రమాన్ని జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమి నాయకులందరం కలిసికట్టుగా, విజయవంతం చేద్దాం. యువత, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉంది,“ అని ఆయన పేర్కొన్నారు.మండలనేని చరణ్ తేజ నేతృత్వంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు పవన్ కళ్యాణ్ పర్యటన విజయవంతంపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.



## పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా పవన్ రావడం ప్రజల అదృష్టం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్ ను మెరుగుపరిచి, వారి జీవితాల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో పలు విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని, వాటిలో పేరెంట్స్.. టీచర్స్ మెగా మీట్ (పీటీఎం) కార్యక్రమం ఒకటని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన పట్టణంలోని శారదా హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం జరగనున్న పీటీఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల విద్యాప్రగతి.. ప్రవర్తన.. ప్రతిభా పాటవాల గురించి తల్లిదండ్రులు తెలుసుకోవడం.. తమ పిల్లలపై వారు ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా చేయాలన్న సదుద్దేశంతోనే మంత్రి లోకేశ్ పీటీఎం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రత్తిపాటి చెప్పారు.పవన్ రాక ప్రజల అదృష్టం.. చిలకలూరిపేట పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగే పీటీఎం కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక అతిథిగా రానుండటం నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ ను ప్రచారానికి రప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశామని, అప్పటి ఆయన బిజీ షెడ్యూల్ వల్ల అది సాధ్యపడలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో రేపు ఆయన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పీటీఎం కార్యక్రమంలో పాల్గొని, వారితోనే కలిసి భోజనం చేస్తారని ప్రత్తిపాటి చెప్పారు. పీటీఎం కార్యక్రమానికి విద్యార్థులు... తల్లిదండ్రులను మాత్రమే అనుమతిస్తామని, పవన్ కళ్యాణ్ అభిమానులు. జనసేన శ్రేణులు, టీడీపీ, బీజేపీ శ్రేణులకు పవన్ కళ్యాణ్ తర్వాత సమయం కేటాయిస్తారని, దాదాపు రెండుగంటల వరకు ఆయన పట్టణంలోనే ఉంటారని ప్రత్తిపాటి తెలిపారు. పవన్ కళ్యాణ్ అభిమానులు.. కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, సంయమనంతో వ్యవహరించి, విద్యార్థులు..తల్లిదండ్రులతో పవన్ సమావేశానికి ఇబ్బందులు కలిగించకుండా ఉండాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సూచించారు. పీటీఎం కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలించిన ప్రత్తిపాటి వెంట ఈ కార్యక్రమంలో డిఆర్వో మురళి, ఆర్డీవో మధులత, డీఎస్పీ హనుమంతరావు, డీఈవో చంద్రకళ, జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, బిజెపి నేతలు మల్లెల శివనాగేశ్వరరావు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, ఎమ్మార్వో షేక్ మహమ్మద్ హుస్సేన్, వివిధ హోదాలలో ఉన్న అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాలలో నాగసరపు రామారావు 13వ సంస్మరణ

నరసరావుపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : స్థానిక శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాల మాజీ సెక్రటరీ కరస్పాన్డెంట్ నాగసరపు రామారావు 13వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భముగా గురువారం కళాశాల సెక్రటరీ కరస్పాన్డెంట్, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా ఆధ్వర్యంలో ఆడిటోరియంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మాట్లాడారు. నాగసరపు రామారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. తాను ఈ కళాశాల పూర్వ విద్యార్థినే అని తెలిపారు. నాగసరపు రామారావు జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. వారు ఇందిరా ప్రియదర్శినీ అవార్డు గ్రహిత అని, వారి విశిష్ట సేవలను గుర్తించి ఆచార్య నాగార్జున యునివర్సిటీ వారు ప్రతిభ పురస్కారమును అందజేసిందని గుర్తు చేశారు. తన తండ్రి కళాశాలను 55 సంవత్సరాల పాటు సెక్రటరీ కరస్పాన్డెంట్ గా బాధ్యతలు నిర్వహించి, అనేక సేవకార్యక్రమాలు నిర్వహించారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు వివరించారు. కార్యక్రమంలో రామారావు మనుమలు రూపేష్ గుప్తా, రాందేవ్ గుప్తా, కళాశాల కమిటీ సభ్యులు బొలిశెట్టి రామమోహన రావు, కూనిశెట్టి లక్ష్మయ్య, వక్కలగడ్డ కోటేశ్వర రావు, బత్తుల వెంకట మురళీధర రావు, తాడేపల్లి వెంకట భావన్నారాయణ, ఊటుకూరి రంజిత్ కుమార్, పెనుగొండ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ డా. పి. శ్రీనివాస సాయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## మాజీ సీఎం రోశయ్య ఆదర్శ నాయకుడు:: డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త : దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయాలలో ఆదర్శ నాయకుడిని వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రోశయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక శివుని బొమ్మ సెంటర్లోని వారి కాంస్య విగ్రహానికి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆర్యవైశ్య నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కొనిజేటి రోశయ్య అందించిన సేవలు ఎంతో అమూల్యమైనవని పేర్కొన్నారు. 17సార్లు రాష్ట్రబడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా ఘనతను సొంతం చేసుకున్నారని అన్నారు. రోశయ్య వంటి మహనీయులు చూపిన మార్గంలో ముందుకు వెళతామని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు వైసీపీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నిడమానూరి సురేంద్ర, పల్నాడు జిల్లా వైసీపీ నాయకులు అన్నా చంద్రమోహన్, కొత్తూరి కిషోర్ బాబు, కొత్త మాసు మల్లారావు, దివ్వెల రామకృష్ణ,మిట్టపల్లి శేఖర్, బత్తుల విష్ణువర్ధన్ రావు, పాదర్తి మల్లికార్జునరావు, పట్టణ ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి: ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 4 ప్రభాతవార్త ::హైకోర్ట్ ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి ఆధ్వర్యంలో గురువారం నరసరావుపేట జిల్లా కోర్ట్ లో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి మాట్లాడుతూ ఈనెల 13 జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు మరియు అనేక ఇతర వివాదాలు పరిష్కరించబడనున్నట్లు పేర్కొన్నారు. వివాదాలు వేగవంతంగా, పరిష్కారం కావడానికి లోక్ అదాలత్ గొప్ప అవకాశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకొని తమ పెండింగ్ కేసులను పరిష్కరించుకునేలా అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జడ్జిలు ఆర్. ఆశీర్వాదం పాల్, ఏ. సలోమి, ఎం. గాయత్రి, పోలీసులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పర్యటన

నరసరావుపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త :: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు గురువారం నియోజకవర్గంలో పర్యటించారు.ప్రకాష్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద దీర్ఘకాలంగా కుంటలలో నిలిచిపోయిన నీరు, దోమల కేంద్రంగా మారింది. దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో అటుగా వెళుతున్న పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మురుగుతో ఉన్న నీటి నిల్వలను చూసిన ఎమ్మెల్యే అరవింద బాబు, వెంటనే మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులకు ఫోన్ చేసి తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశించారు. మురికి నీరు పూర్తిగా నిలిచిపోవటంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు.....వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే..నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో బాలవికాస్ సంస్థ ఏర్పాటు చేసిన అత్యాధునిక వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు.ఈ ప్లాంట్ ద్వారా లింగంగుంట్ల సహా పరిసర గ్రామాల ప్రజలకు కలుషిత రహిత నీరు అందుతుందని తెలిపారు. బాలవికాస్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కొనియాడారు. కార్యక్రమంలో లింగంగుంట్ల గ్రామ పెద్దలు గంగుల పెద్దిరెడ్డి, కూటమి నాయకులు, బాలవికాస్ సంస్థ ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా ఘంటసాల 103వ జయంతి

రొంపిచర్ల డిసెంబర్ 4 ప్రభాతవార్త : ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు 103 వ జయంతి సందర్భంగా గురువారం నరసరావుపేట పట్టణ కళాకారులు, గాయకుల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసరావుపేట కళావేదిక నిర్వాహకులు పొన్నపాటి ఈశ్వర్ రెడ్డి, బీవీ. చంద్రశేఖర రావు, ఒగూరి నాగేశ్వరరావు, స్వర్ణ చిన్న రామిరెడ్డి ఘంటసాల సేవలను గుర్తు చేశారు. అమరేంద్ర, ఎన్జీవో సత్యనారాయణ, విశ్రాంత ఏఎస్ఐ షేక్ సలామ్, టౌన్ హాల్ అధ్యక్షులు జవ్వాజి వెంకట్రావు, గుబ్బ సురేష్, రత్నాకరం రాము, చేగు వెంకటేశ్వరరావు, బత్తుల మురళి, రంగస్థల దర్శకులు ఎస్ఎం. భాష, చంద్రపాల్, ఖలీల్ భాష, ఈదర సాంబశివరావు, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## నేడు పాఠశాలల్లో మెగా పీటిఎం

నూజెండ్ల,డిసెంబర్4,ప్రభాతవార్త: మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో మెగా పీటిఎం 3.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి నలబోలు రవి oద్ర గురువారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు,అధికారులు,విద్యార్థుల తల్లిదండ్రులు,దాతలు,పూర్వ విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. పాఠశాలల అభివృద్ధి,విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు సంజీవిని

### వినుకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ మురళీకృష్ణయాదవ్



నూజెండ్ల,డిసెంబర్4,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు సంజీవినిగా పని చేస్తుందని తెదేపా సీనియర్ నాయకులు, వినుకొండ వ్యవసాయమార్కెట్‌యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని దాట్లవారిపాలెం గ్రామానికి చెందిన మోటకట్ల రమణకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన 30వేల రూపాయల చెక్కును చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆదేశాల మేరకు లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. గత వైకాపా పాలనలో సీఎంఆర్ఎఫ్ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా బీసీ సెల్ నాయకులు యోగేశ్వరరావు,గ్రామ టిడిపి నాయకులు గురువారెడ్డి, మద్దిరెడ్డికేశవరెడ్డి,పెద్ద వెంకటరావు,భవనం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట వద్ద రోడ్డు ప్రమాదం

# నలుగురు అక్కడికక్కడే మృతి



చిలకలూరిపేట, డిసెంబర్ 4. ప్రభాతవార్త: గుంటూరు నుంచి ఒంగోలు వెళుతున్న కారు చిలకలూరిపేట బైపాస్ వద్ద ట్రాలీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఇద్దరికి తీవ్ర గాయాలయి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మరణించిన వారిని భౌతికకాయాలను స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించి నివాళులర్పించారు .రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో మరణించిన వారి వివరాలు తెలుసుకుంటున్నారు .సంఘటన జరిగిన వెంకటనే సంఘటన స్థలానికి రూరల్ సీఐ సుబ్బరాయుడు రూరల్ ఎస్సై అనిల్ కుమార్ నాదెండ్ల ఎస్సై పుల్లారావు వెళ్లి ట్రాలీ నుంచి కారును బయటకు తీశారు. ఇద్దరు అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్నారు. వారిద్దరు చనిపోయిన వారిలో ఉన్నారు.









## జిందాల్‌లో గంజాయిని ధ్వంసం చేసిన పశ్చిమగోదావరి జిల్లా పోలీసులు

యడ్లపాడు, డిసెంబర్ 4, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు రెవిన్యూ కొత్తపాలెం పంచాయితీ పరిధిలో ఉన్న జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులో పశ్చిమగోదావరి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు కాబడిన 21కేసులలో స్వాధీనం చేసుకున్న 594.844కిలోల గంజాయిని గురువారం ధ్వంసం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, ఛైర్మన్ జిల్లా అదనపు ఎస్పీ వి భీమారావు, నరసాపురం డీఎస్పీ జి శ్రీవేద సభ్యులుగా ఉన్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ మరియు మధ్యవర్తుల అధ్వర్యంలో ఈ భారీస్థాయి గంజాయి ధ్వంసం ప్రక్రియ నిర్వహించారు. ధ్వంసం చేయబడిన గంజాయిని ముందుగా బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని రిసెప్షన్ హాలులో మధ్యవర్తుల సమక్షంలో కేసుల వారిగా తూకం వేసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. గట్టి పోలీస్ బందోబస్తుతో జిందాల్‌కు తరలించటం జరిగిందన్నారు. జిందాల్ కంపెనీలోని రెండవ బాయిలర్‌లో వేసి ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంను విజయవంతముగా నిర్వహించటుకు సహకరించిన జిందాల్ యాజమాన్యం ఎంవి చారి, అర్బన్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ గుంటూరు లిమిటెడ్ వారికి సిబ్బందికి, ఈగల్, ఎక్సైజ్, రెవెన్యూ, ఫైర్, వైద్య అంబులెన్స్ పొల్యూషన్ బోర్డు అధికారులకు జిల్లా ఎస్పీ ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, భీమవరం టూ టౌన్ ఇన్స్పెక్టర్ జి కాళీచరణ్, ఈగల్ ఇన్స్పెక్టర్ ఎం రవీంద్ర, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మీ, డిసిఆర్‌బి ఎస్సై విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



## వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,డిసెంబర్4,ప్రభాతవార్త: రైతుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. గురువారం వినుకొండ నియోజకవర్గంలోని రైతులు ఉద్యాన విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. యాత్ర వాహనాలను చీఫ్‌విప్ జీ.వీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ఉద్యాన పంటల ద్వారా రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. వినుకొండ నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. విజ్ఞానయాత్రల ద్వారా ఆయా అంశాలపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని చెప్పారు. డిమాండ్ ఆధారిత పంటల వైపు రైతులు మారాలని కోరారు. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాసరావు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



వినుకొండ,డిసెంబర్4,ప్రభాతవార్త: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎస్టీ కమీషనర్ సభ్యులు పివిపి వెంకటప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్ ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు,విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: చీఫ్‌విప్ జీ.వీ



వినుకొండ,డిసెంబర్4,ప్రభాతవార్త: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తపేట నందు చీఫ్‌విప్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీ.వీ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని జీ.వీ పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో రోశయ్యది చెరగని ముద్ర

వినుకొండ,డిసెంబర్4,ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలో నర్సరావుపేట రోడ్డు నందు గల రోశయ్య కాంస్య విగ్రహానికి ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ రోశయ్య సీఎంగా,ఆర్థికమంత్రిగా గవర్నర్‌గా దేశానికి,రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఎటువంటి వివాదాస్పదం కాని వ్యక్తిగా రోశయ్యకు మంచి పేరు ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడివాడ చిన్న గురునాధం,సంఘం సీనియర్ నాయకులు రెడ్డి వెంకటరత్నం,మోటమర్రి నరసింహారావు,,పువ్వాడ కృష్ణ,మేడం రమేష్,చిలంకూరి కోటేశ్వరరావు,ఎన్.శ్రీనివాసరావు,పెమ్మసాని నాగేశ్వరరావు, పి.దాసయ్య,రమేష్,అప్పలరాజా తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వంపై జగన్ క్షుద్ర రాజకీయాలు: జీ.వీ



ఈపూరు,డిసెంబర్4,ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్ తప్పుడు ఆరోపణలు,క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు మండిపడ్డారు. గురువారం మండలంలోని అంగలూరు గ్రామంలో జరిగిన విలేరుల సమావేశంలో జీ.వీ మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రజాసంక్షేమం-అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద చల్లడమే జగన్ పనిగా పెట్టుకున్నారన్నారు. వైకాపా పాలనలో ఏపీ అన్ని రంగాల్లో నష్టపోయిందని మరి ముఖ్యంగా రైతు,కౌలు రైతు ఆత్మహత్యల్లో ప్రథమ స్థానంలో ఉందని దీనికి జగన్ సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. నాటి జగన్ నిర్ణయాల వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారన్నారు. పంట నష్టం జరిగితే కనీసం పరిహారం కూడా చెల్లించలేదని విమర్శించారు. ప్రజల పక్షాన నిరంతరం పని చేస్తున్న ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్న జగన్ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

## ఘనంగా జనసేన నేత జొన్న రాజేష్ పుట్టినరోజు

మంగళగిరి, డిసెంబర్ 4, ప్రభాతవార్త : జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్ పుట్టిన రోజు వేడుకలను గురువారం కాపు సంఘ రాష్ట్ర నాయకులు తోట సాంబశివరావు ఆధ్వర్యంలో గౌతమ బుద్ధ రోడ్డు లో బంగ్లా వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా



కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ టిడిపి నాయకులు రంగిశెట్టి నరేంద్ర (బాబి) హాజరై రాజేష్ చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జొన్న రాజేష్ జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, మరో వైపు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. రాజేష్ మరిన్ని పుట్టిన రోజులు జరుపు కోవాలని, ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు అనుగ్రహించాలని ఆకాంక్షి స్తూ, జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు మిరియాల సత్యనారాయణ, నిమ్మల నాగేశ్వరరావు, కోన మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లి పట్టణంలో కోటి సంతకాల సేకరణ పూర్తి

తాడేపల్లి,డిసెంబర్ 04,ప్రభాతవార్త : వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పిలుపుమేరకు మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ అధ్యక్షులు,పొన్నూరు నియోజకవర్గం పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసిన సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు



వేణుగోపాలసోమిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా దొంతిరెడ్డి వేమారెడ్డి హాజరయ్యారు.వేదికపై తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు జీలగ పెదగాలయ్య,వేల్పుల ఏలీషా,ప్రధాన కార్యదర్శులు షేక్ సర్దార్,చిట్టిమల్ల స్నేహ సంధ్య,స్థానిక నాయకులు,గుంటూరు జిల్లా యాక్టివ్ కార్యదర్శి సింక గంగాధర్,పట్టణ మహిళా విభాగ అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ పాల్గొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ,పట్టణ వివిధ విభాగాల నాయకులు మరియు వైసీపీ కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ,విద్యార్థుల మానసిక,శారీరక మార్పులపై చర్చ

తాడేపల్లి,డిసెంబర్ 04,ప్రభాతవార్త : గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా మండల పరిధిలోని ఉండవల్లి గ్రామంలో ఉన్న గాదె రామయ్య సీతారావమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బాలల సంరక్షణ,విద్యార్థుల మానసిక,శారీరక మార్పులు మంచి నడవడిక టీచర్స్ యొక్క ముఖ్యపాత్ర గురించి స్కూల్ టీచర్స్ మరియు సచివాలయ సిబ్బందితో చర్చా కార్యక్రమం




ఏర్పాటు చేశారు. చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ బాలలు చాలా అడ్వాన్స్ గా ఉంటున్నారని టెక్నాలజీ పెరుగుతున్న కొలది త్వరగా మోసపోతున్నర వారిలో ముఖ్యంగా బాలలు మరిముఖ్యంగా ఆడపిల్లలు ఆ జాబితాలో ఉంటున్నారని,పిల్లలు ఇంట్లో కంటే ఎక్కువగా స్కూల్లోనే ఉంటారు కాబట్టి వారిని స్నేహపూర్వకంగా మసలుకొని మంచి చెడు గురించి తెలియజేయాలని టీచర్స్ తో జరిగిన సమావేశంలో తెలిపారు.ఉండవల్లి పంచాయితీ కార్యదర్శి ఏ.రామకృష్ణ మాట్లాడుతూ బాలల హక్కులు అంటే కేవలం జీవించే హక్కు,రక్షణ హక్కు పాల్గొనే హక్కు అభివృద్ధి చెందే హక్కు మాత్రమే కాదు వారి భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ఎలాంటి సమస్య వచ్చినా మేమున్నాం అనే భరోసా కల్పించినట్లయితే రేపటి పౌరులుగా ఎదుగుతారన్నారు.జెడ్పిహెచ్ ప్రధానోపాధ్యాయిని సరోజిని దేవి మాట్లాడుతూ పిల్లల ఆసక్తిని గుర్తించి వారిని ఆదిశగా ప్రోత్సహించాలన్నారు.మహిళా పోలీస్ డి.సౌందర్య మాట్లాడుతూ బాలలపై హింస అనేది ఎక్కడ జరుగుతుంది,ఎలా జరుగుతుంది అంటే ముఖ్యంగా ఇంట్లో,స్కూల్లో కొన్ని పర్యాటక ప్రాంతాల్లో పనిచేసే ప్రదేశాల్లో ఇది ఎక్కువగా జరుగుతుందని,ఇలాంటివి తెలిసిన వెంటనే 1098టోల్ఫ్రీ నెంబర్కు తెలిపి వారిని రక్షించాలన్నారు.కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ స్టాఫ్ అత్తోట పోతురాజు,కె.అనూష, పి.అనిల్కుమార్,జె.ఇశ్రాయేల్,చిరంజీవి,పీఈటి, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శంకర విద్యాలయ 109 వార్షికోత్సవం

బాపట్ల,డిసెంబర్ 4,ప్రభాతవార్త: వేద, స్మార్థ, గురుకుల సంప్రదాయాలను ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తూ బాపట్లలో ధార్మిక, ఆధ్యాత్మిక విద్యకు కేంద్రబిందువుగా నిలిచిన శ్రీ శంకర విద్యాలయం ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు మరియు శంకర్ విద్యాలయ 109వ వార్షికోత్సవం ఉత్సవాలు వైభవోపేతమైన కార్యక్రమాలు గురువారం జరిగాయి. శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి లక్ష బిల్వార్చన శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాలయ కమిటీ సభ్యులు, గురువులు,



విద్యార్థులు మంత్రోచ్చారణలతో పాల్గొని కార్యక్రమాన్ని వైభవోపేతంగా చేపట్టారు. సాయంత్రం ప్రముఖ కళాకారిణి అచ్యుతాని నవ్య లక్ష్మీ శిరీష భక్తి సంగీత కార్యక్రమం ఆధ్యాత్మికానందాన్ని పంచింది. భజనలు, కీర్తనలు మరియు దివ్యగానంతో భక్తి ప్రవచనం చేశారు.

## 'కూటమి' పాలనలో గ్రామాలకు మహర్దశ


చెరుకుపల్లి ,డిసెంబర్ 4, (ప్రభాతవార్త) : గ్రామాలను సైతం పట్టణాల స్థాయిలో అభివృద్ధి చేసే విధంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎం ఆర్ కె మూర్తి అన్నారు. గురువారం చెరుకుపల్లి గ్రామ శివారు చెన్నకేశవ నగర్ లో విద్యుత్ వీధిలైట్ల ఆధునీకరణను ఆయన ప్రారంభించారు. కాలనీలో 8 అంతర్గత రహదారులు ఏర్పాటు చేసిన వీధిలైట్లను ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నామని



పనులు కూడా ఇందుకు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సహకారంతో రానున్న కాలంలో కాలనీలో మరింత ఉన్నత స్థాయిలో విద్యుత్ సరఫరా ఆధునీకరణకు ప్రతిపాదనలను ఆమోద స్థాయిలో ఉన్నాయని ప్రతిపాదనలు ఆమోదం అనంతరం ఆధునీకరణ కూడా చేపట్టనున్నట్లు ఎం ఆర్ కె తెలిపారు. కాలనీకి గత సంవత్సరం 20 లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్లు నిర్మాణం కొనసాగేవరకు పూర్తి చేసామని మిగిలిన రోడ్ల నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా సంపత్ ,ఎలక్ట్రీషియన్ నాంచారయ్య,కాలనీవాసులు ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, గద్దె నాగేశ్వరరావు, వంగర హరికృష్ణ, గట్టు చంద్రశేఖర్ ,నాగరాజు, అశోక్, రాఘవులు కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.

## రోశయ్య రాజకీయ ప్రస్థానం ఆదర్శనీయం: తూనుగుంట్ల సాయిబాబా

భట్టిప్రోలు(రేపల్లె), డిసెంబరు 4, ప్రభాతవార్త:నేటి సమాజానికి మాజీ గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయ ప్రస్థానం ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు.గురువారం కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపర రాజకీయ చాణక్యునిగా రోశయ్య ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు.2009,2010 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 15వ సిఎంగా పనిచేసిన రోశయ్య ప్రజాసంక్షేమంపైనే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సత్ఫలితాలు సాధించారని సాయిబాబా గుర్తు చేశారు.1933 సంవత్సరం జూలై 4వ తేదీ గుంటూరు జిల్లాలోని వేమూరులో జన్మించిన కొణిజేటి రోశయ్య గుంటూరు హిందూ కళాశాలలో



కామర్స్ డిగ్రీ విద్యాభ్యాసం పూర్తి చేశారని ఆయన చెప్పారు.1968 సంవత్సరంలో తొలిసారిగా శాసన మండలిలో అడుగుపెట్టిన రోశయ్య రోడ్లు,రవాణాశాఖ మంత్రిగా సిఎం మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో విశేష సేవలు అందించడం ప్రశంసనీయమని సాయిబాబా తెలిపారు.ఏడు పర్యాయాలు ఆర్థిక శాఖ మంత్రిగా బడ్జెట్ను ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకు లభించటం గర్వకారణ మన్నారు.అసెంబ్లీలో ఆర్థిక మంత్రిగా రోశయ్య అవలంభించిన తీరు ప్రతిపక్షాలను సైతం ఆకర్షించింద న్నారు.2011-2016 కాలంలో తమిళనాడు గవర్నర్గా కొణిజేటి రోశయ్య ఆ పదవికి వన్నె తెచ్చారని సాయిబాబా చెప్పారు.కర్నాటక రాష్ట్రానికి గవర్నర్గా అదనపు బాధ్యతలను నాలుగేళ్లపాటు సమర్ధవంతంగా నిర్వహించారని ఆయన పేర్కొన్నారు.2018 సంవత్సరంలో కొణిజేటి రోశయ్య జీవన సాఫల్య పురస్కారం అందుకోవటం విశేషమన్నారు.2021 సంవత్సరం డిసెంబరు 4వ తేదీ రోశయ్య భౌతికంగా దూరం కావటం అందరికీ ఆవేదనను మిగిల్చిందని సాయిబాబా వివరించారు.చరిత్రలో నిలిచిపోయిన మహోన్నత వ్యక్తిగా సాయిబాబా అభివర్ణించారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రజా నిర్ణయంతోనే పట్టణ మాస్టర్ ప్లాన్ చేపట్టాలి

బాపట్ల,డిసెంబర్4,ప్రభాతవార్త: ప్రజా వ్యతిరేకతతో కాకుండా, ప్రజా నిర్ణయంతోనే పక్కన నూతన మాస్టర్ ప్లాన్ చేపట్టాలని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు,మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. నూతన మాస్టర్ ప్లాన్ విధానంపై మరో నెలరోజుల పాటు గడువు పెంచడంతోపాటు ప్రజలకు అవగాహన సదస్సులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్



రెడ్డికి వినతి పత్రంను తన వ్యక్తుల ద్వారా గురువారం అందజేయించారు.ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధి ప్రణాళిక విభాగం ద్వారా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్, నూతన రోడ్ల ఏర్పాటు, రహదారుల విస్తరణ జోన్ల విధానంపై ఆశాస్త్రీయంగా, లోపా భూయిష్టంగా ప్రణాళిక సిద్ధం చేయడం సరైన విధానం కాదన్నారు. భవిష్యత్తులో బాపట్ల ప్రాంత ప్రజలకు నిర్మాణ అనుమతులు పై అసౌకర్యం కలగకుండా ప్రణాళిక బద్ధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారి నూతన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ పరిశీలించిన తర్వాత బాపట్ల ప్రాంతంలో చిన్న,మధ్య తరగతికి చెందిన 2,3,లేదా నాలుగు సెంట్లు ఎన్నో తరాలుగా నివాసం ఉంటూ జీవనం సాగించే వారికి, నూతనంగా నిర్మాణాలు చేపట్టుటకు అనుమతులు లభించే విధంగా లేదన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారులకు వినియోగం కాకుండా పక్కనే నూతన రహదారులు ప్రతిపదన చేయడం అనాలోచిత చర్య అన్నారు. అవసరానికి మించి ప్రస్తుత రహదారుల విస్తరణ ప్రతిపాదనలు చేయడం సహేతుకంగా లేదన్నారు. పట్టణ అభివృద్ధి ప్రణాళిక జోన్ల ఏర్పాటు తాకరారుగా ఉన్నదని సరైన ప్రతిపదిక కనిపించలేదన్నారు. ప్రస్తుతం ప్రకటించిన డ్రాఫ్ట్ ఆమోదం పొందితే ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు., ప్రజలకు మరింత అవగాహన కల్పించి ప్రజల నిర్ణయం మేరకే నూతన డ్రాఫ్ట్ తయారు చేయాలన్నారు. ప్రధానంగా మాస్టర్ ప్లాన్ అభ్యంతర సేకరణ గడువు మరో 30 రోజులు పొడిగించి అన్ని వార్డులలో గ్రామ,వార్డు సచివాలయాలలో అవగాహన కల్పించే విధంగా మున్సిపల్ కమిషనర్,పట్టణ ప్రణాళిక అధికారి వారి నేతృత్వంలో గ్రామసభలు నిర్వహించాలన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాలం ఏర్పాటు

బాపట్ల,డిసెంబర్ 4,ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.బాపట్లలోని శీలం వారి పాలెంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై,



శాస్రోక్తరీతిలో వేద పండితుల మంత్రోత్సవాలతో డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయమును మరియు సమావేశ మందిరమును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,చిత్తూరు జిల్లా నుండి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ మరియు అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారన్నారు. అనంతరం డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత కార్యక్రమాన్ని ఆయన అధికారులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయమును జిల్లా పరిషత్ సాధారణ నిధులు 10 సెక్టోరియల్ నుండి 15.15 లక్షలతో కార్యాలయం, సమావేశ మందిరం, మరుగుదొడ్లను నవీకరించినందుకు ఖర్చు చేశామన్నారు. కార్యాలయ ఏర్పాటు ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సంక్షేమ పథకాల అమలుపై నిత్యం పర్యవేక్షణ చేయడానికి ఈ కార్యాలయాలు కీలక కేంద్రాలుగా నిలుస్తాయన్నారు.అభివృద్ధి పనుల పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని, ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పంచాయతీరాజ్ సహాయ సంచాలకులు పి జనార్ధన్ రావు, బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి సిహెచ్ విజయలక్ష్మి, పిడి డ్వామా విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, ఎమ్మార్వో సలీమా, బాపట్ల ఎంపీడీవో బాబురావు మరియు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌లో 15 మెడల్స్ సాధించిన కానిస్టేబుల్ నాగ బ్రహ్మారెడ్డి

బాపట్ల,డిసెంబర్4,ప్రభాతవార్త: పోలీస్ సిబ్బంది క్రీడల్లో కూడా సత్తా చాటాలని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహిస్తామని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. స్విమ్మింగ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటి బ్రాంజ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్ పి. నాగ బ్రహ్మారెడ్డిని గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అభినందించి, మెడల్ తో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిజిఆర్ఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 2013 వ బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ పి.నాగ బ్రహ్మారెడ్డి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో నవంబర్ 21 నుండి 23 వరకు నిర్వహించిన 21వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొన్నారన్నారు. 400 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ ను 6.44 నిమిషాలలో పూర్తి చేసి బ్రాంజ్ మెడల్‌ను సాధించాడన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పి.నాగ బ్రహ్మారెడ్డి స్విమ్మింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటి బ్రాంజ్ మెడల్ గెలుచుకోవడం అభినందనీయమన్నారు. గతంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 15 మెడల్స్ సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశాడన్నారు. ఎంతో పట్టుదల, కృషి, సాధన ఉంటేనే ఇది సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే స్విమ్మింగ్ పోటీల్లో కూడా పాల్గొని సత్తా చాటాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ విధులు ఎంతో ఒత్తిడితో కూడుకున్నవని, పోలీస్ విధుల్లో విశ్రాంతి సమయం ప్రత్యేకంగా ఉండదని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండవలసి ఉంటుందన్నారు. క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని సులభంగా జయించవచ్చని, క్రీడల వల్ల శరీరం దృఢంగా మారడంతోపాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు బ్రహ్మారెడ్డిని ఆదర్శంగా తీసుకొని క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచే పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు

బాపట్ల,డిసెంబర్4,ప్రభాతవార్త: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, ఎరువుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణ ఇతర ప్రాధాన్యత ఆరోగ్య అంశాలు, పాజిటివ్ పబ్లిక్ పెరస్పన్, డాక్యుమెంట్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేస్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో సమావేశం



నిర్వహించారు. బాపట్ల నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరం నుండి విక్షణ సమావేశంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎక్కడా గోనె సంచులు కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి వేగవతంగా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, రైతుల నుండి ఫిర్యాదులు రాకూడదన్నారు. ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధుల నియంత్రణకు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై స్టాండర్డ్ గైడ్లైన్స్ జారీ చేశామని ఆయన తెలిపారు. టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. వాటర్ బోర్న్, వెక్టార్ బోర్న్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. రెగ్యులర్ ఫుడ్ టెస్టులు అన్ని వసతి గృహాలు, ఇతర చోట్ల వంటశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టెస్టులు నిర్వహించాలని ప్రతి శనివారం డ్రై డే నిర్వహించాలన్నారు.పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ భావన విశిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ఇన్చార్జి జిల్లా వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ అనంతరాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి జమీర్ భాష,డి. ఏం సివిల్ సప్లై శ్రీలక్ష్మి, డిఎం మార్క్ ఫ్రెడ్ కరుణ శ్రీ, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి

భట్టి ప్రోలు(రేపల్లె), డిసెంబరు 4, ప్రభాతవార్త:గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు సన్నివేశాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత మాత్రమే భావ ప్రకటనతో పాడిన ఆణిముత్యాలు వంటి ఎన్నెన్నో పాటలు ప్రేక్షకులను రంజింపజేశాయని వివేకానంద విగ్రహ సాధన కమిటీ నిర్వాహకుడు బండారు శ్రీనివాసరావు



చెప్పారు.గురువారం భట్టి ప్రోలు బౌద్ధస్థూపం ఎదుట మినీట్యాంక్ బండపై గల ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి వంగర చలమయ్య సిద్ధాంతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఘంటసాల 103వ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఘనంగా నివాళుల ర్పించారు.విదేశాలకు వెళ్ళొచ్చిన జి.బోసు, బి.శ్రీనివాసరావు,మరి కొందరిని దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఘంటసాల అభిమానులు పాటలను ఆలపించారు.ఈ కార్యక్రమంలో మద్దా లీలా మోహనరావు,బి.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, సిహెచ్.రామకోటేశ్వరరావు,జొన్నాదుల రామాంజనేయులు,కె.పార్థసారధి,తిరువీధుల బుల్లబ్బాయి, వి.నాగేశ్వరరావు,నాగరాజు,పి.శివరామ ప్రసాద్,ఆర్.సత్యనారాయణ మూర్తి,వేల్పూరు శ్రీనివాసరావు, బి.రాంప్రసాద్, కె.చిందబరరావు, ఎ.హనుమంతరావు,చెన్నా వెంకట ఉమామహేశ్వరరావు,చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 216 కోస్తా జాతీయ రహదారి విస్తరణకు చర్యలు: బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్

రేపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:జాతీయ రహదారి 216 విస్తరణపై డిపిఆర్ కోసం కన్సల్టెంట్ నియామకానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా,రహదారుల శాఖ మంత్రి నితిన్



గడ్కరీని కోరినట్లు బాపట్ల పార్లమెంట్ సభ్యుడు,లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదలచేశారు.జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక రూపొందించడానికి కన్సల్టెంట్‌ను నియమించాలని గడ్కరీకి సూచించినట్లు ఆయన తెలియజేశారు.బాపట్ల పార్లమెంటు పరిధిలోని 216 జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతమైతే రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఆయన చెప్పారు. అదే విధంగా ఆర్థికాభివృద్ధితో పాటు తీరప్రాంత పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని కేంద్ర మంత్రి గడ్కరీకి వివరించగా సానుకూల స్పందన లభించిందని పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్ వివరించారు.

## అంబేద్కర్ వర్ధంతిని జయప్రదం చేయాలి

రేపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:రేపల్లె పట్టణంలో ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కమిటీ నిర్వాహకులు తెలిపారు.గురువారం రేపల్లె అంబేద్కర్ భవన్‌లో ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్,దళిత,ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ వర్గాల ప్రతినిధులు అంబేద్కర్ వర్ధంతి పోస్టర్లను విడుదల చేశారు.అంబేద్కర్ విగ్రహం ఎదుట బౌద్ధపూజ



జరుగుతుందని ప్రజలు తరలిరావాలని వారు కోరారు.ప్రత్యేక ఆహ్వానితులుగా శాస్త్రవేత్తలు డాక్టర్ వీర్రాజు,డాక్టర్ మల్లేపల్లి రఘు హాజరవుతారని చెప్పారు.పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో దోవా రమేష్ రాంజీ, డి.సాంబశివరావు, సిహెచ్.మణిలాల్, ఎ.బిక్షాలు, పి.హనోక్, ఆర్.కోదండరామ్,కిషోర్,కె.రాజీవ్,ఎన్.సురేష్,నాగదేవత,భాస్కర్,మొహిద్దీన్,జె.బుజ్జి,కె.సుధీర్,ఎన్.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంస్కరణలతో ప్రజాసంక్షేమం: అనగాని శివప్రసాద్

రేపల్లె, డిసెంబరు 4, ప్రభాతవార్త:పరిపాలనా సౌలభ్యం కోసం డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు,రేపల్లె నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు.గురువారం రేపల్లె పట్టణంలో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే పంచాయతీరాజ్ వ్యవస్థలకు అవసరమైన అధికారాలతో పాటు బాధ్యతలను అప్పగించేలా కూటమి ప్రభుత్వం కీలకమైన చర్యలు తీసుకోవడం ప్రశంసనీయమన్నారు.



డిడిఓ నియంత్రణలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ విభాగాలు ఉంటాయని, డివిజన్ స్థాయిలో సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ సులభతరం కాగలదని అనగాని శివప్రసాద్ చెప్పారు.ఏక కాలంలో 77 డిడిఓ కార్యాలయాలు రాష్ట్రంలో ప్రారంభించటం నూతన సంస్కరణలలో సరికొత్తదనమని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.క్షేత్ర స్థాయిలో సంక్షేమ కార్యకలాపాలు వేగవంతమవడానికి డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు పనిచేస్తాయని ఆయన తెలిపారు.వర్చువల్ పద్ధతితో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిడిఓ కార్యాలయాలను ప్రారంభించటం అభినందనీయమన్నారు.తప్పనిసరిగా పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం కాగలదని అనగాని శివప్రసాద్ చెప్పారు.నూతన మార్పులతో 57,58 ఉత్తర్వులు జారీకావటం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.ఇటువంటి విధానాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని అన్ని విభాగాల డివిజన్ అధికారులు డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం నుంచే సేవలు అందించే పరిస్థితి అందుబాటులోకి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.ప్రజలకు,అధికారులకు మధ్య సత్సంబంధాలు ఏర్పడి పాలనా పరంగా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు వీలేర్పడుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి,డిడిఓ పద్మ,రేపల్లె డివిజన్‌లోని ఎంపిడిఓలు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంచి పరిపాలన దక్షుడు రోశయ్య

వేమూరు డిసెంబర్ 4 (ప్రభాతవార్త) : దివంగత మాజీ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య నాలుగో వర్ధంతిని ఆయన స్వగ్రామమైన వేమూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్‌లో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బొలిశెట్టి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ డాక్టర్ కొణిజేటి రోశయ్య పరిపాలన దక్షుడుగా పేరు పొందటమే కాకుండా





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అదే రీతిలో వేమూరు గ్రామ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరన్నారు. కొందరు ఆయన కీర్తిని గుర్తించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు నంబూరు గాంధీ మాటాడుతూ డాక్టర్ కొణిజేటి రోశయ్య ఆర్థిక శాఖ మంత్రిగా మంచి పేరు ప్రఖ్యాతలు పొందారని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం వెంకటసుబ్బయ్య, తాళ్ళూరు శ్రీనివాస్, కొమ్మూరి రమణ, నేరెళ్ళ వెంకట సుబ్బారావు, అత్తోట శ్రీనివాస్, నారాయణ, గోనుగుంట్ల మురళి, కొమ్మూరి గోపి, కొలిపాకుల శివశంకర్, నంబూరు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భట్టిప్రోలు బ్రాంచ్ -02697, భట్టిప్రోలు, బాపట్ల జిల్లా - 522256.

చరాస్తుల తొలగింపు కొరకు ప్రకటన (రిమైండర్-1)

గౌరవనీయమైన ఒంగోలులోని గౌరవనీయ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు యొక్క ఉత్తర్వు Crl. M.P. No:306/2025 ప్రకారం శ్రీమతి శొంటి కళ్యాణి, భర్త : వెంకటేశ్వరరావు, డి.నెం.5-67, గుత్తావారి పాలెం గ్రామం, పెదపులివర్రు, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా - 522257. శ్రీ శొంటి వెంకటేశ్వరరావు, తండ్రి: బాల కోటేశ్వరరావు (లేటు), డి.నెం.5-67, గుత్తావారి పాలెం గ్రామం, పెదపులివర్రు, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా - 522257. వారికి చెందిన షెడ్యూల్ ఆస్తిని అడ్వకేట్ కమీషనర్ గారు ఆర్డర్ ప్రకారం షెడ్యూల్ ప్రాంగణంలో ఇన్వెంటరీ యొక్క సరైన పంచనామాతో తేది.05.04.2025న భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. ఋణగ్రహీత భౌతికంగా స్వాధీనం చేసుకున్న రోజు నుండి 15 రోజులలోపు అన్నీ చరాస్తులను తీసివేయాలి. షెడ్యూల్ ఆస్తి చాలా కాలం క్రితం ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుందని మీకు తెలుసు మరియు మేము వీలైనంత త్వరగా ఆస్తిని విజయవంతమైన బిడ్డర్‌కు అప్పగించవలసి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు, మీరు వస్తువులను తొలగించలేదు. ఈ విషయంలో, ఈ రోజు నుండి 7 రోజులలోపు వస్తువులను తీసివేయమని మేము మీకు సలహా ఇస్తున్నాము. లేకుంటే ఆ వస్తువులు స్క్రాప్‌గా వేలంలో విక్రయించబడతాయి.

తేది: 04-12-2025
ప్రదేశం: భట్టిప్రోలు

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# ఇళ్ల పట్టాల పేరుతో ప్రజలను మోసం చేసిన వైసీపీ

గుంటూరు వెస్ట్ డిసెంబర్ 4, ప్రభాతవార్త: 20వ డివిజన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అనంతవరపాడు ప్రాంతంలోని ఇళ్ల పట్టాల మోసం విషయంలో తీవ్రమైన అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు పేర్కొన్నారు. మేనకా గాంధీ నగర్, 21వ డివిజన్‌తో పాటు దాదాపు 6000 మంది ప్రజలకు ఎన్నికల



సమయంలో ఓట్లు కోసం గత ప్రభుత్వం తెలియని ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు విమర్శించారు.చాలామంది చేతులకు కూడా రాని రిజిస్ట్రేషన్ పట్టాలు సచివాలయాల్లో పేర్లపై పడేలా ఉంచడంతో, ప్రజలు తమకే ఇళ్ల స్థలాలు వచ్చాయని తెలియని పరిస్థితిని గత ప్రభుత్వం సృష్టించిందని ఆమె తెలిపారు.అనంతవరపాడు ప్రాంతం ముళ్లపొదలతో నిండిన అడవి ప్రాంతంలా ఉండగా, ఆ ప్రదేశాన్నే ప్రజలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిన అన్యాయాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈస్ట్–వెస్ట్ నియోజకవర్గాల్లో కలిపి 20 వేల మందికి పైగా ఇదే సమస్య ఎదురైందని చెప్పారు.ప్రస్తుతం హౌసింగ్ శాఖ మంత్రి, అధికారులు రెండు సార్లు ప్రాంతాన్ని సందర్శించి సమీక్ష నిర్వహించారని, ఎవరికెవరికీ నిజంగా రావాలో, ఎవరికీ తెలియకుండానే ఇచ్చారో అన్నది పునఃపరిశీలిస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు తెలిపారు. తెలియకుండానే పట్టాలు పొందినవారి రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, అర్హులైన వారికి మళ్లీ 100 గజాల స్థలాలు కేటాయించే విధానంపై ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.ప్రజలు తమ వివరాలను స్థానిక డివిజన్ అధ్యక్షుల వద్ద నమోదు చేయించుకుంటే, వారి సమస్యలను ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే గారు భరోసా ఇచ్చారు.

## గుంటూరు ఉద్యోగ నగర్‌లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్ డిసెంబర్ 4, ప్రభాతవార్త: గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజన్ ఉద్యోగ నగర్‌లో ఇవాళ గురువారం రెగ్యులర్ ఫీల్డ్ విజిట్ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు విస్తృతంగా పర్యటించి స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఇటీవల సంజయ్ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ పక్కన ప్రజల నోటీస్‌లో లేకుండా ట్యాంకి శంకుస్థాపన జరగడం వల్ల ఇళ్ల మధ్యలో ఉండటంతో హెవీ వాటర్ లారీల రాకపోకలతో రోడ్ల దెబ్బతినడం, ట్రాఫిక్ సమస్యలు



ఏర్పడటం, స్థానికులకు అసౌకర్యం కలుగుతుందని నివాసితులు తెలిపారు.ఈ నేపథ్యంలో ఎంట్రెన్స్ ఆర్చ్ పక్కనున్న ప్రదేశంలోనే ట్యాంకి ఏర్పాటు చేయాలని ప్రజలు ఏకగ్రీవంగా సూచించారు, ఎందుకంటే అక్కడివరకు ఇప్పటికే వాటర్ మెయిన్ లైన్ ఉండటం, రాకపోకలు సులభంగా జరగటం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.ప్రజల సూచనలను గౌరవిస్తూ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలే కోరుకునే స్థలంలో ట్యాంకి ఏర్పాటు చేసే దిశగా త్వరిత నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు హామీ ఇచ్చారు.అదేవిధంగా స్థానికులు కోరుతున్న గుడి స్థలాన్ని కూడా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు తెలిపారు.

# ప్రజలకు మరింత చేరువయ్యేలా పంచాయతీరాజ్ వ్యవస్థ

గుంటూరు వెస్ట్, డిసెంబరు 4, ప్రభాతవార్త : ప్రజలకు మరింత చేరువయ్యేలా పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకురావడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. "రాష్ట్రంలో 70 శాతం గ్రామాలే ఉన్నాయి. గ్రామీణ ప్రజానీకానికి పాలనా పరంగా సులభంగా, సత్వరంగా సేవలందించాలనేది ప్రధానం. ప్రభుత్వం అందించే సంక్షేమంతో పాటు, అభివృద్ధిని గ్రామీణ ప్రజలకు పారదర్శకంగా అందించడానికి డివిజనల్ డవలప్మెంట్ కార్యాలయాలు వారధిలా పని చేస్తాయ్యని ఉప ముఖ్యమంత్రి అన్నారు.ఒకేసారి రాష్ట్రంలో 77 డీడీఓ కార్యాలయాలను ప్రారంభించడం శుభ సంకేతమని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేలా, నూతన మార్పులతో జీవో నంబరు 57, 58ను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డీడీఓ కార్యాలయాలను వర్చువల్ పద్ధతిలో ఉప ముఖ్యమంత్రి చిత్తూరు నుంచి గురువారం ప్రారంభించారు.గుంటూరు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ టి. క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, రాష్ట్ర



పంచాయతీరాజ్ ఆదనపు కమిషనర్ నాగార్జున హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ టి. క్రిస్టినా మాట్లాడుతూ డి.డి.ఓ కార్యాలయం ఏర్పాటు ముదావహం అన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డి.డి.ఓ కార్యాలయాల్లో ఏర్పాటు వలన పరిపాలన సౌలభ్యం లభిస్తుందన్నారు. పరిపాలన వికేంద్రీకరణ జరుగుతుందని తెలిపారు.

## ఉపాధ్యాయుల సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్

గుంటూరు విద్య,డిసెంబర్ 4, ప్రభాతవార్త : శ్రీ కాసు శాయమ్మ మున్సిపల్ హై స్కూల్ యందు డిఎస్సి 2000 లో నియామకం పొంది 25 సంవత్సరాలు విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరూ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్య క్రమము నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ వారి వారి 25 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో వారి



యొక్క అనుభవాలను అన్ని విషయాలను అనుభవాలను తెలియజేస్తూ విద్యార్థులు కూడా అలా కష్టపడి ఉన్నతస్థాయికి ఎదగాలని స్ఫూర్తిని అందించారు వారి యొక్క 25 సంవత్సరాలు సర్వీసులో ఉన్నటువంటి అనేక అనుభవాలను విద్యార్థులకు తెలియజేసి తద్వారా విద్యార్థులను ప్రేరణ చేయడం జరిగింది.

# భారత పారిశ్రామిక చరిత్రలో మరచిపోలేని విషాదఘటన భోపాల్ దుర్ఘటన

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 4,ప్రభాతవార్త : భారత పారిశ్రామిక చరిత్రలో మరచిపోలేని విషాదఘటన భోపాల్ దుర్ఘటన అని దాన్నుండి గుణపాఠం నేర్చుకోవాలని భవిష్యత్ తరాలు పాలకవర్గాలను క్షమించవని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు ప్రసంగించారు.అవగాహన సంస్థ కార్యాలయంలో "భోపాల్ దుర్ఘటనకు 41ఏళ్ళు" అన్న అంశంపై చర్చ జరిగింది.చర్చలో విద్యావేత్త పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ 1984డిసెంబర్ 3న తేదీన మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరంలో అమెరికాకు చెందిన అతిపెద్ద బహుళజాతి కంపెనీ




యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుండి మిథైల్ ఐసోసైనేట్ అనే 41టన్నుల విషపూరిత రసాయన వాయువు స్టోరేజ్ ట్యాంకు ద్వారా నిద్రిస్తున్న భోపాల్ నగరమంతా వ్యాపించిందన్నారు. అప్పటికప్పుడు 2500మంది మరణించగా,అవి క్రమంగా దాదాపు 22వేల మంది మృతిచెందగా,సుమారు 5.50లక్షల మంది తీవ్ర ప్రభావానికి లోనయ్యారన్నారు.ఈ దారుణ దుర్ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోలేదు.భోపాల్ ప్రజలు నష్టపరిహారం అందలేదన్నారు.జన విజ్ఞానవేదిక నాయకుడు సిహెచ్ చలమారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్,ఎంఎన్‌సీ శక్తివంతమైన కంపెనీలు తమ చేష్టల వల్ల ప్రస్తుత తరంపైనా రేపటి తరాలపై చూపే ప్రభావాల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.చర్చలో సంస్థ సభ్యులు సాయిరామ్,మల్లికార్జునరావు,తదితరులు ప్రసంగించారు.

# సంచార్‌సాథి అప్లికేషన్‌పై...కేంద్రం వెనక్కి తగ్గడం వివేకవంతమైన చర్య

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 4,ప్రభాతవార్త : సంచార్‌సాథి అప్లికేషన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి మంచిపని చేసిందని,కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందుగా ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరి అంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను టెలికం శాఖ ఉపసంహరించుకోవడం వివేకవంతమైన చర్య అని అవగాహన సంస్థ హర్షం ప్రకటించింది.సైబర్ నేరాలను నివారించడం మోసాలను గుర్తించడం పేరుతో ఫోన్‌లో ఉన్నదంతా చదివేందుకు తమపై ఓ కన్నేసి ఉంచేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుందని వినియోగదారులందరూ భావించారని పాలకులు ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల వెనక్కి తగ్గినా ఇది ప్రజా విజయమేనని అవగాహన సంస్థ హర్షం ప్రకటించింది. ప్రజలను సంసిద్ధులను చేయకుండా ఇటువంటి దూకుడు నిర్ణయాలు పనికిరావని అవగాహన సంస్థ హెచ్చరిస్తుంది.

# నేడు ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్: కలెక్టర్

గుంటూరు వెస్ట్, డిసెంబరు 4, ప్రభాతవార్త : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహిండం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. మెగా పి.టి.యంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో



గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణంలో తల్లిదండ్రులతో సమావేశం జరుగుతుందన్నారు. మెగా పి.టి.యం 3.0 ను ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ఇద్దరు పాల్గొనాలని కోరారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలు, ఇతర ప్రజాప్రతినిధులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు అందరూ పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో చేపట్టుతున్న కార్యక్రమాలు ఉపాధ్యాయులు ప్రగతి నివేదన పత్రం ను తల్లిదండ్రులకి ఇచ్చి విద్యార్థి ప్రగతిని వివరిస్తారని, ప్రభుత్వము కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ పుస్తకాలలో నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షల పుస్తకాలను తల్లిదండ్రులకు పరిశీలనా నిమిత్తం ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థుల మార్కులను తల్లిదండ్రులు వారి మొబైల్ లో లీప్ యాప్ ద్వారా ఎలా చూడవచ్చునో తెలియజేస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల ప్రగతి నివేదికను సమావేశంలో తెలియజేస్తారని, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సంసిద్ధతకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 100 రోజులు కార్యక్రమం వివరాలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తారని చెప్పారు. పాఠశాల కమిటీ సభ్యులు, అతిథులు, దాతలు పాఠశాల ప్రగతికి చేపట్టవలసిన కార్యక్రమాలను చర్చిస్తారని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని అందరూ స్వీకరించిన తరువాత కార్యక్రమం ముగుస్తుందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఉదయం 11 గంటల వరకు చర్చిస్తారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ పాల్గొని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి, పాఠశాల పురోగతికి తగిన సలహాలు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవితను తీర్చిదిద్దుటకు ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. జిల్లాలో విజయవంతంగా నిర్వహించే ఆదర్శంగా నిలవాలని అన్నారు. తల్లిదండ్రులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో ఇరవై సూత్రాల కార్యక్రమల అమలు స్వర్ణాంధ్ర వికాసిత్ భారత్ ఛైర్మన్ లంకా దినకర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి పాల్గొన్నారు.

# విద్యా వైద్య స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో గుంటూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలి

గుంటూరు వెస్ట్, డిసెంబర్ 4,ప్రభాతవార్త: విద్యా వైద్య స్వర్ణాంధ్ర లక్ష ్య సాధనలో గుంటూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని ఇరవై సూత్రాల కార్యక్రమల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఇరవై సూత్రాల కార్యక్రమల అమలు ఛైర్మన్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, మోళిక సదుపాయాల కల్పన శాఖలతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల స్ఫూర్తిని పూర్తి స్థాయిలో అర్థంచేసుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ప్రధానమని.. ఈ నేపథ్యంలో స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం



అమలుకావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వైద్య ఆరోగ్యం మరియు విద్యాకు సంబందించిన పథకాలు , అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.పీఎం మాతృవందన యోజన, జననీ సురక్షా యోజన జననీ శిశు సంరక్ష కార్యక్రమం, రాష్ట్రీయ కిషోర్ స్వస్త కార్యక్రమం , రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఎన్టీఆర్ వైద్య సేవ, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ భోజన పథకం, పీఎం తదితర పథకాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షి త తాగునీటిని అందించే జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షి ంచి, పురోగతికి అవసరమైన కార్యాచరణపై సూచనలు చేశారు. బహుళ ప్రయోజనాల పీఎం సూర్యఘర్ పథకం అమల్లోనూ మరింత చొరవ చూపాలన్నారు. సమీక్షా సమావేశం అనంతరం లంకా దినకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో డాక్టర్ కేర్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ లో 65,215 రిజిస్ట్రేషన్లు అయితే అందులో 91శాతం ఆయుష్మాన్ భరత్ హెల్త్ అకౌంట్ క్రింద నమోదు అవ్వగా, నర్సుల ద్వారా 78 శాతం ఇన్స్పెక్షన్ మరియు మెడికల్ ఆఫీసర్ ద్వారా 77 శాతం డయాగ్నసిస్ చేయబడ్డాయి.జిల్లాలో 18,634 ల్యాబ్ టెస్టులు చేస్తే అదే రోజున 18,564 టెస్టులు ఫలితాలు మరియు 46,332 మెడిసిన్ ప్రిస్క్రిప్షన్ ఇస్తే అదే రోజున 45,499 ప్రిస్క్రిప్షన్లకు మందులు జారీ చేయబడ్డాయి.జిల్లాలో 19 నుండి 45 సంవత్సరాల వయస్సు వారికి 2025 26 సంవత్సరానికి అనీమియా పరీక్షలు లక్ష ్యం 11,835 అయితే ఇప్పటివరకు అయిన పరీక్షలు 9,982 అందులో 3,353 అనీమియా కేసులు గుర్తించడం జరిగింది. ఇందులో 2,902 మందికి చాలా తక్కువగా, 450 మందికి ఒక మోస్తరుగా మరియు ఒక్కరికి తీవ్రంగా రక్తహీనత ఉంది, వీరందరికి ఈ సమస్య నుండి బయటపడడానికి ముఖ్యంగా 5 నుండి 19 సంవత్సరాల వారికి మరియు గర్భిణీ స్త్రీలకూ అవసరమైన వైద్యం అందించి మందులు అందిస్తూ " అనీమియా ముక్త్ భారత్ కోసం అధికారులు కృషి చేస్తున్నారు.28,800 గర్భిణి స్త్రీలు మరియు 26,670 శిశువులకు 92 పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రధాన మంత్రి సురక్షి త మాతృత్వ అభియాన్ క్రింద ప్రతి 15 రోజులకు ఒకసారి ముందస్తు కాన్పులను తగ్గించడానికి స్కాన్లు మరియు రక్త పరీక్షలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి నెల 9 మరియు 10 వ తేదీ అన్ని ప్రభుత్వం ఆస్పత్రులలో గైనకాలజిస్ట్ ద్వారా గర్భిణీ స్త్రీలకు అన్ని పరీక్షలు మరియు సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.జిల్లాలో100 శాతం ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని.. గర్భిణి స్త్రీలకు పోషక ఆహారం కోసం జననీ సురక్షా యోజన ద్వారా 700 రూపాయిలు మరియు సుఖీభవ ద్వారా 300 రూపాయిలు కలిపి మొత్తం 1000 రూపాయిలు చెప్పున ఇప్పటివరకు 7,22 ,300 రూపాయిలు లబ్దిదారులకు వినియోగించడం జరిగింది. అదేవిధంగా జననీ శిశు సంరక్ష కార్యక్రమం ద్వారా ఉచిత పౌష్టికాహారం, మందులు, వైద్య పరీక్షలు వంటి సేవలు కోసం ఇప్పటివరకు 95.25 లక్షల రూపాయిలను వినియోగించినట్లు అధికారులు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టిసారిస్తోందని.. ఈ క్రమంలో మాతా శిశు మరణాల రేటును తగ్గించడంపై అధికారులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు.ప్రధాన మంత్రి మాతృ వందన యోజన క్రింద మొదటి కాన్పు సమయంలో 5 వేల రూపాయిలు రెండు వాయిదాలలో మరియు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కాన్పు అయితే మరో వెయ్య రూపాయిలు కలిపి మొత్తం 6 వేలు, రెండవ కాన్పులో ఆడ శిశువుకు జన్మనిస్తే 6 వేలు ప్రోత్సాహకంగా నగదు అందించడం జరుగుతుంది. 2024 25 సంవత్సరంలో మొదటి కాన్పు 7,656 మరియు రెండవ కాన్పు ఆడ శిశువు 2,484 కలిపి మొత్తం 11,495 మంది లబ్దిదారులకు 4.46 కోట్ల రూపాయిలు నగదు బదిలీ చేయడం జరిగింది. 2025 26 సంవత్సరం నుండి ఈ కార్యక్రమ అమలు భాద్యతను ఐ సి డీ ఎస్ వారికి బదిలీ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

జిల్లాలో 18 సంవత్సరాలు వయస్సు పైన వారు 17.95 లక్షల మంది ఉంటే ఓరల్ కాన్సర్ 205 మందికి, రొమ్ము కాన్సర్ 508 మందికి మరియు సెర్వికల్ కాన్సర్ 307 మందికి ఉన్నట్లు స్క్రీనింగ్లో తేలింది.మొత్తం జిల్లాలో 22.42 లక్షల జనాభాలో ప్రస్తుతం 4,339 టీబీ కేసులు ఉండగా, 83 మంది మరణించారు, హెచ్ ఐ వీ పాజిటివ్ ఉన్న టీబీ కేసులలో 8 మంది మరణించారు మరియు ఇతర కారణాలు వల్ల టీబీ కేసులు 92 ఉంటే అందులో 6 మంది మరణించారు.202425 సంవత్సరానికి 85,348 సాధారణ రక్తపరీక్షలు నిర్వహించగా 1,054 మందికి, 33,304 గర్భిణీ మహిళలకు పరీక్షలు చేయగా 25 మందికి హెచ్ ఐ వీ పాజిటివ్ వచ్చింది. 59,228 యూనిట్ల రక్తమును సేకరించగా అందులో 69 అనుమానాస్పద రక్త నమూనాలను టెస్టుకు పంపగా 15 యూనిట్లలో హెచ్ ఐ వీ కనపడింది.జిల్లాలో మొత్తం 9.09 లక్షల అర్హులైన వారికిగాను ఇప్పటివరకు 8.79 లక్షల పీఎంజేఏవై కార్డులు పంపిణీ చేశామని అధికారులు తెలిపారు, మిగిలిన వారికి కూడా సత్వరం పంపిణీ చేయాలని అధికారులను లంకా దినకర్ ఆదేశించారు. అలాగే, 70 సంవత్సరాలు పైబడిన వారు 1.55 లక్షల లబ్ధిదారులు ఉంటే ఇప్పటి వరకు 14.50 వేల మంది మాత్రమే కార్డులు తీసుకున్నారు.

**విద్యా రంగం :** బేటీ బచావో బేటీ పడావో 11 నుండి 14 సంవత్సరాల వయస్సు వారు 1.26 లక్షల మంది మరియు 15 నుండి 18 సంవత్సరాల వయస్సు వారు 1 లక్ష మంది మొత్తం 2.26 లక్షల మంది 9,440 గ్రూపులు ద్వారా చదువు ఆవశ్యకత మరియు మంచి చెడు ప్రవర్తన పైన అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**తల్లికి వందనం : సమగ్ర శిక్ష అభియాన్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర :** ఎలిమెంట్రీ నుండి సెకండరీ విద్యా వరకు విద్యార్థులకు అవసరమైన మోలిక సదుపాయాలు మరియు చదువుకు అవసరమైన నోట్ పుస్తకాలు, వర్క్ బుక్ మరియు టెక్స్ట్ పుస్తకాలు, ఆక్స్ఫర్డ్ మరియు ఇతర డిక్షనరీలు, విద్యార్థులకు బ్యాగ్, యూనిఫామ్ , షూ , బెల్ట్ పంపిణీ తదితర సౌకర్యాలు వివిధ రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సమగ్ర శిక్ష అభియాన్ కు అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి నిర్వహిస్తున్నాం.

**మన బడి మన భవిష్యత్తు పీఎం శ్రీ యోజన:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం లక్ష ్యంగా సురక్షి త త్రాగు నీరు, స్వచ్ఛత కోసం మరుగుదొడ్లు, భవనాల మరియు ఫర్నిచర్ ఆధునీకరణ నాణ్యమైన మోలిక సదుపాయాల కల్పన ద్వారా విద్యార్థుల ఆరోగ్య భద్రత మరియు పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్వహించ బడుతున్నాయి.

**డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పీఎం పోషణ్ :** నాణ్యమైన సన్న బియ్యంతో జిల్లాలో జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రైమరీ 812, అప్పర్ ప్రైమరీ 44, హై స్కూల్ 193 కలిపి 1049 పాఠశాలలో 88019 విద్యార్థులు ఉండగా 73043 హాజరు అవుతుండగా, అందులో 69521 మంది విద్యార్థులకు వారంలో 5 రోజులు కోడి గుడ్డుతో పౌష్టికాహార మధ్యాహ్నం భోజనం కేంద్ర ప్రభుత్వం పథకం పీఎం పోషణ తో అనుసంధానంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం మన జిల్లాలో అమలు అవుతుంది.

# వ్యసనాలకు దూరంగా యువత ఉండాలి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు4, ప్రభాతవార్త: నేటి యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజి డాక్టర్ సి.యం. త్రివిక్రమ్ వర్మ సూచించారు. ఏఎన్‌యులోని ఆర్ట్స్, సైన్స్, వ్యాయామ విద్య, ఫార్మశీ కళాశాలలు సంయుక్తంగా నూతన విద్యార్థులను ఉద్దేశించి ఇండక్షన్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజి




త్రివిక్రమ్ వర్మ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. యువత కిక్ కోసం మాదక ద్రవ్యాలను సరదాగా ఒకసారి వాడి చూద్దాం అని తీసుకుంటే అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ఆంఫిటమైన్, హాష్‌షిష్, కొకైన్, డైజాపెమ్, గంజా హెరాయిన్ వంటి రూపాల్లో మాదకద్రవ్యాలు చలామణిలో ఉన్నట్లు చెప్పారు. వాటిని కలిగిఉండటం, రవాణా చేయడం నాన్ బెయిలబుల్ నేరాల కిందకు వస్తుందన్నారు. ఈ కేసులో యువత చిక్కుకుంటే వారి భవిష్యత్‌నాశనం అవుతుందని అన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉద్యోగాలు కూడా రావన్నారు. వీసి గంగాధరరావు మాట్లాడుతూ ఏఎన్‌యులో ర్యాగింగ్ ఫ్రీ, మాదక ద్రవ్యాల రహిత క్యాంపస్‌గా అభివర్ణించారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ భాషలపై పట్టు సాధించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో యువత అధికంగా ఉన్న దేశాల్లో మన దేశం ముందుందన్నారు. వీరు శక్తిసామర్థ్యాలను వెలికితీస్తే దేశం ప్రపంచంలోనే ఉన్నతంగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య పాల్‌కుమార్, ఆచార్య తేజోమూర్తి, ఓఎస్‌డి ఆచార్య రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఏఎన్‌యు క్రీడా విద్యార్థులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు4, ప్రభాతవార్త: ఈనెల 10నుంచి కాకినాడలోని జెఎన్‌టియు యూనివర్సిటీ నిర్వహిస్తున్న సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఏఎన్‌యు వ్యాయామ విద్య



విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో బి.మనోజ్,పి.శ్రీను, సిహెచ్.కోటి, వి.శంకర్‌లు ఉన్నారు. కాగా ఏఎన్‌యు అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలలో వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటి రన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంలో వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.పి.సత్యపాల్‌కుమార్ అభినందదించారు. ఈ సందర్భంలో పరిశోధకులు కె.ప్రసన్నకుమార్,యం.వినోద్, బి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సినీ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాజు ఘంటసాల

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 4,ప్రభాతవార్త : తన అమరగానంతో తెలుగు సంగీతానికి అనంత మాధుర్యాన్ని అద్దిన మహనీయుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని మూడు దశాబ్ధాల పాటు తెలుగు సినీ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాజుగా వెలుగొందారని అవగాహన మనమూపాడుదాం రండి బృందసభ్యులు నివాళులర్పించారు.స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో అమరగాయకుడు ఘంటసాల జయంతి కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో




అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్ బిళ్ళా అశోక్ మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో సుమారు 1944నుంచి 1977వరకు మూడు దశాబ్ధాల పాటు 13వేలకు పైగా పాటు పాడి సంగీతాభిమానులను ఘంటసాల ఓలలాడించారన్నారు.ప్రముఖ గాయని యార్లగడ్డ లక్ష్మీ మాట్లాడుతూ ఖంగుమని ఉండే ఘంటసాల గళం వినని తెలుగువారే ఉండరన్నారు.కార్యక్రమంలో ఘంటసాల గీతాలను గాయనీ గాయకులు రాజశేఖర్,ఆచారి ,పి.ఎస్.మూర్తి,అప్పారావు,రాజేశ్వరీ తదతరులు ఆలాపించి నివాళులర్పించారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం


కాకుమాను డిసెంబర్ 4(ప్రభాత వార్త: స్థానిక మండల విద్యా వనరుల కేద్రం నందు ఉన్న భవిత కేంద్రంలో ప్రపంచం వికలాంగుల దినోత్స వము నిర్వహించ్చినట్లు మండల విద్యాశాఖాధికారి కె. యఫ్. కెన్నడి గురువారం తెలిపారు.ఈ కార్యాక్రమానికి ముఖ్యఅతిదులుగా కాంప్లెక్స్ హెచ్ యమ్




భాస్కరావు,మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్. యమ్ అంకారావు లు హాజరైనారు.కెన్నడీ మాట్లాడుతూ విబిన్మ ప్రతి బా వంతుల పట్ల సానుభూతి కాకుండా వారిలో మనోదైర్యం నింపి వారు ఎంచుకున్న ్నరగాల్లో రానించే విధంగా తల్లిదండ్రులు సమాజంలో ప్రతి ఒక్కరు వారిని ప్రోత్స హించలన్నారు.అనంతరం చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్డులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పెవడ్లపూడి రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం..

మంగళగిరి, డిసెంబర్ 4, ప్రభాతవార్త్ణ: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో రైతు సేవ కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతుల నుంచి స్వీకరించిన తొలి ధాన్య లోడ్‌ను ఆత్మకూరు శంకర్ మిల్స్‌కు పంపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన అన్నారు.. ఎలాంటి అవరోధాలూ లేకుండా



చేర్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో తూకములు, బస్తాలు, తేమశాతం పరీక్ష పరికరాలు వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె. శైలజ రాణి మాట్లాడుతూ, రైతులు శుద్ధమైన, తక్కువ తేమశాతం ఉన్న ధాన్యం తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, కనపాల ఆనంద్ సాగర్, మొద్దుకూరి రమేష్,జాలాది సందీప్, పత్రా శ్రీనివాసరావు, అందుగుల అబ్రహం, రైతు భరోసా సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

# సాయి మందిరంలో దత్త హోమం..



మంగళగిరి, డిసెంబర్ 4, ప్రభాతవార్త: పెదవడ్లపూడి శ్రీ భగవాన్ సత్య షిరిడి సాయిబాబా మందిరంలో శ్రీ దత్తాత్రేయ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మందిరం ఆధ్వర్యంలో శ్రీ దేవి సమేత దత్తాత్రేయస్వామి వారి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం నిర్వాహకులు పాతూరి శ్రీనివాసరావు, శ్రీమతి రాధిక దంపతులు, శ్రీమతి పాతూరి సుధారాణి హోమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. మందిరం నిర్వాహకురాలు శ్రీమతి సుధారాణి మాట్లాడారు. దక్షి ణామూర్తి ప్రథమ గురువు అంటారని, ఆ తర్వాత దత్తాత్రేయ స్వామి వారే గురువు అన్నారు. దక్షి ణామూర్తి మాదిరిగానే మోనంలోనే భక్తులకు దత్తాత్రేయస్వామి జ్ఞానోపదేశం చేశారన్నారు. సామాన్య గృహస్తులు యోగంలో ఏ విధంగా మోక్షాన్ని చేరుకోవాలో దత్తాత్రేయస్వామి వారిని అనుసరించడం వల్ల తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తబృందం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

5-12Pg5 9 GNT_5-12Pg5.qxd 05/Dec/25 1:08 AM Page 1





ఢిల్లీలో పేరుకుపోయిన పొగమంచు మధ్య చిక్కుకున్న వాహనాలు

# వాయు కాలుష్యంతో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు

## ఢిల్లీలో క్షీణిస్తున్న గాలి నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ!

**న్యూఢిల్లీ, డిసెంబర్ 4:** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకి క్షీణిస్తుంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. వాయుకాలుష్యం అరికట్టేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో వాయు కాలుష్యంపై గురువారం ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో నిరసనలు తెలిపాయి. మాస్కులు ధరించి ప్రధాని ప్రకటనలు చేయడం ఆపి, చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమస్యపై పార్లమెంటులో చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఇందులో సోనియాగాంధీతో పాటు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. అనంతరం సోనియా విలేకరులతో మాట్లాడుతూ వాయు కాలుష్యంతో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ డిమాండ్ చేశారు. ఎలాంటి వాతావరణాన్ని ఆస్వాదించాలి. బయట కాలుష్య పరిస్థితులు చూడండి. సోనియాగాంధీ చెప్పినట్లు పిల్లలు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు. అనేకమంది వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. ఏటా ఈ పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్ప, చర్యలు తీసుకోవడంలేదు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలి. ఇది రాజకీయ సమస్య కాదు. ప్రజలు ఇబ్బందిపడుతున్నారు అని అన్నారు. పార్లమెంట్‌లో శీతాకాల సమావేశాలు జరుగుతున్న తరుణంలో వాయుకాలుష్యంపై చర్చ జరపాలంటూ కాంగ్రెస్ ఎంపిలు కొందరు నోటీసులు జారీ చేశారు. ఇందులో పార్టీ ఎంపి మాణికం ఠాగూర్ మాట్లాడుతూ వాయు కాలుష్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా సలహాలు ఇస్తోందని మండిపడ్డారు. కాలుష్యం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు గుప్పించారు.

# యాసిడ్ దాడి కేసు విచారణ 16యేళ్లు!

## దేశానికే సిగ్గుచేటు.. పెండింగ్ కేసుల వివరాలివ్వండి హైకోర్టులకు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** యాసిడ్ దాడి కేసు విచారణ 16ఏళ్లుగా కొనసాగుతుండటంపై సుప్రీంకోర్టు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఇది న్యాయ వ్యవస్థను అపహాస్యం చేయడమేనని పేర్కొంది. యాసిడ్ దాడి కేసులలో జాప్యం తగదు అని వ్యాఖ్యానించింది. దేశంలోని అన్ని హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసుల విచారణలపై నాలుగు వారాల్లోగా సమాచారం అందించాలని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీలో రోహిణి కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఓ యాసిడ్ దాడి కేసును సుప్రీం విచారిస్తూ చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయమాలా బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. 2009 నుంచి ఆ కేసు రోహిణి కోర్టులో ఉందని, ఇది న్యాయ వ్యవస్థను పరిహాసం చేయడమే అవుతుందని ధర్మాసనం చెప్పింది. ఇది చాలా సిగ్గుచేటు అంశమని, దేశ రాజధానిలో ఓ కేసు ఇంత కాలం పెండింగ్‌లో ఉంటే, మరి ఎవరు దీన్ని పరిష్కరిస్తారని, దేశానికే సిగ్గుచేటు అని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రభుత్వ పథకాలను పొందేందుకు యాసిడ్ బాధితులను దివ్యాంగులుగా గుర్తించాలని మాలిక్ చేసిన అభ్యర్థనను కేంద్రం పరిశీలించాలన్నారు.

### అధిక దిగుబడులిచ్చే వంగడాలు సాగు చేపట్టాలి

పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: రైతులు అధిక దిగుబడులు లభించి, తెగుళ్ళను తట్టుకునే విత్తన వంగడాలు సాగుచేపట్టి ఆర్ధికాభివృద్ధి సాధించాలని లాం ఫారం విశ్రాంత శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ రైతులకు సూచించారు. సంగం డెయిరీ ఆధ్వర్యంలో పరిశోధన చేసిన ఎస్ఎస్ఆర్ అర్జున్-4 విత్తన వంగడాలతో సాగు చేసిన పంట పొలాలను క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఆలపాటి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో వరి ప్రధాన పంట అన్నారు. అధిక దిగుబడుల సాధనకు మితిమీరిన రసాయనిక ఎరువులు వినియోగిస్తే భూమిలో కర్బన శాతం తగ్గిపోతుందన్నారు. ఎకరాకు 12టన్నుల పశువుల ఎరువు లేదా పచ్చిరొట్ట ఎరువులు సాగు చేపట్టాలన్నారు. సంగం డెయిరీ జోనల్ మేనేజర్ కె.నరేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాలలో పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు తక్కువ ధరకు మేలు జాతి వంగడాలు అందించాలనే లక్ష్యంతో సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ శాస్త్రవేత్తలచే సంగం డెయిరీ ఆధ్వర్యంలో పరిశోధనలు చేయించి అన్ని రకాల విత్తన వంగడాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. గురవాయిపాలెం పాలకేంద్రం అధ్యక్షుడు ఎ.పూర్ణచంద్రరావు, రైతులు గురుస్వామి, హనుమంతరావు, పేరయ్య, నాగయ్య, కొండ్రు మస్తాన్‌రావు, శ్రీనివాసరావు, వెంకట కోటేశ్వరరావు తదితరులున్నారు.



### రైతుసేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చేబ్రోలు(పొన్నూరు), డిసెంబర్ 4,ప్రభాతవార్త: వరిసాగు చేసిన రైతులు తాము పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు విక్రయించుకోవాలని, అందుకు రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లయిస్ డిఎం తులసి కోరారు. చేబ్రోలు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను, రైతుల పొలాలను, రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రానికి తీసుకువస్తే గిట్టుబాటు ధర పొందవచ్చన్నారు. దళారుల చేతిలో మోసపోయి తక్కువ ధరకు విక్రయించుకోవద్దని సూచించారు. శ్రీరంగపురం గ్రామంలోని అత్తోట మోహనరావు, నవీన్, దాసరి నాగ దివ్య, రేణుకాచౌదరి, ఎ.స్వరూపరాణి యొక్క ధాన్యాన్ని పరిశీలించారు. ఈ ధాన్యాన్ని చేబ్రోలులోకి విజయగణేష్ రైస్ మిల్లుకు తీసుకెళ్ళాలని సూచించారు. మండల కేంద్రమైన చేబ్రోలుకు చెందిన షేక్ సుబానికి చెందిన ధాన్యం 140క్వింటాళ్ళను పరిశీలించారు. ఈ ధాన్యాన్ని కాకుమానులోని శ్రీ బాలజి రైస్ మిల్లుకు తరలించాలని కోరారు. సివిల్ సప్లయిస్ డిఎం వెంట చేబ్రోలు తహాశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ ఉన్నారు.



# మోడీజీ! ఇదేం సంప్రదాయం

## - విదేశీ ప్రతినిధులను ప్రతిపక్ష నేతలు కలవకూడదా? : లోక్‌సభలో విపక్ష నేత రాహుల్

**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** విదేశీ ప్రతినిధులు భారత పర్యటనకొచ్చినప్పుడు ఇక్కడి ప్రతిపక్ష నేతలతో సమావేశం కావడం సంప్రదాయంగా వస్తోంది. కానీ మోడీ ప్రధాని అయ్యాక సరికొత్త సంప్రదాయానికి తెరతీశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. విదేశీ ప్రతినిధులు భారత్‌కు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతతో సమావేశం కాకుండా కేంద్రం అడ్డుకుంటోందని ఆయన విమర్శించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దేశ పర్యటనకు కొన్ని గంటల ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పార్లమెంట్ వెలుపల రాహుల్‌గాంధీ మీడియాతో... గతంలో విదేశీ ప్రతినిధులు దేశానికి వస్తే ప్రతిపక్ష నాయకుడితో సమావేశమవడం ఒక సంప్రదాయంగా ఉండేదని గుర్తుచేశారు. వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ఈ పద్ధతి కొనసాగిందని తెలిపారు. అయితే, ప్రస్తుత మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టిందని ఆరోపించారు. "విదేశీ ప్రతినిధు లతో మమ్మల్ని కలవకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. ప్రతిపక్ష నేతతో మాట్లాడొద్దని వారికి సూచిస్తోంది. ప్రభుత్వం తన అభద్రతాభావం కారణంగానే ఇలా చేస్తోంది" అని రాహుల్ పేర్కొన్నారు. ఈ దేశానికి కేవలం ప్రభుత్వమే కాదని, ప్రతిపక్షం కూడా ప్రజల గొంతుక అని ఆయన అన్నారు. జాతీయ అంశాలపై ప్రతిపక్షాల అభిప్రాయాలకు కూడా విలువ ఇవ్వాలని సూచించారు. ప్రధాని మోడీ, విదేశాంగ శాఖ దీనికి అనుమతించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

**మోడీ విధానాలతో రూపాయి పతనం : ఖర్గే**

**- మోడీ సమాధానమివ్వాలి: ప్రియాంకగాంధీ**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోనే రూపాయి విలువ పతనమవుతోంది. ప్రపంచంలోనే మన కరెన్సీకి విలువ లేకుండా పోయిందని ఎఐసిసి అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఇందుకు ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని ఆరోపించారు. గురువారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ "మోడీ ప్రభుత్వ విధానాల వల్లే రూపాయి బలహీనమవుతోంది. ఆ విధానాలు సరైనవి అయితే, రూపాయి పడిపోయేది కాదు. ఇది మన ఆర్థిక పరిస్థితి బాగోలేదని చూపిస్తోంది. మనం ఏది కావాలంటే అది చెప్పుకోవచ్చు, ఎంతైనా పొగడవచ్చు. కానీ రూపాయి పతనం దేశ నిజమైన ఆర్థిక పరిస్థితిని వెల్లడిస్తుంది. ప్రపంచంలో మా కరెన్సీకి విలువ లేదని ఇది స్పష్టం చేస్తోంది. 2014కు ముందు రూపాయి విలువ ఎందుకు పడిపోయిందో సమాధానాలు చెప్పాలని మోడీ ప్రశ్నించారు. ఈ రోజు మేం కూడా ప్రధాని మోడీని అదే ప్రశ్నిస్తున్నాం.



ఆయన దీనికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది" అని ఖర్గే అన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో రూపాయి పడిపోయినప్పుడు బీజేపీ చేసిన విమర్శలను గుర్తుచేశారు. "అప్పుడు విమర్శించారు కదా ఇప్పుడు వారి సమాధానం ఏమిటి?" అని ప్రియాంక గట్టిగా ప్రశ్నించారు. దేశ ఆర్థిక పరిస్థితిపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఐఎంఎఫ్ ఒత్తిడితో అమ్మకానికి పాక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్



**ఇస్లామాబాద్, డిసెంబరు 4:** తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఒత్తిడితో తమ జాతీయ విమానయాన సంస్థ పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ ప్రైవేటీకరించేందుకు సిద్ధమైంది. ఈ విమానయాన సంస్థలో 51 శాతం నుంచి 100 శాతం వాటాల అమ్మకానికి ఈ నెల 23న బిడ్డింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రక్రియను మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పష్టం చేశారు. ఐఎంఎఫ్ నుంచి 7 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీ పొందేందుకు పీఐఏ ప్రైవేటీకరణ అనేది ఒక ప్రధాన షరతు. గత రెండు దశాబ్దాల్లో పాకిస్థాన్‌లో జరుగుతున్న అతిపెద్ద ప్రైవేటీకరణ ప్రక్రియ ఇదే కావడం గమనార్హం. ఈ బిడ్డింగ్ కోసం నాలుగు కంపెనీలు అర్హత సాధించాయి. వాటిలో లక్కీ సిమెంట్ కన్సార్షియం, ఆరిఫ్ హబీబ్ కార్పొరేషన్ కన్సార్షియం, ఎయిర్ బ్లూ లిమిటెడ్‌తో పాటు పాక్ సైన్యం నియంత్రణలో ఉండే ఫౌజీ ఫౌండేషన్‌కు చెందిన ఫౌజీ ఫెర్టిలైజర్ కంపెనీ లిమిటెడ్ కూడా ఉండటం చర్చనీయాంశమైంది. సంవత్సరాలుగా ఆర్థిక దుర్వినియోగం, అవినీతి, రాజకీయ నియామకాలతో పీఐఏ భారీ నష్టాల్లో మునిగిపోయింది. 2020లో 30 శాతం మంది పైలట్లు నకిలీ లైసెన్సులతో విమానాలు నడుపుతున్నారనే కుంభకోణం బయటపడటంతో సంస్థ ప్రతిష్ఠ పూర్తిగా దెబ్బతింది. ఈ కారణంగా యూరప్, అమెరికా, యూకే వంటి దేశాలు పీఐఏ విమానాలపై నిషేధం విధించాయి. దీంతో సంస్థ ఆర్థికంగా మరింత కుదేలైంది. తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టేందుకే మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితిలో ఉన్న పాకిస్థాన్, ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గి తన జాతీయ విమానయాన సంస్థను అమ్మకానికి పెట్టింది.

# హెచ్-1బి వీసాదారులకు 'వెట్టింగ్' కష్టాలు

## ఆ సెట్టింగ్‌ను 'పబ్లిక్'లో ఉంచాల్సిందే!

**వాషింగ్టన్, డిసెంబరు 4:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి హెచ్1-బి వీసా జారీపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని నెలల క్రితం హెచ్-1బి వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ యంత్రాంగం.. తాజాగా వెట్టింగ్ నిబంధనలు మరింత కఠినతరం చేసింది. ఆ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారి లింక్డిన్ పేజీలు, రెజ్యూమోలను సమీక్షించాలని దౌత్యవేత్తలకు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆదేశాలు ఇచ్చింది. వాక్ స్వాతంత్ర్యం అణచివేసేలా సెన్సార్‌షిప్‌ను అమలు చేసేందుకు గతంలో పనిచేసినట్లు తేలినా వారి వీసాలను తిరస్కరించవచ్చని స్టేట్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన మెమో వెల్లడి చేస్తోంది. ఈ నెల 2న అన్ని అమెరికా దౌత్య కార్యాలయాలకు వెట్టింగ్ ఆదేశాలు వెళ్లాయి. వాటి ప్రకారం.. హెచ్-1బితోపాటు హెచ్-4 వీసాదారులు రెజ్యూమో, లింక్డిన్ ప్రొఫైళ్లను సమీక్షించాలి. వారు అసత్య ప్రచారం, కంటెంట్ నియంత్రణ, ఫ్యాక్ట్ చెకింగ్, ఆన్‌లైన్ సేఫ్టీ వంటి విభాగాల్లో పనిచేశారు..? అని గమనిస్తారు. ఈ నెల 15 నుంచి ఈ సమీక్ష జరగనుంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్ల పైగా ఈ పరిశీలన ఉండనుంది. ఈ వీసాలకు దరఖాస్తు చేసుకున్న వారు తమ సోషల్ మీడియా ఖాతాల ప్రైవసీ సెట్టింగ్‌లను పబ్లిక్ చేయాలని యుఎస్ యంత్రాంగం ఆదేశించింది. యుఎస్ వీసా అనేది ఒక ప్రత్యేక అర్హత అని, అదొక హక్కు కాదని.. దేశ భద్రతకు ముప్పు కలిగించే దరఖాస్తుదారుల్ని గుర్తించేందుకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని స్క్రీనింగ్ చేస్తామని వెల్లడించింది. ఇది జాతీయ భద్రతా నియమని పేర్కొంది. యుఎస్ కంపెనీలు నిపుణులైన కార్మికులను





నియమించుకునేందుకు హెచ్-1బి ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. ఈ వీసాల ద్వారా అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వారిలో ఎక్కువ భారత్, చైనాకు చెందినవారే. సోషల్ మీడియా వెట్టింగ్.. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేస్తారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఇదిలా ఉంటే.. హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, హెచ్-1బి వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ స్పష్టతనిచ్చింది. అలాగే అమెరికాలో చదువుకొని, ఉద్యోగాల కోసం హెచ్-1బి వీసాకు దరఖాస్తు చేసుకొనే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది.

### వ్యసనాలకు దూరంగా ఉండాలి: వెస్ట్ డిఎస్పీ అరవింద్

**గుంటూరు క్రైమ్, డిసెంబర్4, ప్రభాతవార్త :** సంకల్పంమాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం అనే కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వెస్ట్ డిఎస్పీ అరవింద్ జె.కె.సి కాలేజ్ లో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల లో మంచి అవగాహన అనేది ఉండాలని మత్తు వదార్థాల, మాదకద్రవ్యాలకు ఇతరే, ఇతర చెడు వ్యసనాలకు జీవితాలను దుర్భరం చేసుకో కూడదని తెలిపారు. చాలామంది విద్యార్థులు కొన్ని ప్రాంతాల్లో వ్యసనాలకు లోనై తమ బొస్తను చిన్నాభిన్నం చేసుకున్నారని వారికి కౌన్సిలింగ్ కూడా ఇచ్చి తగు చర్యలు తీసుకున్నామని తెలియజేసారు. మత్తు పదార్థాలకు ఆకర్షితులై ఆరోగ్యాన్ని విషమతుల్యం చేసుకోవద్దని సూచించారు. ఎస్పీ వకుల్ జిందాల్ తలపెట్టిన సంకల్పం మాదకద్రవ్యాల నిర్మూలన అనే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఇతరులు ఎవరైనా మాదకద్రవ్యాలు అలవాటు చేసేందుకు ప్రేరేపించిన వెనువెంటనే సంబంధించిన పోలీస్ స్టేషన్ కి తెలియచేయలన్నారు. భవిభారటపౌరులు విద్యార్థులు నని వారి భవిష్యత్ అంధకారం లోకి వెళ్లకూడదని డిఎస్పీ వివరించారు. విద్యార్థులు తమ ఆరోగ్యన్నీ సుస్థిర పర్చుకుంటు చేడు వ్యసనాలకు గురి కాకుండా మంచి ఉద్యోగాలు చేస్తూ తల్లిదండ్రులకు, విద్యార్థులకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ డిఎస్పి అరవింద్, పట్టాభిపురం సిఐ, ఎస్సైలు నాగేంద్ర కుమార్, ప్రదీప్ కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్, నాగ సుశీల, వీణ అంజనీదేవి, ఇతర కళాశాల ప్రముఖులు పాల్గొన్నారు.





### స్క్రబ్ టైఫాస్ వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలపై దృష్టి సారించండి. ..

సత్తెనపల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త: పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫాస్ వ్యాధి ప్రబలకుండా ఉండటంతో పాటు ప్రజలు వ్యాధి బారినపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని లోక్ జనశక్తి పార్టీ( రామ్ విలాస్ ) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్.. సూచించారు. గురువారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి 12వ వార్డులో పర్యటించిన మలేరియా సిబ్బంది తో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈవ్యాధితో ఇప్పటికే ఇరువురు మృతి చెందినదినట్లుగా ప్రచారం జరుగుతోందని మరెవ్వరూ దీని భారినపడకుండా ముందస్తు చర్యలకు తీసుకోవాలని పేర్కొన్నారు. వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు వ్యర్థాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నట్లుగా సత్తెనపల్లి మలేరియా యూనిట్ ఎస్ యు ఓ చంద్ర శేఖర్, హెచ్.ఎస్ రోశయ్య, సిబ్బంది పెండెం నాగేశ్వరరావు, సురేష్ కుమార్ లు పేర్కొన్నారు.



### సత్తెనపల్లిలో కొణిజేటి రోశయ్యకు ఘననివాళి



సత్తెనపల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్ వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్. కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా. ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు. కన్నా లక్ష్మీనారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

### సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: కన్నా



సత్తెనపల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక( ప్రజా దర్బార్) కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన శాసనసభ్యులు కన్నా గారుప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు

### డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ప్రారంభం

సత్తెనపల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త: ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గురువారం ఉదయం చిత్తూరు డీడీవో కార్యాలయం నుండి వర్చువల్‌గా 77 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసులను ప్రారంభించారు...ఈ కార్యక్రమం లో భాగంగా సత్తెనపల్లి పట్టణం మెయిన్ రోడ్‌లో డివిజనల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం ను ప్రారంభించిన ..సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల వార్డు గ్రామకూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



### ప్రాణం పోయాల్సిన చేతులే.. చావు ఒప్పందం అడిగాయి!



సత్తెనపల్లి, డిసెంబర్ 4, ప్రభాతవార్త: "వైద్యో నారాయణో హరి" అన్న నానుడిని మరిచి, ఆపదలో ఉన్న గర్భిణికి అండగా నిలవాల్సింది పోయి.. "బిడ్డ చనిపోతే నాకేం సంబంధం లేదని రాసిస్తేనే కత్తి పడతా.." అంటూ ఓ ప్రభుత్వ వైద్యురాలు ప్రదర్శించిన కాఠిన్యం సత్తెనపల్లిలో కలకలం రేపింది. పురిటి నొప్పులతో విలవిలలాడుతున్న ఓ నిండు గర్భిణి పట్ల సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు వ్యవహరించిన అమానవీయ తీరు సర్వత్రా విమర్శలకు దారితీసింది. బెల్లంకొండకు చెందిన షేక్ అస్మా (24) అనే గర్భిణికి మంగళవారం రాత్రి ఉమ్మనీరు పోతుండటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే చూడాలని వేడుకున్నారు. కానీ, విధి నిర్వహణలో ఉండాల్సిన డాక్టర్ అరుణ.. కనీసం పేషెంట్ ను చూడకుండానే ఫోన్లో "రిమోట్ కంట్రోల్ వైద్యం" మొదలుపెట్టారు. స్టాఫ్ నర్సు ద్వారా విషయం తెలుసుకున్న వైద్యురాలు.. "ఉమ్మనీరు పోతోంది, పుట్టే బిడ్డ ఎండిపోతాడు. మన ఆసుపత్రిలో ఇంక్యుబేటర్ లేదు. ఒకవేళ బిడ్డకు ఏమైనా అయితే మాకు సంబంధం లేదని పేపర్ మీద రాసిస్తేనే వచ్చి ఆపరేషన్ చేస్తా.. అంటూ చెప్పారు.

### ఆరు క్లస్టర్ల ద్వారా ధాన్యం కొనుగోలు

పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: మండల పరిధిలోని ఆరు క్లస్టర్ల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందని తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. మండల పరిధిలోని మునిపల్లె, పచ్చలతాడిపర్రు, తదితర గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయాధికారులు సంయుక్తంగా పర్యటించి ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి రైతులను చైతన్య పరిచారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు తొందరపడి దళారులకు విక్రయించుకోవద్దని కోరారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17శాతం కన్నా తక్కువ తేమ ఉండేటట్లుగా చూడాలన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తుందన్నారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ తులసి మాట్లాడుతూ మన మండలంలో మిల్లుల ద్వారా ధాన్యము కొనుగోలుకు ఎలాంటి సమస్య లేదన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, విఎఎలు పి.మాణిక్యరావు, వి.వాసవిశ్రీ తదితరులున్నారు.



# ఐదు వేల మంది.. 40 నిమిషాల 'ఆత్మాహుతి' శిక్షణ!

## విస్తరిస్తున్న జైషే మహిళా బ్రిగేడ్

**ఇస్లామాబాద్, డిసెంబరు 4:** ఎర్రకోట పేలుడు ఘటనలో జైషే మహిళా విభాగం కుట్రలు తెరపైకి వచ్చాయి. ఈ పేలుడు కుట్రలో కీలక భాగస్వామి అయిన డా. షాహీన్ షాహిద్ జైషే మహమ్మద్ మహిళా విభాగం 'జమాత్ ఉల్ మొమినాత్' సభ్యురాలని దర్యాప్తు వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్రిగేడ్‌కు సంబంధించి మరిన్ని కీలక విషయాలు బయటికొచ్చాయి. ఇప్పటివరకు ఈ విభాగంలో 5000 మందికిపైగా చేరినట్లు తెలిసింది. దీనిపై జైషే చీఫ్ మసూద్ అజార్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. అక్టోబరు 8 నుంచి జైషే ప్రధాన కార్యాలయంలో ఈ బ్రిగేడ్ కోసం నియామకాలు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, కొట్లీ, ముజఫరాబాద్ ప్రాంతాల నుంచి మహిళలను నియమించుకున్నట్లు తెలిపాయి. వీరికి ప్రతిరోజూ 40 నిమిషాల పాటు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నారట. ఐసిస్, హమాస్, ఎల్‌టిటిఇ తరహాలో మహిళలతో ఆత్మాహుతి దాడులకు సిద్ధమయ్యేలా వీరిని ప్రేరేపిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం ఒక్కో మహిళ నుంచి రూ. 500 చొప్పున విరాళాల కింద సేకరిస్తున్నట్లు సేకరిస్తున్నట్లు సమాచారం జైషేలో పురుష ఉగ్రవాదుల తరహాలోనే వీరికి కూడా కఠిన శిక్షణ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, ఈ బ్రిగేడ్‌లో చేరే వారికి రూల్స్ కూడా కఠినంగా ఉన్నాయట. భర్త లేదా కుటుంబసభ్యుడు మినహా తెలియని ఏ పురుషుడితోనూ మాట్లాడొద్దని వీరికి ఆంక్షలు పెట్టినట్లు సమాచారం.



ఈ మహిళా విభాగానికి మసూద్ సోదరి సాదియా అజార్ నాయకురాలు. ఇక, ఆన్‌లైన్ క్లాసులకు అఫీరా బిబి నేతృత్వం వహిస్తున్నట్లు సమాచారం.

5-12Pg6exHMNWJQE 10_5-12Pg6exHMNWJQE.qxd 04/Dec/25 10:06 PM Page 1








# ఉద్భవ్‌లో మెరిసిన గిరిజన చిన్నారులు

● క్విజ్, మిమిక్రీ, శ్లోకాలు, నృత్య, సంగీత పోటీలలో విద్యార్థుల ప్రతిభ ● శాస్త్రీయ సంగీతం, ఆశుకవిత్వం విభాగాలలో ఎపికి పసిడి ● దేశభక్తి గ్రూప్ సాంగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం ● 22 పతకాలతో ఒడిశాకు తొలి స్థానం, 20 పతకాలతో తెలంగాణ రెండో స్థానం ● మొత్తం 11 పతకాలు సాధించి ఐదో స్థానంలో ఉన్న ఆతిథ్య ఆంధ్రప్రదేశ్

విజయవాడ, డిసెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి; గిరిజన విద్యార్థుల నైపుణ్యాల్ని వెలికితీయడమే ఉద్దేశంగా నిర్వహిస్తోన్న ఉద్భవ్2025 సాంస్కృతిక ఉత్సవాలలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. కేఎల్ యూనివర్శిటీ వద్ద చిన్నారులు ప్రదర్శించే కళలతో సందడి వాతావరణం నెలకొంది. తొలి రోజు నిర్వహించిన పోటీల ఫలితాలలో త్రిపుర, సిక్కిం, ఏపీ, ఒడిశా రాష్ట్రాల హవా సాగింది. రెండో రోజు నిర్వహించిన క్విజ్, మిమిక్రీ, శ్లోకాలు, నృత్య, సంగీత పోటీలలో విద్యార్థులు మెరిశారు. రెండో రోజు మొత్తం 22 విభాగాలలో ఈఎంఆర్ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉదయం 10 గం.ల నుంచి సాయంత్రం 4.30 గం.ల వరకు పోటీలు నిర్వహించారు. ఇప్పటికే పలు విభాగాలకు సంబంధించి పోటీల ఫలితాలు వెల్లడించారు. ప్రధాన వేదిక కృష్ణ జింక వద్ద జరుగుతున్న డ్రామా పోటీలను వీక్షకులు ఆసక్తిగా తిలకించారు. జాస్మిన్ హాల్ వద్ద జరుగుతున్న శాస్త్రీయ సంగీత, నృత్య పోటీల వద్ద పండగ వాతావరణం నెలకొంది. ప్రాంతీయ జానపద బృంద నృత్యం, దేశభక్తి బృందగానం, గిరిజన సంప్రదాయ నృత్యం, కథ చెప్పడం, సృజన రచన, చిత్రలేఖనం వంటి పోటీలలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారు.

11 పతకాలతో ఐదవస్థానంలో ఆంధ్రప్రదేశ్

ఉద్భవ్2025 ఉత్సవాలలో తొలి రెండు రోజులు కలిపి మొత్తం 46 ఈవెంట్లలో ఇప్పటివరకు 29 ఈవెంట్లు పూర్తయ్యాయి. అత్యధికంగా 22 పతకాలు సాధించి ఒడిషా రాష్ట్రం తొలి స్థానంలో సాధించింది. తెలంగాణ రాష్ట్రం 20 పతకాలు సాధించి రెండో స్థానంలో నిలిచింది. 16 పతకాలతో సిక్కిం 16, 13 పతకాలతో ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మూడు, నాలుగు స్థానాలు దక్కించుకున్నాయి. 11 పతకాలతో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి. అయితే, శాస్త్రీయ సంగీతం, ఆశుకవిత్వం విభాగాలలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పసిడి పతకం దక్కింది. దేశభక్తి గ్రూప్ సాంగ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఆశుకవిత్వం ఇంగ్లీష్ సీనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్థానం దక్కింది.

# 18 నుంచి రాష్ట్ర యువజనోత్సవాలు

## యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్.భరణి



విజయవాడ, డిసెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: యువతలో నిక్షిప్తమైన నైపుణ్యాలను వెలికితీయడమే యువజన మహోత్సవం "యువ -2025" లక్ష్యమని యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్.భరణి తెలిపారు. రాష్ట్ర యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర యువజన మహోత్సవం యువ 2025 నిర్వహణపై గురువారం స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలోని శాప్ ప్రధాన కార్యాలయంలో యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్.భరణి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ నెల 18, 19, 20 తేదీలలో వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో రాష్ట్ర స్థాయి యువజన మహోత్సవాలను "యూత్ ఫర్ స్వర్ణాంధ్ర" థీమ్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని జిల్లాల నుండి దాదాపు 700 మంది యువత పోటీల్లో పాల్గొంటారని భావిస్తున్నామన్నారు. భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జానపద నృత్య బృందం, జానపద పాటల బృందం, పెయింటింగ్, ప్రకటన, కవితా రచన, కథా రచన, ఆవిష్కరణ (సైన్స్ మేళా ప్రదర్శన) ఏడు ఈవెంట్లలో పోటీలు నిర్వహించబడతాయన్నారు. అనంతరం యువజన మహోత్సవం యువ 2025 ఈవెంట్ కర్టెన్ రైజర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీ యూత్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సీఈవో యూ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటినుండి హస్తకళల ఉత్పత్తులు, అమ్మకాలు

## - దేశవ్యాప్తంగా తయారైన హస్తకళా ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రదర్శన

సచివాలయం, డిసెంబరు 4 ప్రభాతవార్త: హస్తకళలను ప్రోత్సహించి కళాకారులను ఆదరించి వారికి ఆర్థిక తోడ్పాటును అందించాలని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ట్రైనింగ్స్) మోకా సత్తిబాబు తెలిపారు. విజయవాడ ఆటోనగర్ బస్టాండ్ ఎదురుగా గల శ్రీసాయి బాబా కళ్యాణ మండపంలో ఎపిట్కో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హస్తకళా ఉత్పత్తుల థీమాటిక్ ఎగ్జిబిషన్‌ను గురువారం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ట్రైనింగ్స్) మోకా సత్తిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోకా సత్తిబాబు మాట్లాడుతూ హస్తకళా ఉత్పత్తులను ఆదరించి ఆ కళాకారులకు ఆర్థిక చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా హస్తకళాకారులచే తయారైన ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకొచ్చి అమ్మకాలు నిర్వహించేలా నేటి నుండి 12వ తేది వరకు 10రోజుల పాటు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులు వారి కళా నైపుణ్యంతో రూపొందించిన హస _కళా ఉత్పత్తులను ఒకే వేదికపై తీసుకొచ్చి సుమారు 50స్టాల్స్ ద్వారా ప్రదర్శన అమ్మకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీ క్రాఫ్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అపర్ణ లక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ హ్యాండి క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కమీషన్ సహకారంతో నిర్వహించే థీమాటిక్ ఎగ్జిబిషన్‌లో కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, ఒరిసా ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పంజాబ్ తదితర రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో పేరుగాంచిన కొండపల్లి, ఏటికొప్పాక, హస్తకళా ఉత్పత్తులను ప్రదర ్శనలో ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎకౌంట్స్ ఎన్.ప్రియాంక, ఏపి స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ.శేఖర్, ఎపిట్కో సంస్థ ప్రతినిధులు డి.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



# మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి మండపం బహూకరణ

విజయవాడ, డిసెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా మోపిదేవిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆరీ ఆర్ గ్రూపు చైర్మన్ రావి వీరరాఘవ చౌదరి, సౌభాగ్యలక్ష్మి దంపతులు రూ.కోటికి పైగా విలువైన వెండి మండపాన్ని బహూకరించారు. రూ.1,01,53,742 విలువైన ఈ వెండి మండపానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి సమక్షంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావుకు అందచేశారు. ఈ వెండి మండపాన్ని స్వామివారి గర్భాలయంలో ఉంచారు. దేవస్థానానికి రూ.కోటికి పైగా విలువ చేసే బహుకరణ రావడం ఇదే మొదటిసారి అని డిప్యూటీ కమీషనర్ చెప్పారు. రావి వీరరాఘవ చౌదరి దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జగన్ హయాంలో మైనార్టీలకు ద్రోహం నేడు న్యాయం: సయ్యద్ రఫీ

విజయవాడ, డిసెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: జగన్ హయాంలో మైనార్టీలకు ద్రోహం... నేడు చంద్రబాబు హయంలో న్యాయం జరుగుతున్నదని టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ వ్యాఖ్యానించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల పాలనలో మైనార్టీలకు గతంలో ఎన్నడు లేని విధంగా సంక్షేమం అమలవుతుంది. 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో కేవలం మైనార్టీల సంక్షేమం కోసమే ప్రభుత్వం రూ.5,434 కోట్లు కేటాయించి మైనార్టీల పక్షపాతి అని రుజువు చేసుకుందన్నారు. జగన్ హయాంలో మైనార్టీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బటన్ నొక్కడంలో ఇది కూడా ఒక పార్ట్ అన్నాడు. కానీ అమలు చేయలేదని విమర్శలు గుప్పించారు. మైనార్టీలకు సంక్షేమం అభివృద్ధి కేవలం చంద్రబాబు వల్లే సాధ్యమని పేర్కొన్నారు.



అయితవరంలో డీడీవో కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

# పటిష్ట వ్యవస్థలతోనే అభివృద్ధి పరుగులు

## ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

విజయవాడ, డిసెంబరు 4 ప్రభాతవార్త ప్రతినిధి: వ్యవస్థలు ఎంత బలంగా ఉంటే అభివృద్ధి అంత బాగా పరుగులు తీస్తుందని.. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీడీవో) కార్యాలయాల ద్వారా మరింత ప్రగతికి వీలుంటుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ప్రభుత్వవిప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డీడీవో కార్యాలయాలను వర్చువల్ పద్ధతిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తూరు నుంచి గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిగామ మండలం, ఐతవరంలో గురువారం జరిగిన డీడీవో కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావుతో పాటు కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నందిగామ డివిజన్ డీడీవో జి.జ్యోతికి శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాల ప్రారంభంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని.. ఈ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి క్షేమం, సంక్షేమానికి కృషిచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు శాసనసభ్యులు తంగిరాల సౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, డీపీవో పి.లావణ్య కుమారి, డీఆర్డీప పీడీ ఏఎన్వీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము, పంచాయతీరాజ్ ఎస్ఈ బాపిరెడ్డి, డీఈ రమేష్, డ్వామా ఏపీడీ లక్ష్మీకుమారి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణలో ఏపి టాప్

● న్యాకో నివేదికలో వెల్లడి ● 33కు 25ఇండికేటర్లలో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ ● అధికారులు, ఉద్యోగులకు మంత్రి సత్యకుమార్ అభినందనలు



సచివాలయం, డిసెంబరు 4 ప్రభాతవార్త: హెచ్ఐవి నియంత్రణ, బాధితులకు వైద్యసేవలు అందించడంలో ఏపి ప్రభుత్వం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, దేశంలోనే తొలిసారి ప్రథమ ర్యాంకు సాధించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరుతో పోలిస్తే రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ న్యాకో నిర్దేశించిన ఇండికేటర్లలో అద్భుతమైన పనితీరు కనబరిచి, మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందని ప్రకటించారు. ఇండికేటర్లకు కేటాయించిన 138కి 105మార్కులను ఏపి సాధించిందని చెప్పారు. న్యాకో విడుదల చేసిన అర్ధ సంవత్సర వార్షిక నివేదికలో పేర్కొన్న ర్యాంకింగ్ జాబితాలో ఆంధ్రప్రదేశ్ పేరు ముందుందని వెల్లడించారు. ఇదే ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు పనితీరు ప్రాతిపదికన న్యాకో విడుదల చేసిన త్రైమాసిక నివేదికలో ఏపి రెండోస్థానంలో ఉందని పేర్కొన్నారు. దీన్ని అధిగమిస్తూ తొలి స్థానంలో నిలిచేలా పనితీరు కనబరిచిన ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారులు, ఉద్యోగులను మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో అభినందించారు. ఇదేవిధంగా భవిష్యత్తులోనూ వ్యవహరించాలని కోరారు.

### ర్యాంకుల్లో దూకుడు

హెచ్ఐవి కేసుల నియంత్రణ, బాధితులకు వైద్యసేవలు అందించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తీసుకుంటున్న చర్యలు అనుసరించి న్యాకో ర్యాంకింగ్‌లను ప్రకటించింది. ఏప్రిల్ 2024 నుంచి సెప్టెంబర్ 2024 మధ్య కనబరిచిన పనితీరు ప్రాతిపదికన ఏపికి 17వ స్థానం లభించింది. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు వార్షిక నివేదిక అనుసరించి ఏపికి 12వ ర్యాంకు లభించింది. ఈ ఏడాదిలో ఏప్రిల్ నుంచి జూన్ మధ్య తీసుకున్న చర్యలను గుర్తించి న్యాకో రెండో ర్యాంకు నిచ్చింది. అర్ధ వార్షిక నివేదిక ప్రకారం ఏపి తొలి స్థానాన్ని దక్కించుకుందని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజక్టు డైరెక్టర్ నీలకంఠరెడ్డి వెల్లడించారు.

### హైరిస్క్‌లో ఉన్నవారిని గుర్తించడం, అవగాహన కల్పించడంలో ...

న్యాకో మొత్తం 33ఇండికేటర్ల ద్వారా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల పనితీరును న్యాకో గుర్తిస ్తోంది. ఈ క్రమంలో ముఖ్యంగా 25ఇండికేటర్లలో ఏపి శాక్స్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. హైరిస్క్ (ట్రక్కు డ్రైవర్లు, సెక్స్ వర్కర్లు,) గ్రూపులో ఉన్న వారిని గుర్తించి, నమోదు చేయించడం సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కేసుల నమోదు గరి ్భణీలకు హెచ్ఐవి, సిఫిలిస్ నిర్ధారణ పరీక్షలు, చికిత్స తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవి నియంత్రణలో ప్రగతిని సాధించింది.

### పాజిటివిటి, మరణాల నియంత్రణలోనూ..

హెచ్ఐవి పాజిటివిటి కేసులు 2015లో ఉన్న 2.34శాతం ఉండగా 2025 అక్టోబర్ నాటికి 0.58శాతంకు తగ్గాయి. 2010తో పోల్చితే మరణాలు (88.72శాతం) తగ్గించడంలో గర్భిణీసుల నుంచి శిశువులకు హెచ్ఐవి సోకకుండా చేయడంలోనూ ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది.



# అరటి రైతులను ఆదుకోండి

## - పార్లమెంట్‌లో అనంత ఎంపి అంబిక లక్ష్మినారాయణ

అనంతపురం, డిసెంబరు 4, ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లాలో అరటి రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభాన్ని లోక్‌సభలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ప్రస్తావించారు. రాయలసీమలో 40 వేల హెక్టార్లకు పైగా సాగు చేస్తున్న అరటికి ఈ సీజన్‌లో ధరలు భారీగా పడిపోవడంతో, కోత ఖర్చులకూ డబ్బు రాక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవాణా సాయం ప్రకటించడం ద్వారా రైతులకు కొంత ఉపశమనం లభించినప్పటికీ, రీఫర్ కంటైనర్లపై రైల్వే విధిస్తున్న అధిక ఛార్జీలు, ఖాళీ కంటైనర్ల ఎంపి హాలేజి రుసుములు రైతుల లాభాలను పూర్తిగా దెబ్బతీస్తున్నాయని ఎంపీ తెలిపారు. అనంతపురంలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన అరటి జాతీయ మార్కెట్లకు చేరే మార్గంలో ఇదే ప్రధాన అడ్డంకిగా మారిందని, ఢిల్లీ, ముంబై వంటి నగరాలకు ప్రత్యేక కార్గో రైళ్లు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో రైతులు పొందిన నష్టాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతోపాటు, రీఫర్ రవాణా రుసుములను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కోరారు.



# నాన్ స్టాప్ 200 కిలోమీటర్ల బ్లైండ్ మల్టీ టాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్

తిరుపతి క్రీడ, డిసెంబరు 4 ప్రభాతవార్త: ప్రపంచ రికార్డు కొరకు అంధుడైన 11ఏళ్ల మురారీ హర్షవర్ధన్ నాన్ స్టాప్ 200 కిలోమీటర్ల బ్లైండ్ మల్టీ టాస్క్ రోడ్డు స్కేటింగ్ మార్తాన్ చేయనున్నాడు. హర్షవర్ధన్‌కు చిత్తూరు, తిరుపతి జిల్లాల క్రీడా ప్రాధికార సంస్థలు సహాయ సహకారాలు అందించాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదేశించారు. అలాగే హర్షవర్ధన్ ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమం కర్ణాటక- ఆంధ్ర సరిహద్దుల వద్ద నంగిలి చెక్‌పోస్ట్ నుండి పలమనేరు, చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి మీదుగా పుత్తూరుకు చేరుకోనున్నారు. ఈ కార్యక్రమం ముగింపు కార్యక్రమం తిరుపతిలో శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డిసెంబర్ 9 మంగళవారం రికార్డ్ పత్రాన్ని బహుకరిస్తారు. ఈ కార్యక్రమం ఆసాంతం రికార్డ్ చేసేందుకు వజ్ర వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్‌ల ప్రతినిధులు సంయుక్తంగా పాల్గొననున్నారు. ముఖ్య కోచ్ జి. ప్రతాప్, శాప్ కోచ్ వి.జి. ప్రేమ్‌నాథ్, టాలెంట్ స్కేటింగ్ అకాడమీ ప్రతినిధులు పర్యవేక్షించనున్నారు.



డివిజినల్ అధికారి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

# పంచాయతీరాజ్‌లో విప్లవాత్మక అభివృద్ధి

## శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 4 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్‌శాఖలో ఎన్నో విప్లవాత్మక అభివృద్ధిని ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో సాగుతుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకాళహస్తి పంచాయతీరాజ్ డివిజినలనఅధికారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో ఇది ఒక గేమ్ చేంజర్ అని పేర్కొన్నారు. పరిపాలనలో గ్రామీణ పాలన ఎంతో కీలమైనదన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఈ ఏడాది భారీ వర్షాలతో గ్రామాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. దిత్వా తుపానుతో గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాలతో గ్రామీణ రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయని ప్రత్యేక నిధులు కేటాయించాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రిని టెలికాన్ఫరెన్సులో కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అధికారి సుమిత్ర, వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు, జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్ అలెక్స్ అరెస్టు

## మహిళపై పలుమార్లు నిందితుడు అత్యాచారం



చిత్తూరు(గుడిపాల), డిసెంబరు 4 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా గుడి పాల మండల పోలీసులు తమిళ నాడులో పేరు మోసిన రౌడీషీటర్ అలెక్స్(30)ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తమిళనాడులో అలెక్స్ రౌడీ షీటర్‌గా పేరుగాంచాడు. ఇతనిపై తమిళనాడు పోలీసులు 50కి పైగా కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో గుడిపాల మండలంలో ఓ యువతిని పలుమార్లు అత్యాచా రం చేయడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అలెక్స్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించిన వివరాల మేరకు గుడిపాల మండలం అనుపు ఎస్టీ కాలనీలో నివాసం వుంటున్న ఓ వ్యక్తికి తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన అలెక్స్ ఏడాది క్రితం మద్యం షాపు వద్ద పరిచయం అయ్యాడు. అలెక్స్‌ను ఆ వ్యక్తి తనతో పాటు అనుపు ఎస్టీ కాలనీలో వున్న తమ ఇంటికి తీసుకెళ్ళి కుటుంబ సభ్యులను పరిచయం చేశాడు. అప్పటి నుండి అలెక్స్ ఆ వ్యక్తి కుటుంబసభ్యులతో పరిచయం పెంచుకుని కుటుంబంలోని ఓ యువతిని భయపెట్టి లొంగదీసుకున్నాడు. ఆ యువతిపై అలెక్స్ పలుమార్లు అత్యాచారం చేస్తున్నప్పటికీ ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను సైతం బెదిరించడంతో వారు నోరు తెరిచేవారు కాదు. పలుమార్లు ఇంట్లోని వ్యక్తులను అలెక్స్ బెదిరించి కొట్టడంతో ఒక్కో సారి అలెక్స్ ఇంటికి వచ్చాడంటే ఇంట్లో ఆ యువతిని మాత్రం వదలి కుటుంబసభ్యులు సమీపం లో వున్న అడవికి వెళ్ళిపోయే వారు. ఈ క్రమంలో పలుమార్లు అలెక్స్ చేతిలో అత్యాచారంకు గురైన యువతి తెగించి గుడిపాల పోలీసు స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ అలెక్స్‌ను అదుపులోకి తీసుకుని అతనిపై అత్యాచారయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలెక్స్‌పై తమిళనాడు, కర్నాటక రాష్ట్రల్లో 50కి పైగా కేసులు వున్నట్లు సమాచారం. ఇతని ఆర్థిక లావాదేవిలు నెలకు కోట్ల రూపాయలకు పైబడి వుండటంతో ఇతనిని బెయిలుపై విడిపించడానికి పెద్ద సంఖ్యలో లాయర్లు సిద్ధమైనట్లు సమాచారం. ఈ క్రమంలో గుడిపాల పోలీసులు అలెక్స్‌ను అరెస్టు చేశారని సమాచారం తెలియడంతో తమిళనాడు రాష్ట్రానికి చెందిన సిఐడి పోలీసులు, ఇంటెలిజెన్స్ పోలీసులు గుడిపాల వచ్చి అతనిని తమకు అప్పటించాలని ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చినట్లు సమాచారం.



# కలికిరి రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని ఇద్దరు మృతి

కలికిరి, డిసెంబరు 4 ప్రభాతవార్త: కలికిరి మండల కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన కలికిరిలో కలవరం లేపింది. కలికిరి పీఎస్ సమీపంలో ఉన్న లింగయ్య కుమారుడు వీరభద్రయ్య గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్తిమితం లేకుండా తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో తన కుటుంబ సభ్యులకు భారం కాకూడదని ఆలోచించడం దాంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. అదేవిధంగా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఇరికిపెంటకు చెందిన మునికుమార్ కలికిరి అమర్‌నాథ్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మునికుమార్ మద్యానికి బానసై కుటుంబంలో తన భార్య శ్రీదేవితో తరచూ ఘర్షణ పడేవాడు. వీరభద్రయ్య, మునికుమార్‌లు ఇద్దరూ మద్యం సేవించడంతో పాటు స్నేహంగా ఉంటూ బుధవారం రాత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ మద్యం సేవించడంతో రైల్వే స్టేషన్ అధికారులు మందలించడంతో అక్కడి నుంచి కొంత దూరం వచ్చి రైల్వే ట్రాక్‌పై కూర్చొని మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో నాగర్‌కోయల్ నుంచి ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వారిని రైలు ఢీకొంది. దీంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సమాచారం పైలెట్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు వీరభద్రయ్యకు భార్య భాగ్యలక్ష్మి, ఇంజినీరింగ్ చదివే కుమాడు, కుమార్తె ఉన్నారు. మృతుడు మునికుమార్‌కు ఏడాది బాబు ఉన్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు రైల్వే జీఆర్‌పీ ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబాన్ని పోషించే భర్తలు చనిపోవడంతో వీరభద్రయ్య, మునికుమార్‌ల కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. తమను ఆదుకునే దిక్కెవరని మునికుమార్ భార్య శ్రీదేవి కన్నీరుమున్నీరయ్యారు. అది చూసిన పలువురు కంటతడి పెట్టారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చలేకపోయారు.

## బాల్ వివాహ్ ముక్త భారత్ కార్యక్రమం

నకరికల్లు, డిసెంబర్ 4 ప్రభాతవార్త : నరసరావుపేట జిల్లా బాలల పరిరక్షణ విభాగము కార్యాలయంలో గురువారం పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి సౌరి రాజు ఆధ్వర్యములో బాల్ వివాహ్ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగము అధికారి శౌరిరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ప్రోహిబిషన్ అఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 చట్టం ప్రకారం వివాహ వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ళుగా నిర్ణయించారన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, వివాహానికి హాజరైనా రెండేళ్ళు జైలు శిక్షతో పాటు జరినామ విధించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహము జరుగుతున్నదన్న సమాచారము తెలిస్తే గ్రామ స్థాయిలో గ్రామ కార్యదర్శి, గ్రామ రెవిన్యూ అధికారి మండల స్థాయిలో సి.డి.పి.ఓ, తహసీల్దారు మరియు ఐ.సి.డి.ఎస్. సూపర్వైజర్ డివిజినల్ స్థాయిలో ఆర్.డి.ఓ. లేదా సబ్ కలెక్టర్ జిల్లా మొత్తానికి జిల్లా కలెక్టర్ కి సమాచారం తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని తెలిపారు. పల్నాడు జిల్లాని బాల్య వివాహ రహిత జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట డైరెక్టర్ ఉమాదేవి, నరసరావుపేట మెడికల్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, మహిళా పోలీస్ సి.ఐ, డి.ఆర్.డి.ఎ, మిషన్ శక్తి కోఆర్డినేటర్, బాలల పరిరక్షణ విభాగము, ఐ.సి.డి.యస్ నరసరావుపేట సి.డి.పి.ఓ నీడ్స్ ఎం.జి.ఓ తదితరులు పాల్గొన్నారు.

## లింగంగుంట్ల డిడిఓ ను వర్చువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం

రొంపిచర్ల, డిసెంబర్ 4 ప్రభాతవార్త ::రాష్ట్రంలో ఒకేసారి 77 కొత్త డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిడిఓ) కార్యాలయాలను గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానికంగా ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మండలంలోని లింగంగుంట్లలో నూతన డిడిఓ కార్యాలయ భవన ప్రారంభానికి ముఖ్యఅతిథిగా



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి పథకాల అమలు మరింత వేగవంతం కావాలన్నా రు. ప్రజలకు అధికారులు సమీపంలో ఉంటూ సేవలు అందించేలా ఈ డిడిఓ కార్యాలయాలు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కార్యాలయాల ఏర్పాటుతో మెరుగైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు...జిల్లా క్రీడా ప్రాంగణం పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం సత్తెనపల్లి రోడ్డులో గల డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రాంగణం వద్దకు వచ్చిన స్థానిక ప్రజలతో మాట్లాడారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించే లక్ష ్యంతో ఈ స్టేడియం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలుసుకున్నారు.

## నకిలీ హార్పిక్ ను అమ్ముతున్న వారిపై కేసు నమోదు

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :: నకిలీ హార్పిక్ ను విక్రయిస్తున్న ఇద్దరినీ అరెస్టు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ సౌందర్ రాజన్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు చేయగా శివుని బొమ్మ వద్ద ఒక షాపులో 8 బాటిల్స్, మరొక షాపులో 4 బాటిల్స్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కోటప్పకొండలో 6న ఆరుద్రోత్సవం.. ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట,డిసెంబర్ 4 ప్రభాతవార్త :: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ పై వేంచేసి ఉన్న త్రికోటేశ్వరస్వామివారి దేవస్థానములో ఈ నెల 6న శనివారము ఆరుద్రోత్సవం నిర్వహిస్తున్నారు. వివరాలను ఆల ఈవో, సహాయక కమిషనర్ చంద్రశేఖర్ గురువారం



తెలియజేశారు. రాత్రి గరా12లకు జ్యోతి దర్శనం, అనంతరం త్రికోటేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకము జరుగుతాయన్నారు. స్వామివారికి ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, తేనె, పంచదార, సుగంధ ద్రవ్యములు, విభూది, గంధం, కుంకుమ, తైలం, అన్నాభిషేకంతో విశేష అలంకరణ చేస్తామన్నారు. ఆరుద్రోత్సవము సందర్భముగా సాంస్కృతిక కార్యక్రములు కూడా ఏర్పాటు చేయడమైనదన్నారు. 7న ఉదయం గం++ 8ల నుండి యాగశాల నందు గణపతి హోమము, రుద్ర హోమము, శాంతి హోమము మరియు వాస్తు హోమము, పూర్ణాహుతి కార్యక్రమము జరుగుతాయన్నారు. అదేవిధంగా 6న దక్షి ణామూర్తి మాలావిరమణ చేయుస్వాములకు, భక్తులకు అన్నసంతర్పణ ఆలయ ప్రాంగణము నందు దాతల సహకారముతో ఏర్పాటు చేశామన్నారు . ఈ అన్న సంతర్పణ కార్యక్రమము తాళ్ళ వెంకటకోటిరెడ్డి, స్వాతి మెడికల్ ఏజన్సీస్, శీలం జయరామిరెడ్డి, సీకో బయోటెక్స్, అల్లు రమేష్లు దాతలుగా వ్యవహరించుచున్నారు. యావన్మంది భక్తులు ఈ కార్యక్రమము నందు పాల్గొని విజయవంతం చేయాలని సహాయ కమిషనర్ చంద్రశేఖర్ కోరారు.

## స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీవో

నరసరావుపేట, డిసెంబర్ 4 ప్రభాతవార్త :: మండలంలోని ములకలూరు గ్రామంలో స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ఎంపీడీవో టీ.వీ కృష్ణకుమారి గురువారం ప్రారంభించారు. గ్రామస్తులనుదేశించి మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం గ్రామాలలో చేపట్టిందన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో తిరిగి ఇళ్లల్లోని పాత సామాన్లు, ప్లాస్టిక్ పేపర్లు,



అల్యూమినియం, అట్టపెట్టెలు, పుస్తకాల వంటివి స్వచ్ఛ రథం సేకరించి నిత్యవసర వస్తువులు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ రహితంగా, పరిశుభ్రంగా గ్రామాలను మార్చే లక్ష్యాలను శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాలలో ఆరోగ్యవంతమైన వాతావరణం తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తో పాటు గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ ఇన్‌స్పిరేషన్ అవార్డు అందుకున్న అధ్యాపకుడు బాజీ




పెదకూరపాడు, డిసెంబర్ 4, ప్రభాతవార్త: శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 2025 26 జాతీయ ఉపాధ్యాయ ఇన్స్పిరేషన్ అవార్డుకు పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం కన్నెగండ్ల గ్రామానికి చెందిన హిందీ అధ్యాపకులు షేక్ బాజీ ఎంపికయ్యారు. హైదరాబాదులో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో మాజీ కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పెదకూరపాడు శ్రీ కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ శ్రీ లలిత బాబు ఇందిరాదేవిలు హిందీ అధ్యాపకులు బాజీని ఘనంగా సత్కరించారు.

## మొక్కుబడిగా సాగిన సర్వసభ్య సమావేశం

### 14 మంది ఎంపీటీసీలకు సగానికి పైగా గైర్హాజరు

పెదకూరపాడు, డిసెంబర్ 4, ప్రభాతవార్త: ప్రతి మూడు మాసాలకు ఒక సారి జరిగే సర్వసభ్య సమావేశం అధికారులు రాక, నాయకులు లేక, తమ ప్రణాళికలను గుట్టు చప్పుడుగా అమల పరుచుకునేందుకు, తమకు అనుకూలమైన నాయకులను పిలుసుకొని కోరం ఏర్పర చుకొని, తూతూ



మంత్రంగా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం మండల అభివృద్ధి కోసం, మండల అధికారులతో చర్చించి చేపట్టే పనులు, విడుదలైన నిధుల గురించి చర్చించి, గ్రామాల అభివృద్ధికి ఏర్పాటు చేసే సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగుతుందని పలువురు నిపుణులు తెలిపారు. 20 మంది సర్పంచులకు గాను ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. 14 మంది ఎంపిటీసీలకు కొందరు మాత్రమే హాజరయ్యారు. అందరికి తెలియ చెప్పకపోవడం కారణమా, అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణమా తెలియక వచ్చిన కాస్త మంది నాయకులు ఏం చేయాలో అర్థం కాక సంతకాలు పెట్టి వెళ్ళారు.

**నాటి వైభవం ఏదీ?:** గతంలో మండల సమావేశమంటే సభ్యులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పడంతోపాటు అవకాశం ఉన్న వాటిని పరిష్కరించేవారు. సభకు ముందుగానే వారంతా అవసరమైన నివేదికలు వెంట తెచ్చుకునేవారు. తద్వారా సమావేశాలు చాలా బాధ్యతగా జరిగేవి. ప్రస్తుతం అవెక్కడా కానరావడంలేదు. సభలో లేవనెత్తే సమస్యలకు పరిష్కారం చూపుతున్న పరిస్థితి లేదు. తర్వాత సమావేశంలోనూ వాటికి సమాధానం రావడంలేదు. సభ్యులు గొంతు చించుకోవడం తప్పితే ఫలితం లేక, మండల సమావేశాలు మొక్కుబడిగా మారిపోయాయి. జిల్లా అధికారులు వీటిపై పట్టి పట్టనట్లు వ్యవహరిస్తుండటం బాధాకరం. సర్వసభ్య సమావేశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసే వారు పొందుపరచిన ప్రణాళికలు బిల్లులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, చేపట్టిన పనులను కూడా పర్యవేక్షిత జరపాలని స్థానిక ప్రజలు పలువురు నాయకులు కోరారు.

## అచ్చంపేటకు శాశ్వత తహశీల్దార్ నియామకం అవసరం

అచ్చంపేట డిసెంబర్ 4 (ప్రభాత వార్త): అచ్చంపేట ఎమ్ ఆర్ ఓ ఆఫీస్ లో గత ఏడాది నుంచి అచ్చంపేట మండలానికి తహసీల్దార్ స్థిరంగా లేకపోవడంతో అధికారిక పనులు ఆలస్యం అవుతున్నాయని స్థానికులు తెలిపారు. సంవత్సరకాలంలో నలుగురు అధికారులు మారిపోవడంతో ప్రస్తుతం ఎఫ్.ఎ.సీగా క్రోసూరు తహసీల్దార్ బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు.మండలం పరిధిలో భూసంబంధిత పనులు, ఆదాయ ధ్రువపత్రాలు, ఇతర సేవల సమయానికి అందక కొంత ఆలస్యం అవుతుందని ప్రజలు చెప్పారు. మా మండలంలోనే శాశ్వతంగా తహసీల్దార్ నియమించబడితే సేవలు మరింత వేగంగా అందుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, డిసెంబర్4(ప్రభాతవార్త):పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల



మనోహర్ గురువారం ప్రారంభించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ కార్యాలయం ద్వారా ప్రత్యేక అధికారిని నియమించి గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేసినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెనాలి డివిజనల్ అభివృద్ధి అధికారినిగా నియమించబడ్డ శ్రీదేవిని కోప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,డిడిఓ గా నియమితులైన శ్రీదేవిని అభినందించారు. అనంతరం గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం పనిచేయనున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలు పర్యవేక్షణ పారదర్శక సేవల కోసం ఈ కార్యాలయం ముఖ్యపాత్ర పోషించనుందని మరియు ఈ ప్రాంత ప్రజలకు మరింత వేగవంతమైన పరిపాలన సేవలను అందించేందుకు ఇది ఒక కీలక అడుగని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిని అత్తోట దీప్తి మరియు పలువురు అధికారులు కూటమి నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## దేవాలయభూమిని కాపాడాలంటూ స్థానికుల ఆందోళన

తెనాలి టౌన్, డిసెంబర్4(ప్రభాతవార్త):దేవాలయానికి దాతలిచ్చిన ఇంటిని,ఆక్రమించుకుని ఖాళీ చేయని వారినుంచి ఇంటిని స్వాదినపరచుకోవాలని స్థానికులు ఆందోళనచేపట్టిన ఘటన,గురువారం పట్టణంలో జరిగింది.వివరాల్లోకి వెళితే, పట్టణంలోని నందులపేటలో శ్రీ విఘ్నేశ్వర స్వామివారి



దేవాలయానికి దాతలు ి ం గ ి నా య ి ు క ి వ ు ్మ , ల క్ష్మి కాంతమ్మ లు వారి ఇంటిని ది :1943 వ సంవత్సరం స్వామి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు.కాగా అద్దెకు ఉంటామని ఆయింటిని ఆక్రమిం చుకుని నివాసం ఉంటూ ఇందులో ఎప్పటి నుండో మేము ఉంటున్నాము అని ఖాళీ చేయక పోవడంతో, దేవాదాయశాఖ వారు కోర్టులో కేసువేయగా,విఘ్నేశ్వర స్వామివారికి అనుకూలంగా తీర్పురావడంతో గురువారం అధికారులు,పోలీసులుతో మరియు జంగమ కులస్తులతో కలిసి,వారిని ఇల్లు ఖాళీచేయమనగ,దానికి వారు గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని,ఖాళీ చేయటానికి నిరాకరించటంతో, పోలీసులు సర్దిచెప్పిన అనంతరం,ఇల్లు ఖాళీ చేయటానికి మాకు కొంత సమయం ఇవ్వమని అధికారులను కోరగా, అధికారులు లిఖిత పూర్వకంగా వారిచే రాయించుకుని,వారు కోరిన విధంగా కొంత సమయం ఇవ్వడం జరిగినది.

## వీరాంజనేయస్వామివారిని దర్శించుకున్న బాపట్ల కలెక్టర్



పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ వీరాంజనేయస్వామివారిని బాపట్ల జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కలెక్టర్‌కు దేవాలయం అర్చకస్వాములు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.అష్టోత్తరం, సహస్రనామార్చన తదితర పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయం కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ కలెక్టర్‌కు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## భావదేవుని ఈనాం భూముల గుర్తింపులో అధికారులు

పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: అత్యంత ప్రసిద్ధిగాంచిన సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి దేవాలయానికి సంబంధించిన ఈనాం భూములను గుర్తించే పనిలో రెవెన్యూ, దేవాదాయశాఖాధికారులు నిమగ్నమయ్యారు. నాడు దేవాలయంలో స్వామివారికి వివిధ రకాల కైంకర్యాల నిమిత్తం పలువురికి భూములను కేటాయించారు. అయితే దేవాలయంలో స్వామివారి కైంకర్యాలు నిర్వహించేవారు స్వామివారికి సేవ చేస్తూ ఇచ్చిన భూములను పండించుకొంటూ జీవనం



గడపాలన్నది ఉద్దేశం. అందుకు గాను ఎనిమిది విభాగాలలో సేవకులను నియమించారు. వారిలో స్థానాచార్యులు, అధ్యాపకస్వాములు, స్వస్థివాచకం దారులు, బాపా నౌకరి, వ్యాసపూజ, నేత్ర హస్తుడు, తాపీ నౌకరి, భజంత్రీలకు 390.82ఎకరాలను నాడు ఇవ్వడం జరిగింది. దేవాలయంలో సేవలు చేయాల్సిన ఈ విభాగాల వారు స్వామివారికి సేవలు చేయకపోగా స్వామివారి భూములను తిరిగి అప్పజెప్పకుండా విక్రయించుకున్నారు. ప్రస్తుతం శ్రీ భావదేవుని భూమి 390.82ఎకరాలు అన్యాక్రాంతంలో ఉన్నట్లు దేవాదాయశాఖ రికార్డుల్లో ఉన్నట్లు తెలుస్తుంది. దేవాలయానికి సంబంధించిన ఈనాం భూములు ఎక్కడెక్కడ ఏ స్థాయిలో, ఏ విధంగా ఉన్నాయో గుర్తించాలని, అందుకు సంబంధించిన వివరాలతో కూడిన పూర్తి నివేదికను ఇవ్వాలని కోరడంతో మండల సర్వేయర్ నేతృత్వంలో సిబ్బంది, దేవాదాయశాఖాధికారులు భూముల వివరాలను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపే యోచనలో ఉన్నారు. దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ, నిడుబ్రోలు, పొన్నూరు ఇన్‌చార్జి సర్వేర్ సోయబ్ ఖాన్ భూములను పరిశీలించి, వివరాలను నమోదు చేశారు.

## దేశ సేవకులను సముచితంగా గౌరవించాలి

పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: మన దేశానికి వివిధ రకాలుగా సేవలందించిన వారిని సముచితంగా గౌరవించుకోవడం మన కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి అన్నారు. ప్రపంచ నౌకాదళ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారత నావికాదళ దినోత్సవాన్ని ప్రతి ఏటా డిసెంబర్ 4వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. నావికాదళంలో పనిచేసే వారు దేశ రక్షణ కోసం విశేషంగా పనిచేశారన్నారు. దేశానికి రక్షణగా ఉండడంలో నావికా దళానిది ఓ ప్రత్యేకత అని చెప్పారు. దేశానికి సేవలందించిన వారిని సముచితంగా గౌరవించుకోవడం అంటే రాబోయే తరాలకు నావికాదళంలో



పనిచేసిన వారి సేవలను తెలియజేయడమేన్నారు. దీని ద్వారా యువత దేశానికి సేవ చేసిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఛత్రపతి శివాజీని భారత నావికాదళ పితామహుడుగా గౌరవిస్తారన్నారు. ఆయన 17వ శతాబ్దంలోనే ఒక బలమైన నావికా దళాన్ని నిర్మించినట్లు ఝాన్సీరాణి గుర్తు చేశారు. ఈ సందర్భంగా నావికాదళం సాధించిన విజయాలను, ప్రత్యేకించి పాకిస్థాన్ కరాచీ తీరంలో సాధించిన విజయాన్ని పలువురు మాజీ నావికాదళ అధికారులు వివరించారు. అనంతరం సేవలందించిన పెట్టి ఆఫీసర్ షేక్ మహబూబ్, మహమ్మద్ ఇక్బాల్ షేక్ షాహిద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, బి.శబలాదేవి, విజయలక్ష్మి తదితరులున్నారు.

## కొణిజేటి సేవలు చిరస్మరణీయం


పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం కొణిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతి కార్యక్రమాన్ని



ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపనపల్లి మాట్లాడుతూ అనేక పర్యాయాలు అసెంబ్లీలో ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టిన వ్యక్తిగా కొణిజేటి రోశయ్య చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. మన పొన్నూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అపర కర్మశాల నిర్మాణంలో కొణిజేటి రోశయ్య కృషి ఎంతో ఉందన్నారు. ఆర్యవైశ్యుల్లో ఇంతటి నాయకుడిని గతంలో ఎన్నడూ చూడలేదని, రాబోయే రోజుల్లో కూడా చూడలేమన్నారు. తొలుత కొణిజేటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అవ్వారు వెంకటేశ్వరరావు, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కొణిజేటి నేటి తరానికి స్ఫూర్తిదాయకం

పొన్నూరు, డిసెంబర్ 4,ప్రభాతవార్త: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నేటి తరానికి



స్ఫూర్తిదాయకమని జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు.కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా గురువారం పట్టాభిపురంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో వడ్రాణం హరిబాబు పాల్గొని మాట్లాడారు. రోశయ్య ప్రజాసేవ, పరిపాలనా పటిమ, నిజాయితీ నాయకత్వం తెలుగు రాజకీయాలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు అని చెప్పారు. ఎన్నో కీలక పదవుల్లో ఉన్నా, ఆయన వినయం, నిష్ప క్షపాత ధోరణి, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత ఎప్పటికీ మరపురానివన్నారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

విజయపురిసౌత్, డిసెంబరు 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ (1975–2025) వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీఆర్‌జేసీ నాగార్జునసాగర్ గోల్డెన్ జూబిలీ సెలబ్రేషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ ఎ.సైదారెడ్డి, కో–ఛైర్మన్ ఎస్.నాగాచారి, డా॥ కె.వీరనంది,



జి.గోపాలరావు తెలిపారు. డిసెంబరు 13న గురు సత్కారం వేడుకలకు ముఖ్యఅతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, విశిష్ట అతిథిగా ఏపీఆర్ఈఐఎస్ సెక్రటరీ వీఎన్ మస్తానయ్య పాల్గొననున్నారు. డిసెంబరు 14న జరిగే స్వర్ణోత్సవాల ఆత్మీయ సమ్మేళనంలో దేశ విదేశాల నుంచి పెద్దఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రిన్సిపల్ ఎన్.సరోజిని, ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు రమేష్ నాయుడు, వంశీకృష్ణ, మాట్లాడుతూ విద్యాసంస్థ 50 ఏళ్ల సువర్ణ ప్రయాణాన్ని స్మరించుకుంటూ ఈ వేడుకల్లో గురువులు, పూర్వవిద్యార్థులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆహ్వానించారు.

## సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

విజయపురిసౌత్, డిసెంబరు 4 ప్రభాతవార్త: సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర నాయుడు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది స్థానిక లాంచీస్టేషన్, డ్యాం ప్రధాన రహదారి సమీపంలో, సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆసుపత్రి సమీపంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి చెత్తను ప్రతిరోజూ సేకరించాలన్నారు. చెత్త పేరుకుపోకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. తద్వారా దోమలు చేరి, రకరకాల రోగాలు వస్తాయని, అందుకే ఇంటిని, మన గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని స్వచ్ఛభారత్ లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ పూర్తి నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శిడిమాను ఉత్సవం

### అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ కృత్తికాశుక్లా

గురజాల, డిసెంబరు 4 ప్రభాతవార్తః పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా గురువారం శిడిమాను ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణ పురవీధులలో శిడిమానును



ఊరేగించి అమ్మవారి జాతరను ఘనంగా జరిపారు. అమ్మవారి దర్శనానికి వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారికి బోనాలు, పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ భాస్కర్‌రావు, ఈవో పూర్ణచంద్రరావు, ఆలయ కమిటి సభ్యుడు చీతిరాల సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ కృత్తికాశుక్లా, ఎస్పీ కృష్ణారావు, ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్, నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ ఆకుల పిచ్చయ్యగుప్తా, నేలవెల్లి బొల్లయ్య, శ్రీరామ్మూర్తి, గౌరీశంకర్, రామాంజనేయులు, జనసేన నేత కటకం అంకారావు తదితరులు పాల్గొన్నారు.

## డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ కృత్తికాశుక్లా

గురజాల, డిసెంబరు 4 ప్రభాతవార్తః పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ కృత్తికాశుక్లా ప్రారంభించారు.



ముందుగా పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ వర్చువల్ విధానంలో డీడీవో కార్యాలయాల ప్రారంభాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో గబ్రూనాయక్, నాగార్జున సాగర్ కుడికాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆకుల పిచ్చయ్య గుప్తా, నేలవెల్లి బొల్లయ్య, శ్రీరామ్మూర్తి, శరమాల హనుమంతురావు, అడపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు

మాచర్ల, డిసెంబరు 4 ప్రభాతవార్త: గురజాల డివిజన్ పరిధిలోని సర్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా జి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈయన పిడుగురాళ్ల మండల సర్వేయరుగా పనిచేస్తున్నారు. ఉపాధ్యక్షునిగా మాచర్ల మండలం కొప్పునూరు గ్రామ సర్వేయరు మూఢావత్ హరినాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాచర్ల తహశీల్దారు కిరణ్‌కుమార్ హరినాయక్‌ను సన్మానించారు.

## అవినీతి ఆరోపణలతో,టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు



తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్4(ప్రభాతవార్త): పురపాలకసంఘంలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సాంబశివరావు పై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు రావటంతో, అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో జరిగిన అనధికార భవననిర్మాణాలలో పిపిఓగా ఉన్న సాంబశివరావు పాత్రపై అనేక ఫిర్యాదులు రావడంతో,ఇటీవల ప్రత్యేక బృందాల తనిఖీల్లో, పలు అక్రమాలు బయటపడడంతో మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు విచారణ జరిపి, టిపిఓ సాంబశివరావుని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.టిపిఓ గా బదిలీపై తెనాలి కి వచ్చిన సాంబశివరావు పై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చినట్లు,అవినీతి అధికారిగా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్న ఈయన వైఖరిపై,గత కౌన్సిల్ సమావేశాల్లో కూడా పలువురు సభ్యులు ప్రస్తావించటం జరిగిందని,ఇతని అంతులేని ధనదాహానికి మధ్యతరగతి, పేదవర్గాలవారు ఇల్లు కట్టుకోవాలంటే,అనుమతులు పేరున ఇబ్బందులు పెట్టటం పరిపాటని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇలాంటి అధికారి తెనాలిలో విధులు నిర్వర్తించటం మన పట్టణానికి తలవొంపులు అని,నేడు అతని పాపం పండిందని, అవినీతి సామ్రాట్ గా పేరు తెచ్చుకున్న సాంబశివరావును ఉద్యోగం నుండి తొలగించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## కాంగ్రెస్ పటిష్టతకు కృషిచేసిన రోశయ్య: డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలి టౌన్ డిసెంబర్4(ప్రభాతవార్త): కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేసి,జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగిన,నిజమైన కాంగ్రెస్ వాది కొణిజేటి రోశయ్య అని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. గురువారం,మాజీ ముఖ్యమంత్రి,మాజీ గవర్నర్



దివంగత కొణిజేటి రోశయ్య నాలుగవ వర్ధంతి సందర్భంగా, పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో,నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పార్టీ శ్రేణులతో కలిసి స్వర్గీయ రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలోని వేమూరు గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కొణిజేటి రోశయ్య,రాష్ట్ర ముఖ్యమంత్రి,గవర్నర్ స్థాయికి ఎదగడంలో ఆయన విశేష కృషి కనబడుతుందని, రాజకీయంగా అపరచాణుకుడిగా,పేరుగాంచి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్న స్వర్గీయ రోశయ్య మన ప్రాంతవాసి కావటం మన అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్యశశిధర్రావు, ఉపాధ్యక్షులు,గుర్రపు ద్వారక శ్రీనివాస్,మల్లికార్జునరావు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖుల నివాళి

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్4(ప్రభాతవార్త): మాజీ ముఖ్యమంత్రి,మాజీ తమిళనాడు గవర్నర్,స్వర్గీయ కొణిజేటి రోశయ్య 4గవ వర్ధంతి సందర్భంగా, పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి,ఆర్యవైశ్య ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డబల్ హార్స్ మినప గుళ్ళు అధినేత మునగాల శ్యాంప్రసాద్ మాట్లాడుతూ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా,తమిళనాడు రాష్ట్ర గవర్నర్



గా,అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన,స్వర్గీయ కొణిజేటి రోశయ్య,మన ప్రాంత వాసి కావటం అంతేకాకుండా పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం గౌరవాధ్యక్షుడుగా కూడా వ్యవహరించటం మన అదృష్టం అన్నారు.ఏ పదవిలో ఉన్న ఆ పదవికే వన్నెతెచ్చిన మహామనిషిఅని,ఎంత హోదాలో ఉన్న మనప్రాంత వాసులపట్ల చాలా ఆప్యాయత, ఆదరణ చూపేవారని,పలు సంస్థలకు దేవాలయాలకు భూరివిరాళం ఇచ్చిన గొప్ప మానవతావాది కొణిజేటి రోశయ్య అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో, మునగాల శ్యాంప్రసాద్,ఆకి అచ్యుతరావు,కొత్త పాండురంగారావు,మద్దాలి శేషాచలం,నూకల భాస్కరరావు,కొణిజేటి వాసు, మరియు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ సభ్యులు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

05-12pg12 GNT_05-12pg10.qxd 04/Dec/25 10:01 PM Page 1





## పట్టుబిగించిన న్యూజిలాండ్

### వెస్టిండిస్‌పై 481 రన్స్ ఆధిక్యం

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ 3వ రోజు 481 పరుగుల ఆధిక్యాన్ని పెంచుకుంది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో న్యూజిలాండ్ పట్టుబిగించింది. టామ్ లాథమ్ (145), రచిన్ రవీంద్ర (176) భారీ శతకాలతో కదంతొక్కడంతో మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి 481 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు స్కోర్ 4 వికెట్లు కోల్పోయి 417గా ఉంది. విల్ యంగ్ (21), బ్రేస్‌వెల్ (6) క్రీజులో ఉన్నారు. విండీస్ బౌలర్లలో రోచ్, షీల్డ్స్‌కు తలో 2 వికెట్లు దక్కాయి. అంతకు ముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులకే ఆలౌట్ అయింది. చంద్రపాల్ (52), హోప్ (56) మాత్రమే అర్ధ సెంచరీలతో రాణించారు. జేకబ్ డఫీ 5 వికెట్లు తీసి వెస్టిండీస్‌ను కుప్పకూల్చాడు. హెన్రీ 3, ఫౌల్క్స్ 2 వికెట్లు తీశారు. దీనికి ముందు న్యూజిలాండ్ కూడా తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోర్‌కే (231) ఆలౌట్ అయింది. కేన్ విలియమ్సన్ (52), బ్రేస్‌వెల్ (47) ఓ మోస్తరు స్కోర్లు చేయడంతో న్యూజిలాండ్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. విండీస్ బౌలర్లు తలా చెయి వేసి న్యూజిలాండ్‌ను తక్కువ స్కోరుకు పరిమితం చేశారు.



## రూట్ వీరోచిత సెంచరీ

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ ఆస్ట్రేలియా గడ్డపై తన టెస్టు సెంచరీ నిరీక్షణకు తెరదించాడు. గత 12 ఏళ్ల ప్రయత్నాన్ని ఎట్టకేలకు నెరవేర్చుకున్నాడు. యాషెస్ సిరీస్ 2025-26లో భాగంగా బ్రిస్బేన్ వేదికగా గురువారం ఆసిస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో రూట్ సెంచరీతో చెలరేగాడు. కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన రూట్ జట్టు బాధ్యతను తన భుజాలపై వేసుకున్నాడు. ఓపెనర్ జాక్ క్రాలీతో కలిసి స్కోర్ బోర్డును పరుగులెట్టించాడు. ఈ క్రమంలో రూట్ 181 బంతుల్లో తన 40వ టెస్టు సెంచరీ మార్కును అందుకున్నాడు. ఓవరాల్‌గా ఇది అతడికి 59వ అంతర్జాతీయ సెంచరీ. యాషెస్ రెండో టెస్టు తొలి రోజు ఆటలో కంగారుల జట్టుపై ఇంగ్లండ్ పై చేయి సాధించింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లు నష్టానికి 329 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో రూట్‌తో పాటు, ఆర్చర్ (32 నాటౌట్) ఉన్నాడు. వీరిద్దరూ పదో వికెట్‌కు 61 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. మిచెల్ స్టార్క్ నిప్పులు చెలరేగడంతో ఇంగ్లండ్ తొలి రోజే ఆలౌట్ అయినట్లు కన్పించింది. కానీ రూట్, ఆర్చర్ ఆఖరి వికెట్ కోల్పోకుండా పోరాడారు. ఆసిస్ బౌలర్లలో స్టార్క్ మరోసారి 6 వికెట్లు పడగొట్టగా, నసీర్, బోలాండ్ తలా ఒక వికెట్ సాధించారు.

### మహిళల వరల్డ్ కప్‌లో..

# భారత్ ఓటమి

### 1-3 తేడాతో జర్మనీ విజయం

**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల ప్రపంచ కప్ 2025 లో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. శాంటియాగోలో మహిళల ప్రపంచ కప్ క్యాంపెయిన్‌లో భారత హాకీ జట్టు తమ రెండో మ్యాచ్‌లో జర్మనీతో 1-3 తేడాతో ఓటమి పాలైంది. భారత్ తరఫున హీనా బానో (58వ నిముషం) ఏకైక గోల్ చేసింది. జర్మనీ తరఫున లీనా ఫ్రెరిచ్స్ (5), అన్నికా స్కోన్‌హాఫ్ (52), మార్టినా రీసెనెగర్ (59) స్కోర్‌షీట్‌లో నిలిచారు. ఈ పోటీలో జర్మనీ తొలి గోల్స్‌లో భారత్‌ను వెనుకకు నెట్టి 5 వ నిమిషంలోనే పెనాల్టీ స్ట్రోక్‌ను అందుకుంది. లీనా ఫ్రెరిచ్స్ (5) జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించింది. ప్రారంభంలో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ రెండవ క్వార్టర్‌లో సమం చేసే దిశగా భారత్ యత్నించింది. మరో పెనాల్టీ స్ట్రోక్‌తో, రెండవ అర్ధభాగం ముగిసే సమయానికి జర్మనీ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. తీవ్రమైన మూడు క్వార్టర్ల తర్వాత, ఆట వేగం కొద్దిగా తగ్గింది, చివరి క్వార్టర్‌లోకి అడుగుపెట్టే సమయానికి భారత్ 1 గోల్ చేసినా వెనుకబడి ఉంది. స్కోర్‌లను సమం చేసే గోల్ కోసం భారత ఆటగాళ్లు ప్రయత్నించి మరో పెనాల్టీ కార్నర్ నుండి దగ్గరగా వచ్చారు. కానీ గోల్ చేయలేకపోయారు. చివరికి అన్నికా స్కోన్‌హాఫ్ (52) ట్యాప్‌ఇన్ చేయడంతో జర్మనీ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. సమయం ముగియడంతో, పెనాల్టీ కార్నర్ నుండి సకాలంలో గోల్‌ను గోల్‌గా మార్చిన హినా బానో (58) సహాయంతో భారత్ స్పందించింది. అయితే, మార్టినా రీసెనెగర్ (59) జర్మనీ తరఫున మూడో గోల్ చేయడంతో, ఈ పోటీలో జర్మనీకి మూడు పాయింట్లు లభించి విజయం సాధించింది.





### ఇండియన్ టూర్ స్క్వాష్‌లో..

# సెమీస్‌కు భారత్

**న్యూఢిల్లీ:** ఇండియన్ టూర్ 4 స్క్వాష్‌లో నలుగురు భారతీయులు సెమీస్ చేరుకున్నారు. హెచ్‌సిఎల్ స్క్వాష్ ఇండియన్ టూర్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదు గేమ్‌ల థ్రిల్లర్‌లో మాజీ ప్రపంచ 10వ ర్యాంకర్ జోష్నా చిన్నప్ప ఈజిప్టు రెండవ సీడ్ నార్డిన్ గరాస్‌ను ఓడించింది. దీంతో నలుగురు భారతీయులు చివరి నాలుగు దశకు చేరుకున్నారు. ప్రస్తుత పురుషుల, మహిళల ఛాంపియన్లు వేలవన్ సెంథిల్‌కుమార్, అగ్రశ్రేణి అనాహత్ సింగ్ వరుస గేమ్‌ల విజయాలు నమోదు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. పురుషుల రెండవ సీడ్ వీర్ చోత్రాని నిష్క్రమించాడు. ప్రపంచ 46వ ర్యాంకర్ సెంథిల్‌కుమార్ శ్రీలంకకు చెందిన రవిందు లక్షి ని 11-7, 11-8, 11-7 తేడాతో ఓడించగా, ప్రపంచ 29వ ర్యాంక్‌లో ఉన్న ఢిల్లీ టీనేజర్ అనహత్, భారత టాప్ సీడ్ జట్టుకు మొదటి రౌండ్ బైలు లభించడంతో ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తమరా హోల్జ్‌బౌరోవా (చెక్ రిపబ్లిక్)ను 11-7, 11-7, 11-7 తేడాతో ఓడించింది. మహిళల మాజీ ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి జోష్నా చిన్నప్ప, మహిళల ఆరో సీడ్ తన్వి ఖన్నా, పురుషుల రెండో సీడ్ వీర్ చోత్రాని కూడా చివరిఎనిమిది స్థానాల్లోకి ప్రవేశించిన ఇతర భారతీయులుగా ఉన్నారు.

ఆట

# ఇద్దరి వల్లే భారత్‌కు ఓటమి

### చెత్త ఫీల్డింగ్.. లోయరార్డర్ బ్యాటింగ్ విఫలం

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో రెండో వన్డేలో టీమిండియా ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. 358 పరుగుల భారీ స్కోర్ చేసిన తర్వాత కూడా ఓడిపోవడం ఏంటని మండిపడుతున్నారు. విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ అద్భుతమై శతకాలతో చెలరేగినా, తొలి వన్డే కంటే 9 పరుగులు అదనంగా చేసినా విజయం దక్కకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్యూ ఫ్యాక్టర్‌తో పాటు లోయరార్డర్ బ్యాటింగ్ వైఫల్యం, చెత్త ఫీల్డింగ్, టాస్ ఓడిపోవడం టీమిండియా ఓటమికి ప్రధాన కారణాలని బిసిసిఐ విశ్లేషించింది. ఇందుకు స్పిన్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లపై విమర్శలు కురుస్తున్నాయి. చివర్లో ఈ ఇద్దరూ దూకుడుగా ఆడి పరుగులు చేయకపోవడం వల్లే టీమిండియా ఓడిపోయింది. జడేజా, సుందర్ దూకుడుగా ఆడి ఉంటే భారత్ 380, 400 పరుగుల లక్ష్యం నమోదు చేసేదని అప్పుడు భారత విజయవకాశాలు మెరుగయ్యేవి.. అలాగే పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా లేకపోవడం టీమిండియాకు నష్టం చేసింది. 39 ఓవర్లు పూర్తయ్యేసరికి భారత్ 3 వికెట్లకు 284 పరుగులతో బలమైన స్థితిలో నిలిచింది. భారత బ్యాటింగ్ జోరును చూసి ఈజీగా 400 పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే చివరి 11 ఓవర్లలో భారత్ కేవలం 74 పరుగులు మాత్రమే చేసింది. ఫినిషర్ పాత్ర పోషించాల్సిన జడేజా 27 బంతుల్లో 24 పరుగులే చేశాడు. వాషింగ్టన్ సుందర్ 8 బంతుల్లో 1 పరుగే చేసి వెనుదిరిగాడు. రాహుల్ ఒక్కడే 43 బంతుల్లో 66 పరుగులు చేశాడు. జడేజా కూడా అతనికి సహకారం అందించి ఉంటే భారత్ 20, 30 పరుగులు అదనంగా చేసి ఉండేది. లోయార్డర్ వైఫల్యం ఓటమికి కారణమైంది. లోయరార్డర్‌లో ఆడింది జడేజా, సుందర్‌లు మాత్రమే. ఈ మ్యాచ్‌లో విపరీతమైన మంచు ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయడం చాలా కష్టంగా మారింది. దీంతో అంపైర్లు బంతిని మార్చారు. ఇక టాస్ కీలక పాత్ర పోషించింది. కోహ్లీ, రుతురాజ్ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. మంచి టెంపో అందించారు. అయినా టాస్ ఓడటం, ఫీల్డింగ్‌లో కూడా తప్పిదాలు చేయడం, కొన్ని పరుగులును ఆపలేకపోవడం కూడా మరికొన్ని కారణాలుగా ఉన్నాయి.



# యుఎఇ నుంచి భారత్‌కు భారీ జమలు!

**అబూదాబి, డిసెంబరు 4:** డాలరుతో రూపాయి చెలామణి గణనీయంగా పతనం కావడంతో గల్ఫ్‌దేశాల్లోని భారతీయులు స్వస్థలాలకు నగదు జమలు ఒక్కసారిగా పెంచేసారు. మారకంలో రూపాయిలు ఎక్కువ స్తుండటంతో ప్రముఖ గల్ఫ్ దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచే ఎక్కువ జమలు అందుతున్నాయి. భారత రూపాయి విలువలు భారీగా పతనం కావడంతో, అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపే డబ్బు (రెమిటెన్స్‌లు) ఏకంగా మూడింతలు పెరిగినట్లు గల్ఫ్‌పత్రిక ఒకటి వెల్లడించింది. ప్రస్తుతం ఒక యుఎఇ దిర్హమ్‌కు 24.5 భారత రూపాయల మారకం విలువ లభిస్తుండటంతో, ఇదే సరైన సమయమని భావించి ఎన్నారైలు పెద్ద మొత్తంలో డబ్బు పంపుతున్నారు. యుఎఇ కరెన్సీ అయిన దిర్హమ్‌ను రూపాయితో మార్చుకున్నప్పుడు గతంలో కంటే ఎక్కువ మొత్తం చేతికి వస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని అక్కడి భారతీయులు చెబుతున్నారు. షార్జాలో నివసించే ఆరిఫ్ ఖాన్ అనే వ్యక్తి మాట్లాడుతూ, ప్రతినెలా 1,200 నుంచి 1,500 దిర్హమ్‌లు పంపేవాడినని, కానీ రూపాయి పతనం కారణంగా ఈసారి 4,500 దిర్హమ్‌లు పంపినట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయివిలువ రికార్డు కనిష్ఠా నికి పడిపోయింది. విదేశీ పెట్టుబడులు వెనక్కివెళ్లడం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితివంటి కారణాలతో రూపాయి బలహీనపడుతోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి చేరింది. ఈ పతనం మరికొంత కాలం కొనసాగవచ్చని, రూపాయి విలువ 91 మార్కునుకూడా తాకే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.




# కొనసాగుతూనే ఉన్న రూపాయి పతనం!

**ముంబయి, డిసెంబరు 4:** అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల నేపథ్యంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ పతనం కొనసాగుతూనేఉంది. ముందురోజు చరిత్రలో తొలిసారిగా 90 మార్కును దాటిన రూపాయి, ఇవాళ్టి ట్రేడింగ్‌లో మరో 22 పైసలు నష్టపోయి మరింత బలహీనపడింది. గత ముగింపు 90.19తో పోలిస్తే, గురువారం ఉదయం 90.41 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడి దారులు (ఎఫ్‌ఐఐలు) భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి వరుసగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడికి కారణమవుతున్నాయని మార్కెట్ నిపుణులు అంచనావేసారు. బుధవారం ఒక్కరోజే ఎఫ్‌ఐఐలు రూ. 3,692 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇదే సమయంలో దేశీయ సంస్థాగత పెట్టుబడి దారులు (డీఐఐలు) రూ. 4,730 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. రూపాయి విలువ ఇంతలా పడిపోతున్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇప్పటివరకు పెద్దగా జోక్యం చేసుకోకపోవడం కూడా పతనానికి ఒక కారణంగా కనిపిస్తోంది. రాబోయే ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ఈ విషయంపై దృష్టి సారించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. స్వల్ప కాలంలో ప్రతికూలతలు ఉన్నప్పటికీ, దేశంలో బలమైన ఆర్థిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం, కంపెనీల ఆదాయాలు మెరుగుపడటం వంటి సానుకూల అంశాలు మధ్యకాలంలో మార్కెట్‌కు మద్దతుగా నిలుస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# నష్టాలనుంచి లాభాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

### ఐటిషేర్ల కొనుగోళ్ల మద్దతు..



**ముంబయి, డిసెంబరు 4:** దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజుల వరుస నష్టాలనుంచి రికవరీ అయ్యాయి. గురువారం జరిగిన ట్రేడింగ్‌లో సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం మార్కెట్లకు కలిసొచ్చింది. శుక్రవారం వెలువడనున్న ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో లాభాలు పరిమితంగానే ఉన్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 158.5 పాయింట్లు లాభపడి 85,265.32 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 47.75 పాయింట్లు పెరిగి 26,033 వద్ద ముగిసింది. సెక్టార్ల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.4 శాతం లాభ పడింది. రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, ఫార్మా రంగాలు కూడా రాణించాయి. మరోవైపు, నిఫ్టీ మీడియా సూచీ 1.45శాతం నష్టపోయింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మాత్రం బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.24 శాతం క్షీణించింది. సెన్సెక్స్ షేర్లలో టిసిఎస్, భారత్ ఎలక్ట్రానిక్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధానంగా లాభపడగా రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్ నష్టపోయాయి. ఇక ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 28 పైసలు బలపడి 89.91 వద్ద ట్రేడ్ అయింది. ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై కొత్త ఆశలతో ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించిందని విశ్లేషకులు తెలిపారు.



# సిబ్బంది కొరతతో 170కిపైగా ఇండిగో సర్వీసులు రద్దు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** దేశంలోని అతిపెద్ద బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగోకు సిబ్బందికొరత కారణంగా సర్వీసులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గురువారం కూడా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో పెద్ద సంఖ్యలో విమానాలను రద్దు చేయడంతో వేలాది మంది ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో ఇండిగో కార్యకలాపాలు స్తంభించాయి. గురువారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరాల్సిన 30కి పైగా విమానాలు, హైదరాబాద్‌లో సుమారు 33 విమానాలు రద్దయ్యాయి. నేడు దేశవ్యాప్తంగా 170కిపైగా ఇండిగో విమానాలు రద్దయినట్లు తెలుస్తోంది. అవకాశం ఉంది. ముందురోజు కూడా నాలుగు ప్రధాన నగరాల్లో కలిపి దాదాపు 200 సర్వీసులను నిలిపివేశారు. విమానాల రద్దుపై స్పందించిన ఇండిగో సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగిందని అంగీకరిస్తూ, ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. ఊహించని కార్యాచరణసవాళ్లు, సాంకేతికలోపాలు, శీతాకాలం షెడ్యూల్ మార్పులు, సిబ్బంది రోస్టరింగ్‌కు సంబంధించిన కొత్త నిబంధనలు కారణాలు తమ కార్యకలాపాలపై ప్రభావం చూపాయని తెలిపింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రాబోయే 48 గంటల పాటు షెడ్యూళ్లలో సర్దుబాట్లు చేస్తున్నామని, త్వరలోనే సేవలను సాధారణ స్థితికి తీసుకొస్తామని పేర్కొంది. విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రంగంలోకి దిగింది. విమానాల రద్దుకు గల కారణాలపై పూర్తి నివేదిక సమర్పించాలని, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఇండిగోను ఆదేశించింది. నవంబర్ నెలలో ఏకంగా 1,232 విమానాలను ఇండిగో రద్దు చేసినట్లు డీజీసీఏ తెలిపింది. వీటిలో 755 విమానాలు సిబ్బంది కొరత, ఎఫ్‌డిటిఎల్ నిబంధనల వల్లే రద్దయ్యాయని పేర్కొంది. 84.1 శాతంగా ఉన్న ఇండిగో ఆన్ టైమ్ పనితీరు నవంబరుకు 67.7 శాతానికి పడిపోయింది.



# 341% రిటర్నులు తెచ్చిన గోల్డ్‌బాండ్స్!

**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** పసిడిబాండ్లలో పెట్టుబడులు పెట్టినవారికి ఇటీవలి కాలంలో పెరుగుతున్న పసిడిధరలు కనకవర్షం కురిపిస్తోంది. 8 ఏళ్లక్రితం పసిడిబాండ్లు కొన్నవారికి రికార్డుస్థాయి లాభాలు అందించాయి. రిడెంప్షన్‌కు వచ్చిన అన్నిబాండ్లదీ అదే తీరులోఉంది. 2017 డిసెంబరు 4న జారీచేసిన 2017-18 సిరీస్-10కు సంబంధించిన తుది రిడెంప్షన్ ధరను ఆర్బీఐ ప్రకటించింది. అప్పట్లో పెట్టుబడి పెట్టినవారికి 341శాతం రిటర్నులు వచ్చాయి. ఈ సిరీస్ బాండ్లు 2017 నవంబరు 27,28 తేదీల్లో కొనుగోలుకుతెచ్చారు. డిసెంబరు 4తేదీని సెటిల్‌మెంట్‌తేదీగావెల్లడించారు అప్పట్లో గ్రాము బంగారంధర రూ.2961గా నిర్ణయించారు. ఎనిమిదేళ్ల కాలపరిమితి పూర్తికావడంతో తాజాగా మెచూరిటీకి వచ్చిన ఈ బాండ్లు భారీ రిటర్నులు తెచ్చాయి. 999స్వచ్ఛత కలిగిన గ్రాము బంగారం రూ.12,820గా నిర్ణయించింది. కొనుగోలు ధరను మినహాయిస్తే ఒక్కో గ్రాముపై రూ.9901 రిటర్నులువచ్చాయి. అప్పట్లో రూ.1లక్ష పెట్టుబడిపెడితే వారికి ఇపుడు రూ.4.41 లక్షలు అవుతున్నది. భౌతికంగా బంగారం కొనుగోళ్లను తగ్గించే లక్ష్యంతో 2015 నవంబరులో కేంద్రం ఈ గోల్డ్‌బాండ్‌స్కీం తెచ్చింది. కాలపరిమితి 8 ఏళ్లు. గ్రాముధర నిర్ణయించేందుకు రిడెంప్షన్ ముందు వారం చివరిమూడు రోజులు ఇండియా బులియన్ అండ్ జ్యుయెలర్స్ అసోసియేషన్ సగటుధరను పరిగణనలోనికి తీసుకుంటారు.

# అత్యంత సురక్షిత బ్యాంకుల్లో ఎస్‌బిఐ, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ!

### జాబితాను ప్రకటించిన రిజర్వుబ్యాంకు



**ముంబయి, డిసెంబరు 4:** ప్రస్తుతం ఆర్థికసంవత్సరంలో అత్యంత సురక్షితంగా పనితీరుకనబరిచిన బ్యాంకుల జాబితాను ప్రకటించింది. మరోసారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ ఈ జాబితాలో చోటుసాధించాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన బ్యాంకులుగా దీనిని ఆర్బీఐ ధ్రువీకరించింది. అంటే వీటినే అత్యంత సురక్షితమైన బ్యాంకులుగా గుర్తించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవని ఎలాంటి వైఫల్యాలు సంభవించినా, సమస్య తలెత్తినా అప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపించగలదు. ఈ బ్యాంకుల స్థిరత్వం నిర్ధరించేందుకు, ఆర్థిక పరంగా అన్ని ఆటంకాల్ని తట్టుకునేందుకు రెగ్యులేటరీ నిబంధనలు కూడా వీటిల్లో కాస్త కఠినంగానే ఉంటాయి. 2014లో తొలిసారిగా ఆర్బీఐ ఈ డీసిబ్ ఫ్రేమ్‌వర్క్ ప్రవేశపెట్టింది. 2015 నుంచి దేశంలోని కీలక సంస్థల్ని గుర్తిస్తూ వస్తోంది. బ్యాంకుల నుంచి సేకరించిన డేటా ఆధారంగా దీనిని ఆర్బీఐ రూపొందిస్తుంటుంది. మొదటిసారిగా ఇందులో ఎస్బీఐనే అదే సంవత్సరం చేరింది. తర్వాత 2016లో ఐసిఐసిఐ బ్యాంక్ చేరింది. 2017లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఈ లిస్టులో చేరింది.

ఇవి అధిక స్థాయి మూలధనాన్ని కలిగి ఉండాలి. ఇంకా ప్రత్యేకంగా అదనపు కామన్ ఈక్విటీ టైర్ 1 (సిఇటి1) మూలధనం నష్టాల్ని సమర్థంగా నిర్వహించేందుకు, రిస్క్‌ను తట్టుకునేందుకు ఉండాలి. అంటే సురక్షిత బ్యాంకులుగా ఉండాలంటే ఎలాంటి ఆర్థిక పర ఇబ్బందులు లేకుండా తగినంత మూలధనం కలిగి ఉండాలి. ఈ సిఇటి 1 ను బట్టే ఆర్థిక ఒత్తిళ్లను తటుకోగలిగి సురక్షితమైనవా కావా అనేది తెలుస్తుంది. ఆర్బీఐ డేటా ప్రకారం ఎస్బీఐ 0.80 శాతంతో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.40 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.20 శాతంతో ఉంది. ఇక ఈ బ్యాంకులే అత్యంత సురక్షితమైనవిగా నమ్మొచ్చు. దాని ప్రకారమే ఆ బ్యాంకుల్లో డబ్బు దాచొచ్చా వద్దా అనేది నిర్ణయించుకోవాలి. ఈ బ్యాంకులకే దేశవ్యాప్తంగా ఎక్కువగా కస్టమర్లు ఉంటారని చెప్పొచ్చు. కొన్ని బ్యాంకులు దివాలా తీస్తుంటాయి. అప్పుడు డబ్బు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14